# లోకానికి నేనే వెలుగు

జూబిలీ 2025

నిరీక్షణా యాత్రికులు



















# మహా జూబిలీ సంవత్సరము 2025

సంపుటి : 48 జనవరి - మార్చి 2025 సంచిక : 1

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

**సంపాదక వర్గం :**

ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ సగినాల ప్రకాష్
ఫాదర్ దొడ్డ రాజా
ఫాదర్ మేడంకి ఆనంద్ అంధ్రూ

**గురు విద్యార్థుల బృందం :**

బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగుళ్ళ ప్రదీప్‌కుమార్
బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్
బ్రదర్ పగుర్ల భానుప్రసాద్
బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్
బ్రదర్ బడిపాటి జాకబ్
బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్
బ్రదర్ బాలసాని ప్రభు దాస్
బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర
బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్
బ్రదర్ కాకుమాను జాన్‌రాజు
బ్రదర్ కొట్టె అరవింద్
బ్రదర్ తుడుం సంపత్
బ్రదర్ తురకా మహేష్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా
**St. John's Regional Seminary Society, Hyderabad**
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 48 జనవరి–మార్చి 2025 సంచిక : 1

## మహా జూబిలీ సంవత్సరము
## 2025

**ఫాదర్ సగినాల ప్రకాష్**

సంచిక సంపాదకులు

మరియు

ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామాంతపురం, హైదరాబాదు–500 013.

ఫోన్ : 91-040-29561761, 29561762

E-mail : stjohnshyd2@gmail.com

Website : stjohnseminaryhyd.org

# విషయసూచిక

**సంపాదకీయం**

*- ఫాదర్ సగినాల ప్రకాష్*........................................ **05**

**1. జూబిలీ చిహ్నం**

*- ఫాదర్ సగినాల ప్రకాష్*........................................ **08**

**2. జూబిలీ సంవత్సర ప్రత్యేక ప్రార్థన - 2025**

*- ఫాదర్ కుర్మా తోమస్* ........................................ **10**

**3. భద్రతా సిబ్బంది జూబిలీ**

*- బ్రదర్ కాకుమాను జాన్ రాజు*................................ **14**

**4. వ్యాధిగ్రస్తుల మరియు ఆరోగ్య సంరక్షకుల జూబిలీ**

*- బ్రదర్ పాగుర్ల భానుప్రసాద్* ................................**19**

**5. దివ్యాంగుల జూబిలీ**

*- బ్రదర్ బాలసాని ప్రభుదాస్* ................................ **26**

**6. శ్రామికుల జూబిలీ**

*- బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర* ................................ **34**

**7. కుటుంబాల, అవ్వతాతల మరియు వయోవృద్ధుల జూబిలీ**

– *బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్* ............................. **42**

**8. యువతా జూబిలీ**

– *బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్*............................... **49**

**9. సువార్తా సేవకుల జూబిలీ**

– *బ్రదర్ కొట్టె అరవింద్* ....................................... **57**

**10. పేదల జూబిలీ**

– *బ్రదర్ తురక మహేష్* ....................................... **63**

**11. ఖైదీల జూబిలీ**

– *బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్* .......................... **74**




# సంపాదకీయం



2025 సంవత్సరాన్ని మహా జూబిలీ సంవత్సరంగా పరిశుద్ధ పాపుగారు ప్రకటించారు. ఆంశగా అనేకమైన పుస్తకాలు, సూచనలు, కార్యక్రమాలు ఏర్పటు చేశారు. ఈ జూబిలీ చిహ్నంగా "నిరీక్షణ నిరాశపరచదు" అన్ననిదానంతో శ్రీసభను ముందుకు వెళ్ళమన్నారు. నిరీక్షించిన ప్రతివారికి తప్పక ఊరట కలుగుతుందని, ఆశకు ప్రతి ఫలం దక్కుతుందని పలు వ్యాసాలలో, సందేశాలలో పదేపదే పునరుద్ఘటించారు.

ఈ జూబిలీ సంవత్సరం చిహ్నాన్ని తయారు చేసి ప్రజల ముందుకు తెచ్చారు. అందులోని విశేషాలను, సూచనలను ఈ సంచికలో వివరించాము. సంవత్సరాంతము, వేడుకగా చేసుకోవడానికి, ప్రార్ధనాపూర్వక వాతావరణాన్ని కలుగజేస్తూ ప్రత్యేక దివ్యపూజ గ్రంధాన్ని ఏర్పాటు చేశారు. అది తెలుగులోకి అనువాదం చేయబడి చక్కని రూపంలో మన తెలుగు కతోలిక పీఠాధిపతుల సమాఖ్య, దైవార్చన సంఘం మన ముందుకు తెచ్చింది. అలాగే సంఘంలోని ప్రతివర్గాన్ని దృష్టిలో ఉంచుకొని, వారి కోసం సమయాన్ని కేటాయిస్తూ, ప్రత్యేక పూజలు, ప్రార్థనాలు చేయడానికి వెసులుబాటు కల్పించారు. ఈ జూబిలీ సంవత్సరం ఒక ఆధ్యాత్మిక యాత్రగా ప్రజలు భావిస్తూ, రెండు వేల ఇరవై ఐదు సంవత్సరాల క్రితం ఈ లోకంలో జన్మించిన దైవకుమారుని ఘనంగా ఆరాధించడానికి యావత్ శ్రీసభను సంసిద్ధం చేశారు.

ఈ సంచికలో వ్రాయబడిన వ్యాసాలలో వివిధ వర్గాలను దృష్టిలో ఉంచుకొని వారి కొరకు ప్రార్థించే విధంగా రచనలు చేశారు. గురువిధ్యార్థులు సమాచారాన్ని సేకరించి, మూలార్థాన్ని విపువీరికరిస్తూ, జూబిలీ అర్థాన్ని వివరిస్తూ,

ఈ రచనలు చేశారు. సమాజంలోని వివిధ వర్గాలలోని శ్రామిక, సేవ, ఆరోగ్య, సైనిక సామాజిక మొదలగు వర్గాలు వారి విశిష్టసేవలు, వారికొరకు ప్రార్థించవలసిన అవసరము ఇందులో విపులీకరించబడింది. పాఠకులు ఈ వ్యాసాలను చదివి, పరిశుద్ధ పాపుగారి ఆలోచనలు, ఆధ్యాత్మిక సూచనలు ఆకళింపు చేసుకోవాలని మనవి చేస్తున్నాము.

శ్రీసభ అచలనమైనదికాదు. ఆ తల్లి ఎప్పుడూ జీవంతో తన బిడ్డలను ముందుకు నడిపిస్తుంది. ప్రేరణలో అనేక విషయాలను తెలియజేస్తుంది. నిరాశలోనున్న ప్రతి ఒక్కరినీ వెన్నుతట్టి ప్రోత్సహిస్తుంది. అట్టి శ్రీసభలో సభ్యులమైనందుకు మనమందరం గర్వించాలి. పరిశుద్ధ పాపుగారు కోరుకున్న విధంగా ఆధ్యాత్మిక యాత్రను జయప్రధం చేస్తూ ఈ జూబిలీ సంవత్సరాన్ని అర్థవంతంగా చేసుకోవాలి. దాని వల్ల తిరుసభ మనందరికి నూత్నమూర్తిగా ఇచ్చే ఆప్యాయతతో కుడిన ఆధ్యాత్మిక పిలుపు.

ప్రభూ సేవలో.....

**ఫాదర్ సగినాల ప్రకాష్**

సంచిక సంపాదకులు


జూబిలీ 2025
నిరీక్షణా యాత్రికులు

# 1. జూబిలీ చిహ్నం

– ఫాదర్ సగినాల ప్రకాష్



సినడాలిటీలోని చిహ్నం చాలా అర్థవంతంగా రూపొందించబడింది. 2025 జూబిలీ సంవత్సరపు ప్రాధాన్యతను, అందులోనున్న లోతైన భావాలను ఈ చిహ్నం తెలియజేస్తుంది. ఫ్రాన్సిస్ పాపుగారు తలపెట్టిన జూబిలీలోని పరమార్థం తెలుసుకోవడానికి ఈ చిహ్నం క్లుప్తంగా చిత్రీకరించబడింది. ఇందులోని ప్రతి గీతకు ఒక అర్థముంటుంది.

## నలుగురు వ్యక్తులు

చిత్రంలో కనిపిస్తున్న నలుగురు వ్యక్తులు ఈ విశ్వంలోని మానవులందరికీ ప్రతినిధులు. ప్రపంచలోని నాలుగు దిక్కుల నుండి, వర్ణ, వర్గ, ప్రాంత, భేదములేకుండా అందరినీ వీరు సూచిస్తున్నారు. వారు ఒకరికొకరు దగ్గరగా నిల్చుని, సన్నిహితంగా, ఉత్సాహంగా సహకారం అందించుకొంటున్నట్లు కనుపిస్తుంది. అందరూ ఒకే ఉద్దేశం కోసం శ్రద్ధాసక్తులతో శ్రమిస్తున్నట్లు కనిపిస్తుంది. మనందరి ఐక్యత, ఆదరణ ప్రేమకు ఇది సంకేతం. ముందున్న మొదటి వ్యక్తి సిలువ ఆకారాన్ని పట్టుకొని ఉంటాడు. విశ్వాసంతో అతడు సిలువను ఆలింగనం చేసుకొంటున్నట్లు గోచరిస్తుంది. రెండవ వ్యక్తి అతనికి సహాయం చేస్తు అండగా నిల్చునట్లు, ఇతర ఇద్దరు కుడా అదే భావాన్ని కలిగి ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ విశ్వాసం, నిరీక్షణ నిరంతరం మనమధ్య ప్రవహిస్తూ ఉండాలి. ఎందుకంటే అశతో కూడిన నిరీక్షణ మనలో లేకపోతే జీవితం అంధకారమవుతుంది.

## జీవన గమనంలోని అలలు

క్రింది భాగంలో బలంగా కదలాడే జలాల అలజడి గమనించాలి. నిరీక్షణ

యాత్రకుల జీవితమెప్పుడూ ఒకేలా, సుఖసంతోషాలతో ఉండదు. మనల్ని నడిపే జీవన నావ ఎప్పుడూనిశ్చల, నిర్మల జల ప్రయాణంకాదు. కష్టాలు మామూలే! సవాళ్ళు సహజమే! ఈ జీవన ప్రయానంలో ప్రతిరోజూ ఒక పరీక్షలాంటిదే! ఆ పరీక్షలను తట్టుకోవాలి. సజీవ ఆశలతో, నిరీక్షణాభావం ఎంతైనా అవసరమని ఈ సంకేతాలు తెలియజేస్తాయి. మన చూపు ప్రక్కకు తిరుగకుండా శిలువపైనే ఉండాలని, శిలువే మన చివరి గమ్యము, శిలువే మనకు తిరుగులేని విజయమని ఈ అలలు తెలియజేస్తాయి.

## లంగరు

చిహ్నంలో శిలువనుండి నీటిలోకి చేరవేసిన లంగరును గమనించాలి. పైన కనుపించే శిలువ అలలతాకిడికి విశ్వాసులు పట్టుకోల్పోకుండా, వారు ప్రయాణంచేసే జీవిత మననం స్థిరంగా ఉండాలనే లంగరు వారికి ఉపకరిస్తోంది. సాగరతీరంలో నావని సురక్షతంగా స్థిరపరచగలదు లంగరు. అలల తాకిడి నుండి నావను కాపాడేది లంగరు. తుఫాను వాతావరణంలో, అత్యవసరసమయాలలో గాలికి కొట్టుకుపోకుండా దృఢంగా నిలబెట్టేదే లంగరు. క్రైస్తవ సంప్రాదాయంలో లంగరు విశ్వాసుల జీవితంలో కలిగే వివిధ పరీక్షా సమయంలో నిలబడే దృఢత్వాన్ని, నిలకడను సూచిస్తుంది. ఈ చిహ్నం ప్రాచీన గుడులలో విరివిగా కనుపిస్తుంది. నమ్మకానికి నిర్భీతికి నిదర్శనమైన ఈ చిహ్నాన్ని పలుచోట్లు ప్రదర్శించేవారు.

## శిలువ

మనుషులు పట్టుకొన్న శిలువ ఒక స్థంభంకాదు. జీవం ఉట్టిపడేలా తనవైపుచూస్తున్న వ్యక్తులవైపు ఆప్యాయంగా ఒరిగే సజీవ గురుతుగా నిలుస్తోంది. వారిని ఒంటరిగా వదలక తనవైపు ఆకర్షిస్తూ, వారిలో సజీవమైన ఆశను, ఆకాంక్షను కలిగిస్తున్నట్లు గోచరిస్తుంది. నేను ఆకాశానికి, భూమికి మధ్య వ్రేలాడినపుడు మనుషులను నా వైపు ఆకార్షిస్తాను, అని చెప్పిన శిలువనాధుని మాటలు ఇక్కడ గుర్తుచేస్తుకోవాలి (యోహాను 12:32).

ఈ చిహ్నంలోని అడుగు భాగంలో నిరీక్షణ యాత్రికులు అనే అక్షరాలు లాటిను భాషలో ఆకుపచ్చని రంగులో వ్రాయబడి ఉంటాయి. ఆకుపచ్చని రంగు సజీవానికి, ప్రాణానికి, ఎదుగుదలకు, నిరీక్షణకు నిదర్శనం.

# 2. జూబిలీ సంవత్సర ప్రత్యేక ప్రార్థన - 2025

- ఫాదర్ కుర్మ తోమాస్



విశ్వ శ్రీసభలో 1300 సం. లో జూబిలీ వేడుకలు, అప్పటి జగద్గురువులైన బోనిఫాసు పాపుగారు ప్రారంభించగా, ఆధ్యాత్మిక మేలులను ఉద్దేశించి, అనేక మార్పులు చోటు చేసుకొని నేటికి శ్రీసభ క్రీస్తు జయంతి 2025వ సంవత్సరమును జూబిలీ వేడుకగా కొనయాడుతుంది. ఈ జూబిలీ వేడుక అనేది ఒక ఆధ్యాత్మిక వేడుక, ముఖ్యముగా దేవునితో సఖ్యపడుటకు ఒక గొప్ప అవకాశము. ప్రతీ జూబిలీ వేడుకలో పునరావృతమయ్యే అంశాలు, కృతజ్ఞత, పాపమన్నింపు, ఆధ్యాత్మిక నూత్నీకరణ, సోదర భావము, నిరీక్షణ. ఈ అంశాలు, సుగుణాలు వ్యక్తిగతముగా మేలును కలుగజేసినా, సంఘపరంగా ఇంకా ఎంతో మేలును చేకూర్చుతాయి. మనము ఈ భూమిపై ఒంటరిగా జీవించలేము, మనమంతా ఒక సంఘము, దేవుని బిడ్డలము అను సత్యాన్ని మనకు గుర్తుచేస్తుంటాయి.

2025 జూబిలీ వేడుక సందర్భముగా, పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు విశ్వశ్రీసభకు ఒక చక్కటి ప్రార్థనను అందించారు. ఈ జూబిలీ ప్రార్థనను రెండు సంవత్సరాల ముందు, జూబిలీ వేడుకకు సిద్ధపడుటకు ఫ్రాన్సిస్ పాపుగారు, 2023 మొదటి సంవత్సరమును రెండ వాటికన్ మహాసభ 4 ముఖ్యమైన పత్రాల ప్రత్యేక అధ్యయనానికి కేటాయించగా, 2024 రెండవ సంవత్సరమును ప్రార్థనా సంవత్సరముగా ఏర్పాటు చేశారు. అప్పటి నుండి జూబిలీ ప్రార్థనను 2025 జూబిలీ వేడుకకు సిద్ధపడుటకు, జూబిలీ సంవత్సరమంతా ప్రార్థించు నిమిత్తము జూబిలీ ప్రార్థన ఇవ్వబడింది. ఈ జూబిలీ ప్రార్థనను భక్తితో, ఆ ప్రార్థనలో వినియోగించిన భావాలను ఆకళింపు చేసుకొని

ధ్యాన పూర్వకముగా ప్రార్థించాలి. ఈ ప్రార్థన విశ్వశ్రీసభ ఒక కుటుంబముగా కలసి ప్రార్థించే ప్రార్థన.

## జూబిలీ ప్రార్థన

ఓ మా పరలోక తండ్రీ! / మీ కుమారుడును
మా సోదరుడైన యేసు క్రీస్తులో / మీరు మాకు ఒసగిన
విశ్వాసము, / పవిత్రాత్మ చేత మాలో క్రుమ్మరింపబడిన
దాతృత్వ జ్వాల ద్వారా, / రానున్న మీ రాజ్యమునకై /
దివ్యమైన నిరీక్షణను/ మాలో మేల్కొలపండి.

మీ కృపతో మమ్ములను, / ప్రభు వాక్కు విత్తనములు వెదజల్లే /
చురుకైన వ్యవసాయదారులుగా / రూపొందించండి.

నరకశక్తులు నశించి, / మానవత్వం వికసించి /
సకల విశ్వము హెచ్చింపబడి / ధృడ సంకల్పంతో / క్రొత్త దివి,
క్రొత్త భువికై నిరీక్షించుటకు / మీ మహిమ, వైభవము /
నిరంతరం మాలో నింపండి.

జూబిలీ మహోత్సవ కృపావరములు, / పరలోకపు
యాత్రికులందరిలో దృడపరచి, / పరలోక సంపద పట్ల
నిరీక్షణను, / ఆశను ఉత్తేజపరచండి.

రక్షకుని ఆనందము, / శాంతి, / ప్రపంచమంతటిపై
క్రుమ్మరించబడును గాక!

మా స్తుతులు ఘనత / శతాబ్ధములుగా అందుకొను దేవా!
నిరంతరము మహిమ కీర్తి మీకే కలుగును గాక!
ఆమెన్!

## జూబిలీ ప్రార్థన వివరణ

జూబిలీ ప్రార్థన కేవలము మూడు పంక్తులు మాత్రమే కలిగి ఉంది. చాలా చిన్న ప్రార్థనయైనా చాలా లోతైన భావాలు కలిగిన ప్రార్థన. మొదటి పంక్తిలో త్రియేక సర్వేశ్వరునిలో మొదటి వ్యక్తియైన పరలోక తండ్రిని సంబోధిస్తూ, తమ దివ్య కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా విశ్వాసమును ప్రసాదించి, పవిత్రాత్మ సర్వేశ్వని ద్వారా దైవ ప్రేమను రగింలింపజేయుట ద్వారా దేవుని రాజ్యము కొరకై మనలో ఉన్న నిరీక్షణను మేల్కొల్పుమని వేడుకొంటాము. మనము గమనించినట్లైతే ఈ మొదటి పంక్తిలో వేదాంత సుగుణాలైన విశ్వాసము, నమ్మిక, దైవప్రేమ అను సుగుణాలు మిళితము చేయబడ్డాయి. ఈ వేదాంత సుగుణాల గురించి కతోలిక శ్రీసభ సత్యోపదేశములో 1812 సంఖ్య నుండి 1829 సంఖ్య వరకు మనము చూడవచ్చు. మానవ సుగుణాలు, వేదాంత సుగుణాలలో నిక్షిప్తమైయున్నాయని 1812 సంఖ్య తెలియజేస్తుంది. ఈ వేదాంత సుగుణాలు మానవుడు దైవత్వములో పాలుపంచుకొనుటకు సుముకతను కలుగజేస్తాయి. ఈ వేదాంత సుగుణాలు దేవునిలో అనుసంధానమై ఉంటాయి. క్రైస్తవ విశ్వాసులకు త్రియేక సర్వేశ్వరునితో సత్సంబంధం కలిగి ఉండుటకు తోడ్పడతాయి. ఈ మొదటి పంక్తి దేవునికి మనకు ఉన్న దగ్గర సంబంధాన్ని గుర్తుచేస్తుంది, వారిపై మన విశ్వాసము, జీవనము ఆధారపడియున్నవని తెలియజేస్తుంది. త్రియేక సర్వేశ్వరుడు మానవాళికి చేసిన మేలులను తలంచుకొని కృతజ్ఞతాభావము కలిగి జీవించాలను సత్యమును మనకు గుర్తుచేస్తుంది.

రెండవ పంక్తిలో దైవకృప వలన విశ్వాసముతో సువార్త బీజాలను వెదజల్లుటలో అవిశ్రాంతముగా పనిచేయు వారినిగా మనలను దీవించమని, ఈ పరిచర్య సర్వమానవాళిని, విశ్వమంతటిని రూపాంతరముచేయునుగాక అని విన్నవిస్తూ, చెడును పారద్రోలి, త్రియేక దేవుని మహిమ నిత్యము ప్రకాశించు ఒక క్రొత్త దివి, భువి కొరకు ఎదురు చూచు వారినిగా విశ్వాసులను దీవించమని విన్నవిస్తుంది. ఈ పంక్తి తండ్రి దేవుని రక్షణ ప్రణాళికను మనకు గుర్తుచేస్తుంది, క్రొత్త దివి, భువి కొరకు నిరీక్షించుటను ఏవిధముగా తమ దివ్యకుమారుడు

పవిత్రాత్మ శక్తి వలన ఆయన చిత్తాన్ని నెరవేర్చుట ద్వారా నిత్యము ఆయన కుడి ప్రక్కన కూర్చొని పరిపాలిస్తున్నారను సత్యాన్ని కూడా మనకు తెలియజేస్తుంది.

మూడవ పంక్రిలో ప్రత్యేకముగా ఈ జూబిలీ సంవత్సరములో నిరీక్షణ యాత్రికులుగా పరలోక సంపద పట్ల తృష్ణ కలిగి ఉండునట్లు, రక్షకుడు మనకొసగిన సంతోషము, సమాధానము ప్రంచములో ప్రతి ఒక్కరికి పంచునట్లు విన్నవిస్తూ, ఓ దేవా, ఎల్లపుడు మీకే కీర్తి స్తుతి కలుగునుగాక అను భావాలతో ముగుస్తుంది. ఈ చివరి పంక్తిలో జూబిలీ సంవత్సర ముఖ్యాంశమును ప్రస్తావిస్తుంది. మనమంతా నిరీక్షణ యాత్రికులమని ఫ్రాన్సిస్ పాపుగారు పిలుస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం ప్రపంచములో చోటు చేసుకొన్న పరిస్థితుల వలన, ముఖ్యముగా కోవిడ్–19 బారినపడి అనేక మంది ప్రాణాలు కోల్పోయారు, చాలా మంది తమ తల్లిదండ్రులను, బిడ్డలను, తోబుట్టువులను, ప్రియమైన వారిని కోల్పోయారు. ప్రపంచ ప్రజలలో, విశ్వాసులలో ఆధ్యాత్మిక విలువలు, జీవిత విలువలు కొరవడుట, కుటుంబ వ్యవస్థ అనేక పరీక్షలకు గురియగు సందర్భములో, జీవితముపై విరక్తి, మనుషులలో ద్వేషము, పగ, అవినీతి వలన విశ్వాసులు, ప్రపంచ ప్రజలు నిరీక్షణను కోల్పోతుండగా, ఈ 2025 జూబిలీ, రక్షకుని కొరకు నిరీక్షణతో ఎదురు చూచిన మన పూర్వీకులను సూచిస్తూ, క్రీస్తు ప్రభు మనుష్యవతారము, మరణ పునరుత్థానము ద్వారా మనకొసగిన నిరీక్షణ మనకు నిరాశను కలిగించదు అను పునీత పౌలుగారు రోమా పౌరులకు ఇచ్చిన పిలుపును మనకు గుర్తు చేస్తున్నారు.

మనము ఎల్లపుడు నిరీక్షణతో మన జీవిత యాత్రను కొనసాగించాలని ఈ జూబిలీ ప్రార్థన ద్వారా ఫ్రాన్సిస్ పాపుగారు ప్రతీ ఒక్కరిని ఆహ్వానిస్తున్నారు. ఈ ప్రార్థనను విశ్వాసముతో ధ్యానపూర్వకముగా ప్రార్థిస్తూ ఆధ్యాత్మిక మేలులను నిండుగా పొందాలని విశ్వ శ్రీసభతో కలసి ప్రార్థించుదాం.

❋ ❋ ❋ ❋

# 3. భద్రతా సిబ్బంది జూబిలీ

– బ్రదర్ కాకుమాను జాన్ రాజు

## పరిచయం



భద్రతా సిబ్బంది మరియు జూబిలీ అనేది సమాజంలో ముఖ్యమైన అంశాలు. భద్రతా సిబ్బంది అనగా ప్రజలను సంరక్షించడానికి కాపాడటానికి, సమాజంలో శాంతిని మరియు సురక్షితమైన వాతావరణాన్ని నెలకొల్పడానికి తయారైన ఒక సంస్థ. జూబిలీ అనగా ఆధ్యాత్మిక పునరుద్ధరణ, క్షమాపణ మరియు సమాజమును ఒక నూతన వరవడికి అడుగులు వేయడానికి ఒక ప్రత్యేక సంవత్సరం. ఈ వ్యాసంలో భద్రతా సిబ్బంది యొక్క విధులు, చరిత్ర మరియు బాధ్యతలు తెలియజేస్తూ జూబిలీ సంవత్సరమునకు మరియు భద్రతా సిబ్బందికి మధ్య సంబంధం మరియు ప్రాముఖ్యతను గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించుదాం.

## భద్రతా సిబ్బంది: నిర్వచనం మరియు ఉద్దేశం

భద్రతా సిబ్బంది, ఇతర దేశాల నుండి మరియు ఇతర అనివార్య సమస్యల నుండి కాపాడి, సంరక్షించి ప్రజలను సురక్షిత వాతావరణంలో నడిపించడానికి లేదా జీవింప చేయటానికి తోడ్పడుతుంది. వీరి యొక్క ముఖ్య ఉద్దేశం ప్రజల భద్రతను కాపాడటం, నేరాలను అరికట్టడం, అన్యాయాలకు అడ్డుగా నిలబడటం మరియు సమాజంలో శాంతిని నెలకొల్పటం. ఇది చాలా కష్టతరమైన పని మరియు శారీరక బలంతో కూడుకున్న కార్యము. ఎక్కువగా వీరు వారి కుటుంబాలను విడిచిపెట్టి దూరంగా సరిహద్దులలో పోరాడుతూ ఉంటారు. కేవలం వారి ప్రజలు బాగుండాలని మరియు శాంతి,సమాధానాలలో కలిసి

మెలిసి జీవించాలని కోరుకుంటారు. చివరకు వారి ప్రాణములు సహితం అర్పించడానికి సిద్ధంగా ఉంటారు. వారికి ఎంతో కష్టతరమైనశిక్షణ ఇస్తూ ఉంటారు. ఎందుకంటే ఎంత బలమైన సైన్యం వారి మీదకు దండెత్తి వచ్చిన ఎదుర్కొని నిలబడటానికి వీలుగా వారిని తయారు చేస్తూ ఉంటారు. వారు కొన్ని పరిస్థితుల్లో అయితే వారి యొక్క ప్రాణముల మీదకు వచ్చిన, వెనుకకు తగ్గకుండా ఎదుర్కొంటారు పోరాట పటిమని చూపిస్తారు.

## భద్రతా సిబ్బంది యొక్క చరిత్ర

పురాతన కాలంలో ప్రజలు తమ భద్రత కోసం స్వయంగా వారే కృషి చేసుకునేవారు. కాలక్రమేనా సమాజం అభివృద్ధి చెందటంతో భద్రతా సంస్థలు లేదా సాయుధ దళాలు ప్రారంభమయ్యాయి. 19వ శతాబ్దంలో పోలీసు వ్యవస్థలు ఏర్పాటు జరిగింది. సాయుధ దళాలు కూడా ఎప్పుడైతే దేశాల మధ్య లేదా సరిహద్దుల మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడటంతో ఒక్కొక్క దేశం ఒక ప్రత్యేక సైన్యమును ఏర్పాటు చేసుకోవడం జరిగింది. వారి దేశాలను ఇతర దేశాల నుండి కాపాడుకోవడానికి, రక్షించుకోవడానికి సైనికులను తయారు చేస్తూ ఉండేవారు. ఒక చిన్న కారణం చేతకాన్ని కొంత ప్రాంతం కోసం గాని ఎంతో భీకరం అయిన యుద్ధాలతో ఎంతోమంది సైనికులు తమ ప్రాణములను ఫణంగా పెడుతుండేవారు

## భద్రతా సిబ్బంది శాంతికి గుర్తు

ఈ సాయుధ దళాలు లేదా భద్రతా సిబ్బంది యొక్క జూబిలీ మొట్టమొదటిగా శాంతిని గుర్తు చేయడానికి పిలుపునిస్తోంది. నేడు హింసాత్మకమైన సమయాలను ఎదుర్కోవడానికి ప్రపంచంలోనే అన్ని ప్రాంతాలకు "జూబిలీ బుల్ ఆఫ్ ఇండక్షన్" అనే అధికార పత్రిక ద్వారా మన పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు ఇవ్వటం జరిగింది. ఈ సాధారణ జూబిలీ లేదా పవిత్ర సంవత్సరము శాంతిని నెలకొల్పు వారిని మరియు కాపాడే వారిని దేవుని యొక్క బిడ్డలు అని దేవుని వాక్కు ద్వారా మనము తెలుసుకోవచ్చును (మత్తయి 5:9).

ఈ సాధారణ జూబిలీ యొక్క ముఖ్య ఉద్దేశం ఆశ లేనివారికి మరియు

జీవితం మీద ఎలాంటి ధ్యేయం లేని వారి గురించి గుర్తు చేసుకుంటూ వారికి ఆశను మరియు నమ్మకమును కల్పించి వారిలో ఒక నూతనమైన జీవితమును, ఆశను కల్పించాలి.

## జూబిలీ యొక్క చరిత్ర

మొట్టమొదటిగా శ్రీసభలో 8వ బోనిఫాసు పాపుగారు 1300 సంవత్సరంలో క్రైస్తవ జూబిలీ వేడుకలను ప్రారంభించారు. అప్పటినుండి కొన్ని శతాబ్దాల తరబడి 25 సంవత్సరాలకు ఒకసారి సాధారణ జూబిలీ సంవత్సరం మన కతోలిక శ్రీసభలో కొనియాడపడుతుంది. కాబట్టి ఈ సంవత్సరం అనగా 2025 వ సంవత్సరం ఒక సాధారణ జూబిలీగా కొనియాడుతున్నాము. ఈ జూబిలీ ద్వారా ప్రజలలో ఒక నూత్నీకరణం రావాలని మరియు వారి జీవితాలు ఆధ్యాత్మికంగా బలపడాలని దీనిలో పరమార్థం. మన జగద్గురువులు ఫ్రాన్సిస్ పాపు గారు ఈ సంవత్సరం అంతా కూడా కొన్ని శాఖలకు కొన్ని తేదీలను ప్రకటించి ఆ రోజుల్లో వారికోసం ప్రత్యేకంగా ప్రార్థించాలని కోరి ఉన్నారు. అదేవిధంగా భద్రతా సిబ్బంది కోసం ఫిబ్రవరి 8-9 తేదీలను ప్రత్యేకంగా వారికి కేటాయించడం జరిగింది. వారు చేస్తున్న పని గుర్తించి వారిని గౌరవిస్తూ సైనికులు వారి వారి సరిహద్దుల్లో శాంతి సమైక్యతను పెంపొందించేలా వారి ప్రాణములకు ఎలాంటి ముప్పు రాకుండా ఉండాలని వారికి ధైర్యము ఇస్తున్నారు. ఈ జూబిలీ యొక్క ముఖ్య ధ్యేయం అనగా “నిరీక్షణ యాత్రికులు”.

సైనికులకు ఏ సమయంలో ఏలాంటి యుద్ధం సంభవిస్తుందో తెలియదు. ఏ విధంగా అయితే క్రీస్తు ప్రభువు దివిని వీడి భువికి వచ్చి సమాజం యొక్క పాపముల కోసం తన ప్రాణమును సైతం అర్పించారో అదేవిధంగా సైనికులు కూడా వారి ప్రాణములను ఫణంగా పెట్టి సమాజం కోసం, శాంతి సమాధానాల కోసం రేయింబవళ్లు వారు పోరాడుతున్నారు. ఇలాంటి హింసాత్మకమైన సమయాలలో వారిలో అప్పుడప్పుడు వారి జీవితాల మీద ఆశను కోల్పోతూ ఉంటారు కానీ ఆ క్రీస్తు ప్రభువే వారికి ఆశ, రక్షణ.

## మన కర్తవ్యం

వారు (సాయుధ దళాలు) మన కోసం వారి ప్రాణములను సహితం

లెక్కచేయకుండా సరిహద్దులలో మరియు ఇతర ప్రాంతాలలో పోరాడుతున్నారు కాబట్టి మనం వారి కోసం చేయవలసిన కర్తవ్యం ఏమిటి అనగా వారిలాగా మనము సరిహద్దులలోకి వెళ్లి యుద్ధం చేయటం కాదులే కానీ వారు ఎప్పుడు ప్రశాంతంగా ఉండాలని వారి యొక్క కుటుంబాలు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థన చేయాలి. వారు ఏ విధంగా అయితే దేశాలను కాపాడుతున్నారో ఆ దేశంలో ఉన్న ప్రజలను రక్షిస్తున్నారో మనం కూడా మన స్నేహితులను, బంధుమిత్రులను, మన ప్రక్కవారిని ఏలాంటి చెడు కార్యములు చేయకుండా, హింసకు పాల్పడకుండా, మంచి మార్గంలో నడిచి ప్రశాంతంగా ఉండటానికి సహాయం చేయాలి.

క్రైస్తవులైన మనం మనతో నివసించే వారికి కూడా మన బాధ్యులం. ఏ విధంగా అయితే తండ్రి దేవుడు, కయినుకు తన సోదరుడైన ఆబేలునకు తాను బాధ్యుడు అని చెప్పారో, అదేవిధంగా క్రైస్తవులైన మనం మనతో నివసించే వారికి మనము బాధ్యులం. ఎప్పుడైతే మన ప్రక్క వారు చెడు మార్గంలో పయనిస్తున్నారని తెలిసి వారిని మంచి మార్గంలో నడిపించి వారి జీవితాల మార్పు కోసం పాటుపడాలి. మన శ్రీసభ ముఖ్యముగా హింసను వ్యతిరేకిస్తూ, శాంతిని ప్రోత్సహిస్తుంది. సైనికులు కూడా దేశాల మధ్య శాంతియుతంగా ఉంటూ సత్సంబంధాలను కలిగి ఉండాలని కోరుకుంటుంది. కాబట్టి మనందరం కూడా ఆ క్రీస్తు ప్రభువు యొక్క సైనికులు లాగా మంచి కోసం పాటుపడుతూ మన సమాజం, మన సంఘం, మన గ్రామమును ఆ క్రీస్తు ప్రభు యొక్క బాటలో నడిపించడానికి ప్రయత్నం చేస్తూ అడుగులు ముందుకువేద్దాం. కాబట్టి ఇప్పటినుంచైనా ముమ్మందుగా మన కుటుంబాలలో శాంతి, సమాధానాలను నెలకొల్పుతూ మన సంఘంలో కూడా మార్పులు తీసుకురావడానికి ప్రయత్నం చేద్దాం.

**ముగింపు**

సైనికులు ఎప్పుడూ కూడా అప్రమత్తంగా ఉంటారు. ఎందుకంటే సాధారణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా బెదిరింపులు, వారి తోటి పౌరులకు ప్రాణాలకు ముప్పు కలిగించే ప్రమాదాలు మరియు రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు

హింసాత్మక ఘటనలకు పాల్పడుతూ ఉండే సమయంలో చాలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి. వారు చేసే మంచి పనులకు వారికి కృతజ్ఞతలు, వందనములు తెలుపుతూ మనము కూడా మనకు తోచిన విధంగా సమాజాన్ని మంచి మార్గంలో నడిపించడానికి మన వంతు సహాయం చేయడానికి సిద్ధంగా ఉండాలి. మాకు ఏందుకులే అని కాకుండా మనం కూడా మన ద్వారా ఎంతో కొంత మంచి చేయడానికి ప్రయత్నిస్తూ, మనం ఎప్పుడైతే జ్ఞానస్నానం మరియు భద్రమైన అభ్యంగమును స్వీకరించామో అప్పటినుండి మనం క్రీస్తు ప్రభువు యొక్క సైనికులం. ఆ విధంగా మనం నివసించే సంఘంలో, మనం నివసించే పరిసరాలలో శాంతిని నెలకొల్పుతూ మంచిని చేసే విధంగా ప్రయత్నించుదాం, సహాయపడుదాం ప్రార్థించుదాం.

❋ ❋ ❋ ❋

# 4. వ్యాధిగ్రస్తుల మరియు ఆరోగ్య సంరక్షకుల జూబిలీ

**- బ్రదర్ పాగుర్ల భానుప్రసాద్**

## ఉపోద్ఘాతం



పరిశుద్ధ ఫ్రాన్సీస్ పాపుగారు 2025వ సంవత్సరాన్ని మహా జూబిలీ సంవత్సరంగా ప్రకటించారు. ఇది ప్రతి 25 సంవత్సరాలకు ఒకసారి జరిగే కార్యక్రమం. 2025 జూబిలీ యొక్క ఇతి వృత్తం "నిరీక్షణ యాత్రికులు" *"Pilgrims of Hope"* యుద్ధం, పేదరికం, వాతావరణ మార్పు మరియు *Covid* మహమ్మారి శాశ్వత ప్రభావాలతో ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు చాలా బాధలు పడుతున్న సమయంలో మన క్రైస్తవ విశ్వాస నిరీక్షణ ప్రదర్శించడానికి ఇది ఆహ్వానం. నిరీక్షణ యాత్రికుల జూబిలీ *(Pilgrims of Hope)* మనలో ప్రతి ఒక్కరికి మన హృదయాలలో మన విశ్వాసం యొక్క జ్వాలలను తిరిగి వెలగించుకోవడానికి మరియు ఆ విశ్వాసం యొక్క వెలుగును చీటిలో ఉన్నవారితో పంచుకొవడానికి ఒక అవకాశాన్ని అందిస్తుంది.

ఇందులో భాగంగా "వ్యాధిగ్రస్తుల మరియు ఆరోగ్య సంరక్షకుల జూబిలీ"ని కూడా మనం జ్ఞాపకం చేసుకుంటున్నాం. ఏప్రిల్ 5, 2025 - ఏప్రిల్ 6, 2025 వరకు మన కతోలిక శ్రీసభ "వ్యాధి గ్రస్తుల మరియు ఆరోగ్య సంరక్షణ వైద్యులు, సేవకులు" జూబిలిని కొనియాడుతుంది. ఆరోగ్య సేవలు అనారోగులకు సేవ చేయడం అంటే కేవలం వైద్య చికిత్స అందించడం మాత్రమే కాదు. వారికి మానసిక ధైర్యం, ప్రేమ మరియు సహాయ సహకారాన్ని అందించడము ఇందులో బాగమే. ఈ రంగంలో పనిచేసే వైద్యులు, నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు,

స్వచ్ఛంద సంస్థలు, సమాజానికి  అంకిత భావంతో సేవలు అందిస్తున్నారు. ఈ సేవల వెనుక ఉన్న త్యాగం, కృషి మరియు నిరంతర శ్రమను గుర్తు చేసుకోవాడానికి ఇది ఒక ముఖ్యమైన సందర్భం. ఫ్రాన్సిస్ పాపుగారి ప్రకారం జూబిలీ అంటే అది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు, దైవిక  క్షమాభిక్ష సమాగమం, దయ మరియు సమగ్ర మార్పునకు ఓ విశేషమైన అవకాశం అని అర్థాన్నిచ్చారు.

## వైద్యుల పరిరక్షణ అనారోగుల సంరక్షణ

ఈ ప్రపంచంలో మనిషి కళ్ళుమూసుకుని నమ్మేది ముగ్గురిని 1. దేవుడు 2. వైద్యుడు, 3. వాహనదారుడు. దేవుడు మనిషి చేసిన తప్పిదములను ఖండిస్తాడు. అలాగే తన సృష్టి ద్వారా ఈ లోకానికి మానవుడు పరిచయం చేయబడ్డాడు. వైద్యుడు తను నేర్చుకున్న విద్యా ద్వారా మానవ జీవితానికి ఈ భూలోకంలో కొనసాగింపుగా వుంటున్నాడు. తను చేసే వైద్యం ద్వారా మానవుడు బ్రతుకుతున్నాడు. అయితే తమ శక్తి సామర్థ్యాలను, సమయస్ఫూర్తిని, జ్ఞానాన్ని ఉపయోగించి అనారోగుల పట్ల తమ సేవను కనబరుస్తున్న వైద్యులను అభినందించడంలో అతిశయోక్తి లేదు. నిజానికి వైద్యుని జీవితంలో నిజమైన జూబిలి ఎపుడంటే ఒక వైద్యుడు అనారోగివంతమైన వ్యక్తిని ఆరోగ్యవంతునిగా మార్చడమే. క్రీస్తు ప్రభువు వీరికి సుమాతృక.

## అనారోగ్యుల సేవలో వైద్యులు మరియు సేవకుల పాత్ర

అనారోగ్యులకు సేవ చేయుటలో వైద్యులు, సేవకులు అమోఘమైన పాత్ర వహిస్తున్నారు. తమ జీవితాన్ని అనారోగ్యుల సేవకు అంకితం చేస్తున్నారు. ఎంత కష్టమైన పరిస్థితులైనా, రాత్రింబవళ్ళు పని చేయాల్సి వచ్చినా, తమ బాధ్యతను నిబద్ధతో నిర్వహిస్తారు. రోగులకు సరైనా చికిత్స అందించడం, వైద్య పరిశోధనలు చేసి కొత్త చికిత్స విధానాలను అభివృద్ధి చేయడం, ఆరోగ్య సమస్యలను అంచనా వేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. అలాగే నర్సులు కూడా తమదైన శైలిలో రోగులపట్ల సేవ భావాన్ని కలిగి జీవిస్తున్నారు. రోగుల పట్ల ప్రేమ, కరుణ మరియు సంరక్షణ చూపించడం, ఆసుపత్రుల్లో

24/7 సేవలందించడం, మందుల వాడకం మరియు చికిత్స పర్యవేక్షించడం. ఇలా వారు చేసే సేవలు ఆమోఘమైనవి. ఇవాళ వైద్యులు, నర్సులు మాత్రమే కాదు, అనేక స్వచ్ఛంద సంస్థలు కూడా అనారోగ్యుల సంక్షేమం కోసం పనిచేస్తున్నాయి. వారి సేవలను గుర్తించి గౌరవించడం సమాజం బాధ్యత.

## కోవిడ్-19 సమయంలో వైద్యుల మరియు ఆరోగ్య సంరక్షణ సేవల పాత్ర

కోవిడ్-19 మహమ్మారి విజృంభణ మన లెక్కకు మిక్కుటమైనది. కొన్ని లక్షల ప్రాణాలను బలి తీసుకుంది ఈ కోవిడ్ మాహమ్మారి. అది ప్రమాదం అని తెలిసి కూడా అనారోగ్యులకు సేవలందించారు వైద్యులు. అనేకమందిని రక్షించడానికి తమ ప్రాణాలను ఫణంగా పెట్టి రోగుల క్షేమం కోరి ముందడుగు వేశారు. అవసరమైన చికిత్స అందించడం, రాత్రి, పగలు లేకుండా సేవలు, వైరస్ నియంత్రణకు కృషిసల్పడం, వ్యాక్సిన్ అభివృద్ధి మరియు పంపిణీ, మానసిక ఆరోగ్య సంరక్షణ. ఇవే కాక టెస్టింగ్ సౌకర్యాలు, ఆసుపత్రుల నిర్వహణ, ఆన్‌లైన్ కన్సల్టేషన్, అవసరమైన మందులు, టీకాలు, సామాజిక సేవలు అందించారు. చివరకు కరోనా యోధులుగా గుర్తింపు సంపాదించారు. *(Corona Warriors)* అందుకు ప్రజలు కూడా వైద్యులు సూచనలు పాటిస్తూ, వ్యాక్సిన్ తీసుకోవడం, మాస్క్ ధరించడం, సామాజిక దూరం పాటించడం వంటి నియమాలను పాటించడం ఎంతో అవసరం.

## యేసు ప్రభువు మాటల వైద్యుడు

సాధారణంగా వైద్యుల తాము నేర్చుకున్న వైద్య విద్య ద్వారా అనారోగ్యులకు సేవలు అందిస్తు వారి మన్ననులను పొందుతున్నరు. కాని క్రీస్తు ప్రభువు అందుకు భిన్నం. వైద్యులు మందులతో జబ్బును నయం చేస్తే క్రీస్తు ప్రభువు తన నోటి మాటతో రోగులను స్వస్థ పరిచారు. అనేక అంశాలను మనం చూడవచ్చు (మత్తయి 8:16). "ఆ సాయం సమయమున పిశాచ పీడితులగు పలువురిని యేసు వద్దకు తీసికొనిరాగా ఒక్క మాటతో ఆయన పిశాచములను పారద్రోలి రోగులందరిని స్వస్థపరిచెను" (యోహాను 4:50). "నీవు వెళ్ళుము నీ కుమారుడు జీవించును" అని యేసు అతనితో చెప్పెను (మత్తయి 9:27-30).

"మీరు విశ్వసించునట్లు జరుగునుగాక" అని పలికెను (మత్తయి 8:2–3). "నా కిష్టమే నీకు శుద్ధి కలుగును గాక అని పలికెను" ఇలా నూత్న నిబంధనలో అనేక అద్భుతాలను యేసు ప్రభువు తన నోటి మాట ద్వారా జరిపించడం మనం చూస్తున్నాం. యేసు ప్రభువు చేసిన అద్భుత క్రియలలో ప్రేమ, అనురాగం, ఆప్యాయత, కనిపిస్తాయి. అది దేవునికి మన మీద ఉన్న ఇష్టానికి ప్రతీక.

అందుకు ప్రతీకగా ప్రజలంతా క్రీస్తు ప్రభువు నిజమైన వైద్యుడని తెలుసుకున్నారు. నోటి మాటతోనే శారీరక స్వస్థతను చేకూర్చారంటే ఆశ్చర్యకుం కదా! కేవలం ఇది క్రీస్తు ప్రభువుకి తన తండ్రిపైవున్న నమ్మకం, విశ్వాసం, ప్రేమబంధాలకు గుర్తు. యేసు ప్రభు మాటల వైద్యుడు మాత్రమే కాదు ఎదుటి వారి మనసులో దాగివున్న విషయాలను రాబట్టి వాటికి సమాధానం చెప్పగలిగే వైద్యుడు కూడా (మత్తయి 9:4). "వారి హృదయ తలంపులను గ్రహించిన యేసు "మీకు ఈ దురాభిప్రాయములు ఏలకలిగెను" (యోహాను 2:25). "ఆయన మనుష్యుని అంతరంగమును ఎరిగినవాడు కనుక, మానవ స్వభావమును గూర్చి ఆయనకు ఎవరును సాక్ష్యమీయనక్కరలేదు" (లూకా 22:31–34). "పేతురు నేడు కోడికూయయకముందే నీవునన్ను ఎరుగను అని ముమ్మారు బొంకెదవని నేను నీతో చెప్పుచున్నాను అనెను". ఈ విధంగా ప్రభువుకు అనేకమైన వైద్యవిద్యలు తెలుసు.

## మనసెరిగిన సేవకురాలు మధర్ థెరిస్సా

ఈ ప్రపంచమంతా పరిచయమైన వ్యక్తులు చాలా మంది వున్నారు. కాని అందరి హృదయాలలో 'సేవాభావం' అని తనదైన శైలిలో గుర్తింపు సంపాదించునకున్న వారే, పునీత మధర్ థెరిస్సాగారు. ఈ ప్రపంచమంతా 'అమ్మ' అని ఆప్యాయంగా పిలవగల వ్యక్తి. మధర్ థెరిస్సా. పేదవారిని చూస్తే చాలు ఆమె హృదయంలో తెలియని ఆవేదన మధర్ థెరిస్సాగారి సేవా తత్వాన్ని గూర్చి తెలియనట్వంటువంటి వారు వుండరు. ఆయుమ్మ అందరికి సుపరిచితురాలే.

1948వ సంవత్సరంలో రోమ్ నగరంలోని పాపుగారి అనుమతితో 1950

సంవత్సరంలో "మిషనరీస్ ఆఫ్ చారిటీ" అనే సంస్థను స్థాపించి, అనేక మంది అనాథలకు ఆశ్రయం కల్పించారు. ఈ సంస్థద్వారా పేదలకు, రోగులకు, అనాథలకు వీధి బాలలకు సహాయం అందించారు. అమె సేవలు కేవలం కలకత్తాలోనే కాకుండా, భారతదేశం మొత్తం విస్తారించాయి. అనంతరం ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థ విస్తరించి అనేక దేశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించింది. ఆమె ముఖ్యంగా కుష్టురోగుల సేవ కోసం ప్రత్యేక ఆసుపత్రులను ఏర్పాటు చేశారు. అప్పుటి సమాజంలో కుష్టురోగులను తాకడానికి కూడా భయపడేవారు. కానీ, మధర్ థెరిస్సా వారికి సేవ చేయడం ద్వారా మానవత్వానికి అర్థం చెప్పారు. అందుకే ఆవె మనసెరిగిన అమ్మగా గుర్తింపును సంపాదించుకున్నారు.

మధర్ థెరిస్సాగారి సేవా దృక్పదానికి దోహదపడిన వారిలో బ్లెసెడ్ అన్నా మరియ *(Blessed Anna Maria)* ఒకరు, ఫ్రెంచ్ విప్లవం రోజుల్లో ఆమె అందించిన సేవ అమోఘమైనది. ఈమె "క్లూని" *(cluny)* సభ స్థాపకురాలు. ఆమె జీవిత విశేషాలను తెలుసుకున్నారు మధర్ థెరిస్సా. చివరికి ఆమెలాగా సేవా తత్వాన్ని అవిలంబించుకున్నారు.

## పునీత కమిల్లస్ ది లెల్లిస్ అనారోగ్యులపై ఆదరణ

పునీత కమిల్లస్ ది లెల్లిస్ *(St. Camillus de Lellis)* అనేకమంది రోగులకు సేవ చేసిన గొప్ప దైవ భక్తుడు, ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో, అక్కడ వున్న ఇతర రోగుల బాధలు ఆయన మనసును కదిలించాయి. ఆయనకు అర్థమయింది.

రోగులకు శారీరక సహాయం మాత్రమే కాదు. మానసికంగా, ఆధ్యాత్మికంగా కూడా మద్దతు అవసరం. అందువల్ల ఆయన తన మద్యం అలవాటును విడిచిపెట్టారు. పూర్తిగా రోగలల సేవలో మునిగిపోయారు. ఆయన రోగులకు సేవల నిమిత్తం 1582లో "కమిలియన్ ఆర్డర్" *(Order of the Ministers of the infirm)* అనే సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ముఖ్యంగా రోగుల శ్రేయస్సు కోసం పనిచేస్తుంది. పునీత కమిల్లస్ గారు అనారోగ్యులకు అందిస్తున్న

సేవలను చూసిన ప్రతి ఒక్కరు ఆయన సేవను వేనోళ్ల అభినందించారు. అందుకుగాను కమిల్లస్ గారి జీవితం మనకు ఒక గొప్ప స్ఫూర్తి. రోగులపట్ల ప్రేమ, సేవాభావం, ధైర్యం ఇవన్నీ ఆయన చూపిన మార్గదర్శకాలు. ఆయన జీవిత చరిత్ర మనకు మానవత్వం అంటే ఏమిటో స్పష్టంగా తెలియజేస్తుంది.

## సమాజంలో రోగులసేవ – ఓ మహోన్నత దర్మం

మన సమాజంలో రోగుల సేవ అనేది అత్యంత పవిత్రమైన మరియు అవసరమైన ధర్మంగా పరిగణించబడుతుంది. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా మరియు ఆర్ధికంగా బాధపడతారు. అలాంటి సమయాల్లో వారి పట్ల సహానుభూతితో వ్యవహరించి, అవసరమైన సహాయం అందించడం మన సామాజిక బాధ్యతగా మారుతుంది. మానవ సేవల గూర్చి మాట్లాడుతు.

**మథర్ థెరిస్సా :–** "మానవ సేవే మాదవ సేవ".

రోగులకు సేవలు అందించే మార్గాలు చాలా ఉన్నాయి. 1) ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం. 2) రక్తధానం, అవయవధానం చేయడం. 3) రోగులకు మానసిక ధైర్యం చెప్పడం, వారితో సాన్నిహిత్యంగా ఉండడం. 4) వృద్ధులు, దివ్యాంగుల, అనాధల వంటి వారికి ప్రత్యేక శ్రద్ద చూపడం. 5) కుటుంబంలో లేదా పొరుగు వారిలో ఎవరికైనా వైద్య సహయం అవసరమైతే సహయం అందించడం.

రోగుల సేవ అనేది కేవలం వైద్యుల నర్సుల, స్వచ్ఛంద సంస్థల పని మాత్రమే కాదు. ప్రతి వ్యక్తి తనకి చేతనైనంత వరకు సహాయం చేయాలి. మానవత్వాన్ని పెంపొందించే ఈ కర్తవ్యాన్ని మన మందరం అవలంబించాలి. "సేవే పరమ దర్మం" అనే మాట నిజమని మనం మన జీవితాల్లో చూపించాలి.

## ముగింపు

చూశారా ప్రియ సహోదరి సహోదరులారా! అనారోగ్యులకు సేవ చేయడంలో ఎంతమంది ముందుకొచ్చి తమ మంచితనాన్ని చాటుకున్నారో.

రోగులకు సేవ చేయడంలో అంత ఆనందం, తృప్తి వున్నాయి మరీ! మథర్ థెరిస్సా గారు అంటారు “మానవ సేవే మాధవసేవ” మనం ఆరాధించే దేవుడు ఎక్కడో కాదు మన తోటివారిలో వుంటాడని దీని భావం మన సమాజంలో వున్న ప్రతి ఒక్కరిపై ముఖ్యంగా అనారోగ్యులపై మన బాధ్యత వుంది. రోగులపట్ల ప్రేమ చూపించడమే నిజమైన మానవత్వం. అలాంటి మనస్తత్వాన్ని దేవుడు మనకు దయచేయాలని, వైద్యులను, నర్సులను, సేవచేయువారిని దేవుడు దీవించాలని ప్రార్థిద్దాం.

దేవుడు మిమ్మును దీవించును గాక!

❋ ❋ ❋ ❋

# 5. దివ్యాంగుల జూబిలీ

– బ్రదర్ బాలసాని ప్రభుదాస్

## ఉపోద్ఘాతము



విశ్వ శ్రీసభ, నిరీక్షణ యాత్రికులుగా 2025వ సంవత్సరాన్ని సాధారణ జూబిలీ సంవత్సరంగా కొనియాడుతూ ఉంది. పరిశుద్ధ పాపుగారు డిసెంబర్ 24 క్రీస్తు జనన జాగరణ సమయంలో రోమ్ నగరంలోని పునీత పేతుర బృహద్దేవాలయం యొక్క జూబిలీ ద్వారాన్ని తెరవడం ద్వారా ఈ పవిత్రవత్సరాన్ని ప్రారంభించారు. డిసెంబరు 29 ఆదివారం నాడు ప్రపంచంలోని అన్ని పీఠ మండలాలలో, బృహద్దేవాలయాల్లో, పీఠాధిపతులు ప్రత్యేక శిలువ ప్రార్ధన కార్యక్రమంతో ఈ జూబిలీ వత్సరాన్ని ప్రారంభించి ఉన్నారు. ఈ సంవత్సరం అంతా జూబిలీవత్సరాన్ని భక్తియుతముగా ఒక నిరీక్షణ యాత్రగా కొనియాడుటకు విశ్వవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను ఇప్పటికే విశ్వ శ్రీసభ ప్రకటించింది. అందులో భాగంగా జనవరి మాసం నుండి డిసెంబర్ మాసం వరకు ఈ జూబిలీ యాత్రను ఘనముగా కొనియాడుటకు శ్రీసభలోని కొంతమంది ప్రత్యేక వ్యక్తులకు కొన్ని రోజులను అంకితం చేసింది. అందులో ఏప్రిల్ 28, 29 తారీఖులను దివ్యాంగుల జూబిలీగా కొనియాడమని పరిశుద్ధ పాపుగారు పిలుపునిచ్చి ఉన్నారు.

## దివ్యాంగులు అంటే ఎవరు?

దివ్యాంగులు అంటే శారీరక, మానసిక లోపం కలిగి ఉన్నవారు. పరిపూర్ణ మానవునిలో ఉండవలసిన శారీరిక మరియు మానసిక ఎదుగుదల లేకపోయిన వ్యక్తులను దివ్యాంగులుగా పరిగణించవచ్చు. కొంతమంది పుట్టుకతోనే

దివ్యాంగులు, మరికొందరు ప్రమాదవశాత్తు దివ్యాంగులుగా మారిన వారు ఉన్నారు. మానవుడు భూమియందు నివసించి దేవుని తెలుసుకొని ప్రేమించి సేవించి అటుపిమ్మట పరలోక రాజ్యమున ఆయన సన్నిధిలో నిరంతర ఆనందం పొందుటకు దేవుడు ఆదిలోనే మానవుని తన పోలికలు సృజించెను (ఆది 1:26). భువియందు కష్టించి పనిచేయుటకు, ఆహారమును సమకూర్చుకొనుటకు, అన్నిటికంటే ముఖ్యంగా దేవుని స్తుతించుటకు ఆరాధించుటకు దేవుడు మానవ సృష్టిని కలుగజేసేను. ఇందుకు అనుగుణంగా దేవుడు మానవుని పరిపూర్ణ శారీరిక మరియు మానసిక స్థితిలో సృష్టించెను. కానీ కాల క్రమేణా మానవుడు శారీరిక మరియు మానసిక లోపాలతో పుట్టి జీవిస్తున్నారు. పుట్టుకతోనే దివ్యాంగులుగా పుట్టడం దేవుడు మనకు ఒసగిన శాపమా? ప్రమాదవశాత్తు దివ్యాంగులుగా మారడం దేవుని యొక్క ప్రతీకారమా? తన పోలికలలో మానవుడు సృష్టించబడినప్పుడు ఈ శరీరమందలి వ్యత్యాసములు ఎందుకు? తండ్రి దేవుని ప్రేమకు అందరూ సమాన అర్హులైనప్పటికీ ఒకరికి సుఖవంతమైన జీవనం మరొకరికి బాధామయ జీవితం ఎందుకు? ఒకరికి సమృద్ధిగా ఒసగి మరొకరికి తక్కువ ఒసగి, తనను తెలుసుకొని, ప్రేమించి, సేవించి జీవించమనడం ఎంతవరకు సమంజసం? ఇలా ప్రశ్నించుకుంటూ పోతే దివ్యాంగుల పట్ల దేవుడు అన్యాయం చేస్తున్నాడని మనము భ్రమ పడుతూనే ఉంటాము. అది ముమ్మాటికి వాస్తవం కాదు. దేవుని సృష్టిలో ప్రతి ఒక్కటి పవిత్రమైనది. ఎందుకంటే దేవుడు పవిత్రుడు (1 తిమోతి 4:4). మానవులోని తారతమ్యాలు, భేధాలు మన కంటికి మాత్రమే కనిపిస్తాయి. కానీ ప్రభుని సృష్టిలో అందరూ సమానమే. సృష్టి అంతయు కూడా ప్రభువుని మహిమను వెల్లడి చేస్తూ ఉన్నది (కీర్తన 19:1). సర్వము సకలము ఆయన మహిమార్థము సృష్టించబడింది. ధనికులు పేదలు, ఉన్నవారు, లేనివారు గ్రుడ్డి వారు, కుంటివారు, అందరూ వారి వారి స్థితిగతులను బట్టి దేవుని మహిమ పరచుటకు సృష్టింపబడ్డారు. ఈ వరుసన దివ్యాంగులు వారి జీవన విధానంతో దేవుని మహిమ పరచడంలో ఎల్లప్పుడూ ముందుంటారు.

## దివ్యాంగులు పట్ల క్రీస్తుని కనికరము మరియు విశ్వాస భోద

క్రీస్తు ప్రభువు పలుచోట్ల దివ్యాంగులను స్వస్థ పరచడం మనం నాలుగు

సువార్తలలో చూస్తాం. పుట్టు గ్రుడ్డి వానికి స్వస్థత, ఊచ చేయి గలవానికి స్వస్థత, మూగ చెవిటి వానికి స్వస్థత, కుష్ఠ వ్యాధిగ్రస్తులకు స్వస్థత మరియు దయ్యం పట్టిన వారికి స్వస్థత. ఇలా ప్రభువు అనేకమంది వ్యాధిగ్రస్తులతో, దివ్యాంగులతో సంభాషించడం వారిని స్వస్థ పరచడం మనం గమనించవచ్చు. ప్రభువు చేసిన ఈ అద్భుతమైన స్వస్థతలు ద్వారా వారి భౌతికమైన అంగవైకల్యమును తొలగించడంతోపాటు పలు విశ్వాస సత్యాలను ఆయన ప్రజలందరికీ బోధించి ఉన్నారు. ప్రభువు పలుమార్లు ఇశ్రాయేలు ప్రజలను ఆధ్యాత్మికముగా గ్రుడ్డివారీగా, కుంటివారీగా పోలుస్తూ చెబుతారు. మేము మోషే సంతతి అని మోషే ధర్మశాస్త్రమును తు.చ తప్పకుండా పాటిస్తాము అని చెప్పుకుని జీవించే వారి కన్నా, దివ్యాంగుల యొక్క విశ్వాసము గొప్పదని పలు స్వస్థత క్రియల ద్వారా మనము తెలుసుకొనవచ్చును. మరీ ముఖ్యంగా దావీదు కుమారా! మమ్ము కరుణింపుము అని విశ్వసించి స్వస్థతను పొందిన ఇద్దరు గ్రుడ్డివారు (మత్తయి 9:27). వారు భౌతికంగా అంధులైనప్పటికీ ఆధ్యాత్మికంగా క్రీస్తు ప్రభువు ఎవరో గ్రహించగలిగారు. పరిశుద్ధ వాక్యంలో ప్రభువు చెప్పినట్లుగా “ఓ తండ్రి పరలోక భూలోకములకు అధిపతి! ఈ విషయములను నీవు జ్ఞానులకును వివేకులకును మరుగుపరచి పసిబిడ్డలకు వీనిని తెలియపరిచినందులకు మీకు ధన్యవాదములు” (లూకా 10:21). వారు శారీరకంగా అంగవైకల్యం కలిగినప్పటికీ క్రీస్తే నిజమైన ప్రభువు అని ప్రభువు వారికి ఇతరుల కంటే ముందే గ్రహించగలుగునట్లు కృప చూపెను. క్రీస్తుని బోధలను ఆలకించి, పాటించి, ప్రబోధించుటకు అంగవైకల్యము ఏమాత్రం అడ్డంకి కాదని ఇలా సువార్తలోని పలువురి దివ్యాంగుల యొక్క స్వస్థతల ద్వారా మనము తెలుసుకొనవచ్చును. దివ్యాంగుల పట్ల క్రీస్తు ప్రభువుని కనికరము ఎనలేనిది. దివ్యాంగులను ఒక శాపగ్రస్తులుగా, అంటరానితనము గాను, వివక్షతో చూస్తున్న ఆనాటి సామాజిక పరిస్థితులను అధిగమించి క్రీస్తు ప్రభువు వారిని స్వస్థపరుస్తూ వారి ద్వారా వివేకవంతులు సిగ్గుపడునట్లుగా మనుష్యకుమారుని మహిమను దివ్యాంగులకు వ్యక్తపరిచెను.

**శతాధిపతి వైఖరిని కలిగి జీవించాలి**

దివ్యాంగులు తమకై తామే అన్ని పనులను చేసుకోలేరు. కానీ ఎవరైనా

వారికి తోడ్పాటును అందిస్తూ సాయం చేస్తే వారు తమ జీవితాన్ని సరైన విధంగా జీవించగలిగి పరులకు సహాయపడగలరు. మరి ముఖ్యంగా ప్రతీ ఒక్కరు కూడా దివ్యాంగుల పట్ల శతాధిపతికి ఉన్న వైఖరిని కలిగి ఉండాలి. శతాధిపతికి ఉన్న సేవకులలో ఒకరు పక్షవాతం కలిగిన వాడిని మనము గమనించవచ్చు. సాధారణంగా సేవకులుగా పక్షవాత రోగులను ఎవరు పెట్టుకుంటారు? మరి ముఖ్యంగా వారిని అంటరానితనంగా చూచే ఆ రోజుల్లోనే శతాధిపతి పక్షవాతి రోగిని తన ఇంట సేవకుడిగా పెట్టుకొని ఇతర సేవకుల వలె అతనిని చూచుకొనడం, మనము ఆ వృత్తాంతాన్ని చదువుతున్నప్పుడు ఎప్పుడూ గ్రహించని గ్రహింపవలసిన ఒక గొప్ప విషయం. ప్రభు నీవు నా ఇంటిలోనికి వచ్చుటకు నేను పాత్రుడను కాను, నీవు ఒక్క మాట పలికిన చాలును నా సేవకుడు స్వస్థత పొందును అని చెప్పి తన వినయ, విశ్వాసములతో క్రీస్తు ప్రభువుని చేత విశ్వాస మెప్పులను పొందిన గొప్ప ఆదర్శవంతుడు ఈ శతాధిపతి. జూబిలీ సంవత్సరములో ఉన్న మనము కూడా దివ్యాంగుల పట్ల కనికరము కలిగి, వారికి చేతనయినంత సహాయం చేస్తూ వారి గౌరవ మర్యాదలను కాపాడుతూ, సమాజంలో వారికి కూడా ఒక ప్రత్యేక స్థానం చేకూర్చి క్రీస్తు యొక్క విశ్వాస ప్రేరకులుగా మార్చడం క్రైస్తవులమైన మనందరి బాధ్యత.

## దివ్యాంగుల యొక్క హక్కులు

దివ్యాంగుల పట్ల అందరు కూడా మానవతా దృక్పథం కలిగి ఉండాలి. వారు కూడా మనవలె దేవుని పోలికలో సృజించబడిన వారని, వారి అంగవైకల్యం అనేది కేవలం బాహ్య శరీర లోపమేనని, వారి ఆధ్యాత్మిక ఎదుగుదలకు అంగవైకల్యం ఏ విధంగానూ ఒక అడ్డంకి కాదని ప్రతి మానవుడు గుర్తుపెట్టుకోవాలి. వారితో సమాజంలో సమతుల్యంగా, సమగ్రంగా కలిసిపోతూ జీవించాలి. ఇలా చేయడం క్రైస్తవ విలువలను కలిగిన ప్రతి వ్యక్తి యొక్క బాధ్యత. శ్రీసభ అందించు అనేక అనుగ్రహములకు వీరు అన్ని విధముల హక్కులను కలిగి ఉన్నారు. ఈ జూబిలీ సంవత్సరంలో ప్రత్యేకంగా దివ్యాంగుల పట్ల గౌరవ మర్యాదలు చూపుతూ వారికి ఉన్న హక్కులను గైకొని ఆనందంగా

జీవించేలాగా వారికి సాయపడాలి. ఎక్కడైనా వారి హక్కులకు భంగం కలుగుతుంటే ఆ సమయంలో వారికి తోడుగా ఉండి వారి హక్కుల కోసం పోరాడాలి. కుమారునిలో తండ్రిని తెలుసుకొని, పవిత్రాత్మ యందు జీవనం సాగించడం దివ్యాంగులుగా సవాలుతో కూడుకున్న జీవనం అయినప్పటికీ అదే వారి యొక్క జీవిత ధ్యేయం కావాలి. ఇటువంటి భక్తియుతమైన జీవితం జీవించుటకు వారికి ఎవరైనా సహాయ సహకారాలు అందిస్తే వారు ఇంకా దేవునియందు అచంచలమైన విశ్వాసం కలిగి తమను తాము పూర్తిగా దైవ సేవకు, సమాజసేవకు వారిని వారు అంకితం చేసుకోగలరు.

## క్రీస్తు సువార్త వ్యాప్తిలో దివ్యాంగుల పాత్ర

పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు ఈ 2025 సంవత్సరాన్ని ప్రారంభించి, ప్రత్యేకంగా దివ్యాంగుల కోసం ఒక మాసం కేటాయించినప్పుడు ఇలా అంటారు "శ్రీసభలో అందరికీ స్థానం ఉంది, దివ్యాంగులు క్రీస్తు బోధనానుసారంగా జీవించడమే కాకుండా వారిలో దాగి ఉన్న ప్రత్యేక వరాల ద్వారా క్రీస్తు సువార్తను ప్రకటించువారుగా తయారు కావాలి". శారీరక మానసిక అంగవైకల్యం కలవారు వారి లోపము సువార్త విలువను తెలుసుకొనుటలో బహిరంగముగా ప్రకటించడంలో ఉండకూడదు. క్రీస్తు తన సువార్త వ్యాప్తికి ఎప్పుడూ కూడా వివేకవంతులను, గొప్ప వారిని ఎన్నుకోలేదు తన శిష్యులుగా సాధారణ వ్యక్తులను జాలరులను ఎన్నుకున్నారు. ప్రభువు తన సువార్తను ప్రకటించుటకు ఎవరినైనా ఉపయోగించుకొనగలరని దివ్యాంగులు గ్రహించగలగాలి. ఇలా క్రీస్తు ప్రభువుని మాటలను ఆలకించి తమ జీవితంలో వారికున్న అంగవైకల్యాన్ని అధిగమిస్తూనే గొప్ప క్రైస్తవ జీవితం జీవించి ప్రభు సువార్తను బోధించిన ఎంతోమంది పునీతుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి. పునీత కజిన్ జెర్మియనమ్మ పుట్టుకతోనే తన కుడి చేయి సరైన ఎదుగుదల లేకుండా పుట్టింది. సమాజం చేత ఎన్నోమార్లు అవహేళనలకు గురి అయింది. తనకున్న అంగవైకల్యముతోనే పోరాడుతూ క్రీస్తు పట్ల అపరిమితమైన ప్రేమను చూపించి క్రీస్తు విలువలో అనుసరించి జీవించి ఆ బాధలను భరిస్తూనే యుక్త వయసులోనే చనిపోయింది. ఆమె శరీరము ఇప్పటికీ నశించలేదు. ఆమె మధ్యస్థ ప్రార్థన

ద్వారా ఎంతో మంది ఇప్పటికీ స్వస్థతలు పొందగలుగుతున్నారు. అలాగే ధన్య అలెక్సిస్ కిమ్ సి యు అను వారు పుట్టుకతో పక్షవాత రోగముతోనే పుట్టారు. వీరు కొరియా దేశంలో క్రైస్తవ మతాన్ని స్వీకరించి జీవిస్తూ ఉండగా, ప్రభుత్వం అక్కడి క్రైస్తవత్వాన్ని వ్యతిరేకించి ఆ ప్రాంత ప్రజలను హింసించుటకు వచ్చినప్పుడు పలువురుతో కలిసి ఆ హింసను ప్రతిఘటిస్తూ జీవితాంతం కారాగార శిక్షణ అనుభవిస్తూ ఖారాగారంలోని మరణించెను. ఇలా ఎంతోమంది మానసికంగా శారీరకంగా అంగవైకల్యం కలిగిన వారు తమ వైకల్యాన్ని అంగీకరిస్తూనే, క్రీస్తు ప్రభువుని సువార్తానుసారము జీవిస్తూ, ప్రకటిస్తూ స్పూర్తిదాయకమైన జీవితాన్ని జీవించారు.

## దివ్యాంగుల జూబిలీ యొక్క సన్నాహాలు

పరిశుద్ధ పాపు గారు ఈ జూబిలీ సంవత్సర నిరీక్షణ యాత్రలో భాగంగా ఏప్రిల్ మాసంలోని 28, 29 తారీఖులను ప్రత్యేకంగా దివ్యాంగులకు కేటాయించి ఉన్నారు. ప్రపంచ నలుమూల నుండి కులమత బేధాలు లేకుండా దివ్యాంగులందరు ఒక తీర్థయాత్రగా బయలుదేరి ఏప్రిల్ 28వ తారీఖున పునీత పేతురు స్క్వేర్ ప్రాంగణంలో, పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు చేతుల మీదుగా జరగబోయే ప్రత్యేక జూబిలి దివ్యబలి పూజలో పాల్గొంటారు. తదుపరి ఏప్రిల్ 29 తారీఖు ఉదయమున పునీత పేతురు స్క్వేర్ ప్రాంగణంలో దివ్యాంగులు పరిశుద్ధ పాపు గారితో కలసి సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం పాపు గారితో కలసి ప్రేమ విందులో పాల్గొని వారి యాత్రను ముగిస్తారు.

ఎవరైతే ఈ రోమ్ నగర యాత్రకు హాజరు కాలేకున్నారో వారందరూ కూడా స్థానిక శ్రీసభలోని మేత్రాసన పరిధిలో, పీఠకాపరితో కలిసి మేత్రాసనమందు కేంద్రంగా నెలకొలపియున్న జూబిలీ శిలువను దర్శించి, పూజలో పాల్గొనుటకు ప్రయత్నించాలి. ఈ సమావేశం ద్వారా వారు కూడా శ్రీసభలో అందరి వలె సమాన హక్కులు కలిగియున్నారని, సువార్త వ్యాప్తిలో వారికున్న విశేషవరములనుసారముగా వారికి ఉన్న బాధ్యతను గుర్తు చేసే విధంగా సమావేశాలు జరగాలి. ఈ సమావేశం ఒక దివ్యబలి పూజ గాను, ఇతర దైవార్చన ఆరాధనలాగా లేదా ఒక సాంఘిక సమావేశంగానైనా ఈ

సమావేశమును జరుపవచ్చు.

దివ్యాంగుల కోసం ప్రత్యేక పూజలను ప్రతి విచారణ యందు జరిగేటట్లు చూడాలి. దైవార్చన పలు కార్యక్రమాలలో వారిని కూడా భాగస్తులు చేయాలి. పూజలో దివ్య పఠనాలను చదివించడం, పూజలో గురువులకు సహాయపడే విధంగా వారిని ప్రోత్సహించాలి. విచారణ ప్రజలందరి సమక్షమున వారి జీవితంలో దేవుడు చేసిన మేలులను బహిరంగంగా ప్రకటించుటకు వారికి అవకాశం కల్పించాలి. తద్వారా శ్రీసభ అందించు అన్ని వరములకు వారు కూడా సమాన అర్హత కలిగి ఉన్నారని వారికి తెలియజేయవచ్చు.

మేత్రాసన పరిధిలోని మాస పత్రికలలో, బ్రాడ్ కాస్టింగ్ ఛానెల్స్‌లో వారికున్న అంగవైకల్యంను అధిగమించి, సమాజానికి విశిష్ట సేవలు అందించిన దివ్యాంగులను గురించి తెలుసుకొని ప్రత్యేకంగా ప్రచురించాలి. అంగవైకల్యం కలిగి జీవించి పునీతులైన ఎందరో మహనీయుల ఆదర్శ జీవితములను గుర్తించి, వారిని పోలి జీవించుటకు దివ్యాంగులను ప్రోత్సహించే విధంగా పలు కార్యక్రమాలు జరపాలి. ఈ జూబిలీ సంవత్సర నిరీక్షణ యాత్రలో అందరూ సమానులే అని, వారి అంగవైకల్యం క్రీస్తుని కనుగొనుటకు ఆయన అనుగ్రహములు పొందుటకు ఏమాత్రము అడ్డుగోడ కాదని ప్రేరణనిస్తూ, వారికి చేయూతనిస్తూ ప్రోత్సహించాలి.

**ముగింపు**

ఈ జూబిలీ నిరీక్షణ యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్తులే. ఈ నిరీక్షణ యాత్ర ఒక ప్రాంతానికి, వర్గానికి సంబంధించినది కాదు. ఈ నిరీక్షణ యాత్ర నిరాశ పరచుటకు కాదు, నిరాశలో ఉన్నవారిని ఉత్తేజపరచి నూతన పరవల్లులతో, విశ్వజనీన సహోదరభావం కలిగి అందరినీ గౌరవిస్తూ, సమానత్వంతో, ఐక్యంగా జీవించుటకు ఇవ్వబడిన ప్రభు హితవత్సరం. ఈ నిరీక్షణ యాత్రలో దివ్యాంగులను గౌరవిస్తూ వారి హక్కులను కాపాడటమే కాదు, వారు కూడా శ్రీసభ అంధించు ప్రతి వరాలను గైకొంటూ శ్రీసభ ప్రేషిత కార్యంలో చురుకుగా పాల్గొనేవారుగా వారిని ప్రోత్సహించాలని పరిశుద్ధ పాపు గారు పిలుపునిస్తున్నారు. ఇప్పటి వరకు దివ్యాంగుల పట్ల జాలితో, కనికరం

హృదయము కలిగి జీవిస్తున్న మనము, వారి ద్వారా కూడా క్రీస్తు తన సువార్తను తెలియజేయలనుకుంటునాడన్న సత్యమును మనము గ్రహించాలి. "మీరు ప్రపంచమంతటా తిరిగి సకల జాతి జనులకు సువార్తను భోధింపుడు" (మార్కు 16:15). ఇది క్రీస్తు భగవానుడు మోక్షారోహణమవుటకు ముందు తన శిష్యులకు ఇచ్చిన ఆజ్ఞ మరియు జ్ఞానస్నానంలో, క్రీస్తులో, శ్రీసభలో భాగ్యస్వాములైన ప్రతి ఒక్కరికి పారంపర్యంగా ఒసగబడుతున్న భాద్యత. అవును, జ్ఞానస్నానం ద్వారా మన జన్మ పాపము తొలగించబడి, క్రీస్తుకు, శ్రీసభకు ప్రియమైన బిడ్డలుగా మారడంతో పాటు, క్రీస్తు సువార్తను ప్రపంచ నలు దిశల ప్రకటించే బాధ్యతను అందరమూ స్వీకరిస్తున్నాము. తన సువార్తకు ప్రభువు దివ్యాంగులను కూడా ప్రేరేపిస్తున్నాడని విశ్వసించడంలో ఎటువంటి సందేహం కలిగి ఉండకూడదు. ప్రభు వారి ద్వారా మనకు తెలియజేస్తున్న విశ్వాస భోధనలను, రహస్యాలను గ్రహించుటకు పవిత్రాత్మ మనకు సహాయపడునటుల ఈ నిరీక్షణ యాత్రను కొనససాగిస్తూ ప్రభు హితవత్సరాన్ని ప్రకటించుదాం.

❋ ❋ ❋ ❋

# 6. శ్రామికుల జూబిలీ

- బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర

## ఉపోద్ఘాతము



ప్రతి వ్యక్తి గౌరవానికి అర్హుడు. మానవత్వంలో దాగివున్న ఔన్నత్యం ఏమిటంటే ఎదుటి వ్యక్తిని తనను తానుగా గుర్తించి తన హుందాతనాన్ని గౌరవించడమే. కార్మికులు మానవ అభివృద్ధికి దీపికలు. శ్రమించటం ఒక వ్యక్తికి గౌరవాన్ని ఇస్తుంది మరియు తెస్తుంది. గౌరవం శ్రమకు ఇచ్చే బహుమానం. ప్రపంచ మనుగడలో కార్మిక వ్యవస్థ ప్రత్యేక స్థానాన్ని పొందినది. అందుకే పరిశుద్ధ పాపుగారు కార్మికులను ఈ జూబిలీ వేడుకలలో భాగస్వామ్యం చేశారు. ఎందుకంటే వారి శ్రమను మనం గుర్తించాలి, వారి సహకారాన్ని గౌరవించాలి. ప్రపంచ అభివృద్ధికి కార్మికుల పాత్ర ఎంతో అభినందించదగ్గ విషయం.

## జూబిలీ ప్రాముఖ్యత

జూబిలీ సంవత్సరం కతోలిక సంఘంలో ఒక ముఖ్యమైన మరియు చరిత్రలో నిలబడే సంఘటన. విశ్వాసులు దేవుని ప్రేమను, దయను ప్రత్యేక రీతిలో పొందటానికి ఈ జూబిలీ సంవత్సరం ఉపకరిస్తుంది. జూబిలీ వేడుక అనేది మానవ కల్పితమైనది ఏమాత్రం కాదు. దేవుడే ఈ సాంప్రదాయాన్ని స్థాపించారు. లేవీయకాండమ 25:1-55, ద్వితీయో 15:1-6, నిర్గమ 23:10-11 వచనాలు దీనికి నిదర్శనం. పాత నిబంధన ప్రకారం ప్రతి ఆరు సంవత్సరాలు కష్టపడి పొలం పండించిన తర్వాత ఏడవ సంవత్సరం భూమికి పశువులకు కొంతకాలం శ్రమను విరమించాలి. ఇలా ఏడుసార్లు చేసి 50 ఏటా జూబిలీగా జరుపుకోవాలని ఈ జూబిలీలో ముఖ్యంగా దేవుడు ఇశ్రాయేలీయులకు ఇన్ని

ఏళ్ళు చేసిన మేలులకు కృతజ్ఞత తెలపాలి, బానిసలను స్వేచ్ఛగా వదిలేయాలి మరియు పేదవారిని ఆదరించాలి. అందుకే కతోలిక శ్రీసభ (క్రీస్తు స్థాపించిన సంఘం) సాంప్రదాయకంగా ప్రతి 25సంవత్సరాలకు జూబిలీని ప్రకటిస్తుంది.

ఈ ఏడాది జూబిలీ యొక్క అంశము నిరీక్షణ యాత్రికులు *(Pilgrims of Hope)* ఇది 2024 క్రిస్మస్ జాగరణ పూజద్వారా రోమ్ నగరంలో ప్రారంభమైంది. పరిశుద్ధ ఫ్రాన్సిస్ పోపుగార రోమ్ నగరంలో ఉన్న బసిలికా దేవాలయానికి ఉన్న ద్వారములు తెరిచి జూబిలీ వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకలలో తీర్థయాత్రలు ఊరేగింపులు ప్రత్యేక పూజప్రార్ధన వేడుకలు ఆరాధనలు ఉంటాయి. ఈ జూబిలీ మరల 2026లో క్రీస్తుసాక్షాత్కార పండుగతో ముగుస్తుంది. జూబిలీ వేడుకలన్నీ కూడా విశ్వాసులను దేవుని దయను పొందే లాగున ప్రోత్సహిస్తాయి. మన దైనందన సాంఘిక జీవితంలో క్రీస్తు బోధనలను అనుసరించి మంచి పనులను చేయుడానికి ఈ జూబిలీ మనకు సహాయపడుతుంది. ఫ్రాన్సిస్ పాపుగారు జూబిలీ సందర్భంగా మనలను శాంతికాములుగా ఉంటూ ఘర్షణలు లేకుండా మానవ జీవితాన్ని ప్రోత్సహించాలని, ఖైదీలకు క్షమాభిక్ష చూపాలని, వలసదారుల యొక్క గౌరవాన్ని నిలబెట్టాలని, రోగులను స్వస్థపరిచే విధంగా మనం వ్యవహరించాలని, వృద్ధులను గౌరవిస్తూ వారి గురించి ఆలోచించాలని మనల్ని అడుగుతున్నారు.

## ముఖద్వారము తెరుచుటలో ఉన్న అంతరార్థం

ముందుగా చెప్పినట్లు ఫ్రాన్సిస్ పాపుగారు పేతురుగారి దేవాలయ ముఖద్వారాన్ని తెరిచి జూబిలీ వేడుకలను ప్రారంభించారు. ఈ తల్లి ఆలయ ద్వారమును తెరుచుటలోవున్న అంతరార్థం ఏమిటి? క్రీస్తు ప్రభువు తన మరణ పునరుత్థానం ద్వారా పాపములో పేరుకుపోయిన మనిషిని పైకి లేపారు. తన సిలువ విజయం ద్వారా పరలోక ద్వారంను తెరిచి మనకు తన రక్షణ భాగ్యాన్ని దయచేసారు. దీనికి సాదృశ్యంగా ఫ్రాన్సిస్ పాపుగారు పేతురు గారి బసిలిక ముఖద్వారాన్ని తెరిచారు. దేవుని దీవెనలు విరివిగా మనకు అందాలని క్రీస్తు సంపాదించిన రక్షణ ఆనందం అందరం పొందాలని కోరుకుంటూ ఈ తల్లి ఆలయ ప్రవేశానికి అందరిని ఆహ్వానిస్తున్నారు. అంతేకాకుండా జ్ఞాన స్నానం

కూడా మనకు ఇతర సంస్కారాల స్వీకరణకు వాకిలిలా నిలుస్తుంది. కాబట్టి విశ్వాసులుగా మన ప్రాంతీయ పీఠాలలో ఉన్న తల్లి దేవాలయ *(Cathedral Church)* ద్వారాలను దాటి ఆలయంలోనికి ప్రవేశించినప్పుడు దేవుని ప్రత్యేక దీవెనలు మనం పొందుతున్నాం అని గుర్తెరగాలి.

## కార్మికుల జూబిలీ తేదీలు

అనేక సమూహాల వ్యక్తులను సేవా శాఖలను శ్రీసభ గుర్తించి వారికి ప్రత్యేక విలువలను కలిగించే విధంగా జూబిలీ చేయాలని పవిత్రాత్మ ప్రేరణతో శ్రీసభ నడుం కట్టింది. కతోలిక సమాజంలో క్రీస్తు ప్రతినిధులుగా సేవ చేసే శిష్యులుగా మనందరం మారాలి. ప్రతి వ్యక్తి యొక్క అంతర్లీన మానవ గౌరవాన్ని బ్రతికింప చేయాలి. గౌరవప్రదమైన పని అనేది దేవుడు మనిషికి ఇచ్చిన మానవ గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది. శ్రమ లేదా పని అనేది కుటుంబాలను నిర్మించడానికి నిలబెట్టడానికి సరిపోయే వనరులను అందిస్తుంది. కాబట్టి జూబిలీ సంవత్సర వేడుకలు కార్మికుల కొరకు ప్రత్యేక రోజులను కేటాయించి వారి త్యాగపూరిత సేవలను గుర్తించి వారిని గౌరవించటం జరుగుతుంది. కార్మిక సేవలను గుర్తించే విధానంలో మనం ప్రపంచ పురోగతికై వారు అందించే సహకారాన్ని కూడా మనం అభినందిస్తునాము. కార్మికుల జూబిలీని గురువారం మే 1 నుండి 4 ఆదివారం 2025 వరకు జరుపబడుతుంది.

## యోసేపు గొప్ప కార్మికుడు

బైబులు గ్రంధం ప్రకారం యోసేపు నీతిమంతుడు మత్తయి 1:19. వృత్తి రీత్యా ఆయన ఒక వడ్రంగి. యూదుల చట్టాలను సాంప్రదాయాలను గౌరవిస్తూ ఎంతో కష్టపడుతూ ఆదర్శవంతమైన జీవితం యోసేపు గారు జీవించారు. తల్లి మరియను వదిలించుకునే అవకాశం ఉన్న అలా చేయకుండా దేవుని చిత్తాన్ని దూత ద్వారా కలలో గ్రహించాడు అందుకు అనుగుణంగా ఆయన జీవించారు. బాలయేసు మరియను పోషించుటలో ఆయన చూపిన నిబద్ధత చురుకుదనం ప్రశంసింపదగ్గది. కార్మికుల జూబిలీ సందర్భంగా యోసేపు గారిని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలి. ఎందుకంటే ఏదో రకంగా అందరూ కూడా కార్మిక జాబితాలోకి వస్తారు. పొలంపని, ఉద్యోగం, వడ్రంగి

పని, డ్రైవరు, టీచరు, న్యాయవాది ఇలా ఏదో రకంగా ప్రతి ఒక్కరు కూడా తమ సేవలను సమాజానికి అందిస్తుంటారు. ఈ విధంగా సేవలు అందించే మార్గంలో మనం న్యాయంగా పనిచేయడానికి సామాజిక విలువలు పెంచే విధంగా కృషి చేయాలి. అన్యాయానికి అక్రమానికి లంచగొండితనానికి చోటు ఇవ్వక ఏసేపు గారి వలె నిజాయితీగా ఒక ప్రక్క మన మత ఆచారాలను గౌరవిస్తూ ఇంకొక పక్క సమాజ సేవలో న్యాయంగా జీవించడానికి ప్రయత్నం చేయాలి. ఈ జూబిలీ సందర్భంగా ప్రతి కార్మికుడు కూడా ఏసేపు గారిని ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన తన కుటుంబం కోసం ఏ విధంగా కష్టపడి పని చేశారో అదేవిధంగా మనం కూడా మొదట మన కుటుంబం కోసం కుటుంబ అభివృద్ధి కోసం కష్టపడాలి. ఈ విషయాన్ని పునీత పౌలు గారు తెస్సలోనికా ప్రజలకు రాశాడు. పనిచేయని వాడు భోజనమునకు అనర్హుడు 2 తెస్సలో 3:10. కనుక ఎవరైతే ఏ పని చేయకుండా సోమరిపోతుల్లాగా జీవిస్తున్నారో వారందరూ కూడా కార్మికుల జూబిలీ సందర్భంగా ఆత్మలోచనా చేస్తూ పనిచేయటం మానవ నైజం అని తెలుసుకొని కష్టపడి పని చేయడానికి ముందుకు రావాలి. ఇక కూలీలు పంట పొలాలలో రెండు విధాలుగా పని చేయటం ఆపివేయాలి. న్యాయంగా ఇచ్చే వేతనానికి సరిపడా పని చేయాలి. అంతేకానీ పనికి పిలిచిన యజమాని కుటుంబానికీ నష్టం కలిగించకూడదు. కనుక కతోలిక కార్మికులుగా మన విశ్వాస జీవితాన్ని జీవిస్తున్న వారిగా ఈ చిన్న వాటిలో జాగ్రత్త వహించినట్లయితే అప్పుడు కార్మిక జూబిలీకి ఒక పరమార్థం కలుగుతుంది.

## కార్మికుల కన్నీరు

దేవుని రూపం ప్రతి మనిషిలో ఉంది. సత్యోపదేశం *(Catechism of the Catholic Church)* సంఖ్య 1702. ప్రతి వ్యక్తి కూడా గౌరవానికి అర్హుడు అందులోనూ ముఖ్యంగా కార్మికులు కచ్చితంగా గౌరవింపబడాలి. సమాజంలో మనం చూస్తూ ఉంటాం కార్మికులను చులకనగా చూడడం వారి స్థితిని బట్టి వారిని తక్కువచేసి వారి పట్ల వివక్షత చూపటం అన్యాయంగా ప్రవర్తించటం ఇవన్నీ కూడా జరుగుతున్నాయి. దేవునికి ఆలయమైన పవిత్రతాత్మకు నిలయమైన

తమ శరీరాలను కష్టానికి ఉపయోగించి తోటి మానవాళి శ్రేయస్సులో ఆనందాన్ని పొందుతున్న కార్మికులు మరి ఇటువంటి వివక్షతకు గురికావడం చాలా బాధాకర విషయం. ఈ కార్మిక జూబిలీ సందర్భంగా కనీసం క్రీస్తును అనుసరించే మనం కార్మికులను తోటి వారిలా పరిగణిస్తూ వారికి ఇవ్వాల్సిన గౌరవాన్ని ఇవ్వటలో ముందుకు రావాలి. మన సంఘాలలో ఉన్న కార్మికులకు ప్రత్యేక స్థానాన్ని కల్పించి వారి అభివృద్ధికి మనం సహకరించాలి. క్రీస్తు బోధనలను అనుసరించి ప్రతి ఒక్కరిని కూడా వారి స్థితి, ఆర్థిక స్తోమత, చదువు, కులము ఇవేవీ చూడకుండా క్రీస్తు నందు ప్రియ బిడ్డలుగా కార్మికులందరినీ మనం చూడాలి. మనతో మొదలైన ఈ మార్పు దేశమంతటా ప్రబలాలి. తద్వారా ప్రపంచం కార్మికులను గౌరవించాలి వారిని వారిగా చూడాలి అన్న సత్యం తెలుసుకునేటట్లు మనమే అలా జీవించాలి. అనేకసార్లు కార్మికుల కన్నీళ్ళకు మనం కూడా కారణం అయి ఉండవచ్చు లేదా మనమే ఒక కార్మికులుగా దౌర్జన్యంగా అన్యాయంగా పనిచేసే ఉండవచ్చు కాబట్టి కార్మిక జీవులు ఈ జూబిలీ సందర్భంగా అన్ని కూడా దేవునికి అర్పిస్తూ ఇకనుండి అయినా కార్మికుల పట్ల మన ధోరణి సరిగ్గా ఉండునట్లు ప్రయత్నం చేద్దాం.

## కార్మికులకు అండగా శ్రీసభ లేఖలు మరియు పాపు గార్ల పత్రాలు

శ్రీసభ మొదటి నుండి కూడా పేదల పట్ల సమాజంలో అణిచివేతకు లోబడిన వారిపట్ల, రోగుల పట్ల, వృద్ధుల పట్ల సమాజంలో ఉన్న అన్ని రకాల వ్యక్తుల పట్ల తన ప్రేమను చూపిస్తూనే వస్తుంది. ఇందులో భాగంగా ముఖ్యంగా శ్రీసభ అధినేత అయిన పాపు గార్లు కార్మిక వ్యవస్థపై జరిగే అన్యాయంపై వారికి న్యాయం జరిగేలాగున శ్రీసభ వారికి తోడుగా ఉందని భరోసా తమ రచనల ద్వారా ఇచ్చారు. కేవలము ఈ విషయాలు పుస్తకంలో పొందుపరచడమే కాకుండా క్రియా రూపం దాల్చుటానికి అనేకమంది పాపుగార్లు తమ పాలనలో కార్మిక వ్యవస్థకు మంచి జరగాలని పాటుబడ్డారు. ఇప్పుడు కొన్ని లేఖలను పత్రాలను పాపు గార్లు రాసిన అంశాలను మనం చూద్దాం. 1891లో 13వ (లియో పోపుగారు) సింహరాయల పాపుగారు శ్రమ యొక్క హక్కులు లేదా విప్లవాత్మక మార్పు *(Rerum Novarum)* అనే లేఖను రాశారు. ఈ లేఖలో

పాపు గారి ఆలోచన ఏమిటంటే కార్మికులు న్యాయపర వేతనాలు, పనిచేయిచోట సమకాలీన వాతావరణం, కార్మిక సంఘాలను పెట్టుకోవటానికి హక్కు ఉంది అనే అంశాలను పొందుపరిచారు. ఈ లేఖ శ్రమ మరియు మూలధనం గురించి ప్రస్తావిస్తూ ప్రభుత్వం మరియు పౌరుల మధ్య సంబంధాలు పరస్పర విధులను గురించి మాట్లాడుతుంది. ఈ లేఖ 40 సంవత్సరాలను పురస్కరించుకొని *(Quadragesimo Anno)* 1931లో 11వ భక్తినాధ పాపు గారు సామాజిక న్యాయము మరియు ఆర్థిక వ్యవస్థలో ఉన్న అసమానతులను గురించి రాశారు. అంతేకాకుండా ఈ లేఖ యొక్క 100 సంవత్సరాలను పురస్కరించుకొని *(Centisemus Annus)* 1991 రెండవ జాన్ పాల్ పాపు గారు ఆర్థిక వ్యవస్థ న్యాయము మరియు వ్యాపారాలలో నీతికి సంబంధించిన కట్టుబాట్లు ఉండాలని నొక్కి వక్కాణించారు రెండవ జాన్ పాల్ పాపుగారు 1981లో పని యొక్క కష్టం అనే లేఖలో *(Laborem Exercens)* మానవ శ్రమకు ఔన్నత్యం మరియు గౌరవం ఉండాలని లావాదేవీలు లాభనష్టాలు కన్నా శ్రమ చేసే వారే ముఖ్యమని వారికి న్యాయపరమైన గౌరవ వేతనం ఇవ్వాలని, వారి హక్కులను రక్షించాలని బోధించారు. ఇక 16వ బెనెడిక్ట్ పాపు గారు ప్రేమ యొక్క నిజస్వరూపం అనే లేఖ ద్వారా *(Caritas in Veritas)* 2009 ఆర్థిక న్యాయము సత్యముతో మరియు ప్రేమతో ముడిపడి ఉందని చక్కగా మాట్లాడారు అంతేకాకుండా ప్రతిదీ కూడా ముడిసరుకు లాగా చూడకుండా సేవ చేసే వారిని వారిగా గుర్తించాలని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రపంచ వ్యాపార వర్గాలలో అవినీతి పనికిరాదని అది సమాజానికి ఏమి ఉపయోగపడదని హితబోధ చేశారు.

ఫ్రాన్సిసు పాపుగారు సువార్త ఆనందం అనే లేఖలో 2013 *(Evangelii Gaudium)* ఆర్థిక వ్యవస్థలో ఉన్న అసమానతులను విడదీసే ఆచారాన్ని ఖండించారు. కార్మిక వ్యవస్థ విధానములో న్యాయపరమైన మరియు నీతిగా ఆర్థిక విషయాలు ఉండాలని పని చేసే వారి పట్ల వివక్షత చూపకుండా వారి అంతర్లీన గౌరవాన్ని భంగపరచరాదని చెప్పారు. 2015 సంవత్సరంలో పర్యావరణం దేవుని ప్రేమకు నిదర్శనం దీని ద్వారా దేవునికి స్తుతులు చెల్లించాలి *(Laudato Si)* అనే అధికారిక పత్రం ద్వారా ఫ్రాన్సిస్ పాపు గారు కార్మికులను ఉద్దేశించి ఈ విధంగా పలికారు "పర్యావరణంలో జరుగుతున్న అసమానతలు

కార్మిక వ్యవస్థకు నష్టాన్ని కలిగిస్తున్నాయి మనిషి స్వార్థం వల్ల పర్యావరణం కాలుష్యం దానికి ఉన్న స్థితి మారిపోయి అతివృష్టి అనావృష్టి ద్వారా కార్మికులకు కూలీలకు పంట పండించే వారికి నష్టాన్ని బాధను కలిగిస్తుంది కనుక ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి మానవుడు కార్మిక వ్యవస్థకు న్యాయం చేకూర్చాలంటే మనం పర్యావరణం పట్ల సరియైన విధంగా ప్రవర్తించాలని బోధించారు”. అంతేకాకుండా ఫ్రాన్సిస్ పాపు గారు ఈ లేఖ ద్వారా కార్మికులను ఒకరి స్వార్థం కొరకు వినియోగించడం అనే విధానాన్ని ఖండించారు. ఈ విధంగా కార్మికులను చేయకూడని పనుల్లో ఇరికించడం ద్వారా వారిని మభ్యపెట్టి వారి గౌరవాన్ని దొంగలించడం ద్వారా సమాజానికి అటు వాతావరణ పరిస్థితులకు మంచిది కాదని ఉటంకించారు. 2020 వ సంవత్సరంలో ఫ్రాన్సిస్ పాపు గారు సోదర భావం తోటి సోదరులు అనే అధికారిక పత్రం ద్వారా *(Fratelli tutti)* ఆర్థిక పరమైన న్యాయాన్ని కోరుకుంటూ సామాజిక సాంఘిక సోదర భావాన్ని ప్రేమను తెలియజేశారు అదేవిధంగా కార్మిక వ్యవస్థను లేక వ్యక్తులను చిన్న పరిచే ఏ అంశాలైన లేక మార్గాలైన ఉండరాదని ఖండించారు. అంతేకాకుండా ప్రస్తుత సామాన్య శాస్త్ర రంగాలలో చోటు చేసుకున్న అభివృద్ధి అనేకమంది ఉద్యోగాలపై ప్రభావం చూపుతుంది సమాజంలో ఏర్పడిన మార్పులు అధునాతన పరికరాలతో సులభమైన మానవ పని రోబోల సృష్టి కరణ, వేగంగా నడిచే సమాచారం వ్యవస్థ ఇవన్నీ కూడా మనిషి యొక్క ఉద్యోగ అవకాశాలను తగ్గించటమే కాకుండా ఉన్న ఉద్యోగాలను పీకి వేసే లేదా తొలగించే పన్నాగాలకు దారితీస్తుంది. ఈ విషయాలన్నింటినీ ఫ్రాన్సిస్ పాపు గారు ఈ లేఖలో చక్కగా పొందుపరిచారు. ఈ విధంగా కతోలిక విశ్వ శ్రీసభ కేవలము మతపరమైన అంశాలలో పరిమితం కాకుండా సామాజికపరమైన న్యాయవ్యవస్థలో కూడా జోక్యం చేసుకుంటూ మనిషి యొక్క విలువలను పెంచుతూ మానవత్వాన్ని జీవింప చేస్తూ ప్రపంచ నలుమూలల అందరి అభివృద్ధి కోరుకుంటూ శాంతిని విస్తరిస్తూ సమసమాజ స్థాపనలో తనదైన వంతును, ముద్రను శ్రీసభ అందించడం చూస్తూ ఉన్నాం. కనుక ఈ 2025వ సంవత్సరంలో ముఖ్యంగా జూబిలీ సంవత్సరాన్ని పురస్కరించుకుంటూ అనేకమందిని అనేక శాఖలను ఈ జూబిలీలో ఏకంచేస్తూ అందరి ప్రయోజనం నిమిత్తం వివిధ రకాల

సమాలోచనలు చేస్తూ దేవుని దయని ప్రత్యేకంగా పొందే ఈ విధానంలో కార్మికులకు జూబిలీ అనే అంశాన్ని ధ్యానిస్తుండగా శ్రీసభ బోధనలను అర్థం చేసుకుంటూ కార్మిక వ్యవస్థకు మరింత మన్ననను తెచ్చే విధంగా మనందరం ప్రయత్నిద్దాం.

**ముగింపు**

పైన పొందుపరిచిన విషయాలు ప్రకారం 2025 కార్మిక జూబిలీ అనేది నిజంగా ఇటు శ్రీసభకు అటు ప్రపంచానికి చాలా ఉపయోగకరమైన అంశాలను అవగతం చేసింది. ఈ జూబిలీ నిజంగా పరిశుద్ధాత్మని ప్రేరణే. విశ్వాసులుగా మనం ఎలా జీవించాలో, కార్మికుల పట్ల ఎలా మసులుకోవాలో ఈ జూబిలీ మనకు నేర్పిస్తుంది. కనుక ఆత్మ ప్రేరణతో కతోలిక బిడ్డలుగా దేవుని ప్రేమకు నిలయములా ఈ ఆధునిక ప్రపంచంలో కార్మికులుగా మన నూతన జీవిత విధానంతో ఉన్నతముగా జీవించటానికి ప్రయాస పడదాము, సాంఘిక వ్యవస్తలో మార్పుకు అంకురార్పణ చేద్దాం. నేటి కార్మికులు రైతులు, ఉద్యోగులు, సామాన్య మౌలిక కూలీలు పనిలో పడి కనీసం ఆదివార ఆరాధనకు కూడా రాలేని పరిస్తితిని మనం చూస్తూనే ఉన్నాం. ఎంత సంపాదించిన దేవుడు లేని జీవితం అగమ్యగోచరంలా ఉంటుంది. 10 ఆజ్ఞలలో 3 ఆజ్ఞ దేవుని పండుగ రోజులను గౌరవించటం. తిరుసభ కట్టడలలో మొదటిది ఆదివారం నిండుబలి పూజలో పాల్గొనటం. అనేక మంది కార్మికులు ఈ ఆజ్ఞనలను పక్కన పెట్టి జీవిస్తున్నారు. ఒకసారి ఆలోచన చేయాలి. కతోలికులుగా ఆదివారం అనేది మనకు ఎంతో పవిత్రమైనది. ఈ రోజునే మన దేవుడు మరణం గెలిచి ఉథానామైనారు. దేవుని కుమారునిగా మన రక్షకుడిగా క్రీస్తు సిలువ పైన పడిన కష్టం అంతా ఇంత కాదు. మనం ఎప్పుడైతే ఆదివారం యొక్క పవిత్రతను గౌరవించమో అప్పుడే మన వృద్ధికి ఆటంకం వేసిన వారిగా మిగిలిపోతాం. కావున మన కతోలిక గుర్తింపును కాపాడుకొంటూ దేవునికి ఇవ్వాల్సిన సమయాన్ని ఇస్తూ కార్మిక కరములే వృద్ధికి వనరులు అన్నట్లుగా జీవించడానికి ప్రయత్నం చేద్దాం. అందుకు కావాల్సిన దీవెనలను దేవుడు కుమ్మరించు లాగున వేడుకుందాం. ఆమెన్.

# 7. కుటుంబాల, అవ్వతాతల మరియు వయోవృద్ధుల జూబిలీ

– బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్

## పరిచయం



పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు కుటుంబాలను జూబిలీ 2025 సంవత్సరంలో ఆశకు ప్రతీకలుగా ఉండాలని, ఆతిథ్యాన్ని పెంపొందించాలని, ప్రేమ, క్షమాభావం, సహాయ సహకారాన్ని పెంచాలని కోరుతున్నారు. 2025వ సంవత్సరాన్ని పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు జూబిలీ సంవత్సరంగా ప్రకటించారు, కాని ప్రకటించడంతో పని పూర్తికాలేదు కాని ప్రారంభమయింది. ఈ జూబిలీ సంవత్సరాన్ని వివిధ కార్యక్రమాలుగా విభజించి ఒక ప్రణాళిక బద్ధంగా ఈ జూబిలీ అన్ని నమూనాలుగా, అన్ని విధాలుగా మరియు అన్ని రంగాలలో జరపాలని తలంచి ప్రతి రంగానికి ఒక ప్రణాళికను అలాగే ప్రత్యేక రోజుని కేటాయించారు అందులో ఒకటే మనం మే 30 నుండి జూన్ 1, 2025 వరకు జరుపుకుపోయే కుటుంబాల లేదా వయో వృద్ధుల జూబిలీ దీనిని మేత్రాసనాల, విచారణల, పాఠశాలల, మొదలగు సంస్థల స్థాయిలో జరపడానికి పరిశుద్ధ శ్రీసభ మనకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాలు మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడతాయని ఆశిస్తూ జూబిలీ సంవత్సరాన్ని కొనియాడుకుందాం.

## ఆధ్యాత్మిక ధ్యానం

ఫ్రాన్సిస్ పాపుగారు *"Amoris Laetitia"* (The Joy of love) ప్రేమానందంలో చెప్పినట్లుగా: నజరేతులో ఒక మానవ కుటుంబంలో దేవుని వాక్కు మానవ రూపాని ధరించడం ద్వారా, మానవ రక్షణ చరిత్రలో మార్పు

వచ్చింది. మనం క్రీస్తు పుట్టుక పరమరహస్యాన్ని లోతుగా గ్రహించాలి. (65). యేసు జననంతో మానవజాతికి గొప్ప ఆశ కలిగించింది. ప్రతి కుటుంబం కూడా పిల్లలు జన్మించగానే ఆనందాన్ని, ఆశను అనుభవిస్తారు మరియు అనుభూతిని పొందుతారు.

**జూబిలీ యాత్రలకు సిద్ధపాటు**

- జూబిలీ సందర్భంగా రోమ్‌కు వెళ్లే వారు పవిత్ర ద్వారాలను దర్శించవచ్చు.
- స్థానిక యాత్రలు మేత్రాసన లేదా విచారణ కూడా నిర్వహించుకోవచ్చు.
- యాత్రకు ముందుగా ప్రార్థన మరియు ఆత్మీయ సిద్ధపాటు అవసరం.
- యాత్ర తరువాత సేవా కార్యక్రమాలను చేపట్టాలి మరియు కారుణ్య క్రియలను చేపట్టాలి
- కుటుంబాల కోసం స్థానిక ఉత్సవ సూచనలు

**1. విచారణ స్థాయిలో**

- మే 31 – జూన్ 1, 2025 రోజున కుటుంబాల కోసం ప్రత్యేక ప్రార్థనలు.
- ఆధ్యాత్మిక మరియు క్రైస్తవ మతపరమైన సందేశాలు, ప్రత్యేక ఆశీర్వాదాలు.
- కుటుంబ సమ్మేళనాలు, పిల్లలకు వినోద కార్యక్రమాలు.

**2. మేత్రాసన స్థాయిలో**

- కుటుంబాలను గుర్తించి పురస్కారాలు మరియు బహుమతులను ఇవ్వడం.
- తల్లిదండ్రులు, పిల్లలు కోసం ప్రత్యేక ప్రార్ధనలు అలాగే సమావేశాలను నిర్వహించడం.
- భక్తి యాత్రలు చేపట్టటం
- సామాజిక సేవా కార్యక్రమాల్లో కుటుంబాలు పాల్గొనడం.

**దివ్యసత్ప్రసాద ఆరాధనలు – ప్రార్థనలు**

2025 జుబిలీ సంవత్సరం, నిరీక్షణ యాత్రికులు అనే అంశంతో, కుటుంబాలకు తమ విశ్వాసాన్ని మరింత అభివృద్ధిపరచే అవకాశాన్ని అందిస్తుంది. పరిశుద్ధ దివ్యసత్ప్రసాద ఆరాధనాల ద్వారా కుటుంబాలు

కలిసికట్టుగా ప్రార్థించడానికి, తమ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మరియు ఆధ్యాత్మిక జీవితాన్ని మననం చేసుకోవడానికి, మరియు క్రీస్తుని శక్తివంతమైన సన్నిధిని పరిధిలోని ప్రేమను, కృపను అనుభవించడానికి అవకాశం మనకు ఈ జూబిలీ సంవత్సరం మనకు అవకాశం ఇస్తుంది. జూబిలీ సంవత్సరం సందర్భంగా, శ్రీసభ తీర్థయాత్రలను మరియు భక్తి కార్యక్రమాలను ప్రోత్సహిస్తోంది.

## భార్యాభర్తల కోసం ప్రార్థన

ఓ సర్వశక్తిమంతుడా, భార్య భర్తల వివాహ బంధాన్ని ఆశీర్వదించి, క్రీస్తు ప్రభువుకు మరియు శ్రీసభకు మధ్య ఉన్న ప్రేమను ప్రతిబింబించేలా చేయండి. భార్య భర్తల దాంపత్య బంధాన్ని మీరు బలపరచండి, వారి మధ్య ప్రేమను పెంపొందించి, శాంతిని స్థాపించమని మా నాథుడైన క్రీస్తు ద్వారా ఈ మనవి చేయుచున్నాము. ఆమెన్.

## సంతానం కోసం ఎదురు చూస్తున్న దంపతుల కోసం ప్రార్థన

దయామయుడైన దేవా, మీ ప్రేమ ద్వారా ప్రపంచాన్ని జీవంతో నింపారు. మేము పిల్లలు లేని దంపతుల కొరకు ప్రార్థిస్తున్నాం. మీ అపార కృపను వారిపై చూపి సంతాన భాగ్యాన్ని ప్రసాదించమని మీకుమారుడును మా నాథుడైన క్రీస్తు నామంలో ప్రార్థిస్తున్నాము ఆమెన్.

## వృద్ధుల కొరకు ప్రార్థన

దయగల సర్వేశ్వరా వృద్దులను ఆశీర్వదించండి, వారికి ఆయురారోగ్యాలను ప్రసాదించి వారు మాకు విశ్వాసంలో ప్రేరణనిచ్చేలా వారిని దీవించమని. మా నాథుడైన యేసు క్రీస్తు ద్వారా ప్రార్థిస్తున్నాము. ఆమెన్.

**ఆదర్శ కుటుంబాల ప్రార్థన సహాయాన్ని కోరుదాం:**

- పునీతులు యోసేపు మరియు మరియమాత
- పునీతులు జ్వాకీము & అన్న
- పునీతులు లూయిస్ & సెలీ మార్టిన్

ఈ కుటుంబాలను ఆదర్శంగ తీసుకొని వీరి ప్రార్ధన సహాయం ద్వారా మన కుటుంబాలలో శాంతిని నింపి, ఈ జూబిలీ సంవత్సరం మన

కుటుంబాలలో కొత్త ఆశను నింపాలని, క్రీస్తు ఆశీర్వాదాన్ని అందించాలని ప్రార్థన చేద్దాం.

## జూబిలీ సంవత్సరము 2025: కుటుంబానికి పునరుద్ధరణకి సమయం

జూబిలీ సంవత్సరము 2025, నిరీక్షణ యాత్రికులమైన మనకి మన కుటుంబాలను నూత్నీకరించుకునే సమయం. కుటుంబాలలో ఆశను నింపి, కుటుంబాలకు పునరుద్ధరణకు, కుటుంబంలో ఐక్యత మరియు ఆధ్యాత్మిక వృద్ధిని పెంపొందించుకోడానికి శ్రీసభ ఈ జూబిలీ సంవత్సరం మనలను ఆహ్వానిస్తుంది ఇది మనకు ఒక గొప్ప అవకాశం. చరిత్రపరంగా, జూబిలీ సంవత్సరాలు కారుణ్య క్రియలు చేయడానికి మరియు దైవానికి సంబంధించిన విషయాలను అర్థం చేసుకోవదానికి అలాగే పునరావాసం కోరుకోవడం మరియు కుటుంబాలను పునరుద్ధరికరించడం కోసం నిమంత్రించబడ్డాయి. ఈ జూబిలీ సంవత్సరం మనందరికీ, మన కుటుంబాలకు ఒక ప్రత్యేక పిలుపు ఇస్తుంది. వివిధ వృత్తుల్లో పనిచేసేవాళ్ళు వారి వృత్తి యొక్క ఔన్నత్యాన్నీ తెలుసుకోవాలనేది శ్రీసభ ఆకాంక్ష. ఇది మన కుటుంబాలలో విశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి, ప్రేమ పంచుకోవడానికి మరియు కుటుంబాలలో ఆశను పుట్టించడానికి ఈ జూబిలీ ఒక అవకాశం.

## విశ్వాసం ద్వారా కుటుంబ బంధాలను బలపరచడం

కుటుంబం, సమాజపు మూలస్తంభంగా పరిగణించబడుతుంది, ఇది వ్యక్తులు మరియు సమూహాలను తీర్చిదిద్దడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. జూబిలీ సంవత్సరము కుటుంబాలను వారి విశ్వాస ప్రయాణాన్ని కలిసికట్టుగా పరిశీలించడానికి ప్రేరేపిస్తుంది, రోజువారీ జీవితంలో ప్రార్థన కేంద్రంగా ఉంచుతుంది. దేవాలయానికి వెళ్లడం, జపమాలను జపించడం, ప్రార్థన చేయడం మరియు విశ్వాస క్రియల్లో పాల్గొనడం వంటి ఆధ్యాత్మిక పద్ధతులను పాటించడం ద్వారా, కుటుంబాలు దేవునితో మరియు పరస్పరంగా బలమైన అనుబంధాన్ని పెంచుకోవచ్చు. జూబిలీ ఉత్సవాల్లో కీలకమైన భాగమైన యాత్రలు, కుటుంబాలకు ఆధ్యాత్మిక ప్రయాణాలను చేపట్టేందుకు అవకాశాన్ని అందిస్తాయి.

## క్షమాభిక్ష మరియు పునరావాసానికి పిలుపు

జూబిలీ యొక్క ప్రధాన సందేశాలలో ఒకటి పునరావాసం దేవునితో మరియు ఒకరితో ఒకరు. కుటుంబాలలో, గొడవలు మరియు అపార్థాలు అనివార్యం, కానీ జూబిలీ సంవత్సరము ప్రతి సభ్యునికి క్షమాభిక్షను స్వీకరించే అవకాశం కల్పిస్తుంది. దేవుని కరుణతో ప్రేరేపితమై, కుటుంబాలు ఈ సమయాన్ని పరస్పరం పునరావాసం పొందేందుకు ఉపయోగించుకోవచ్చు, దీనికి తెరలేని సంభాషణలు, మృదువైన చర్యలు మరియు గతం యొక్క బాధలను విడిచిపెట్టడానికి సిద్ధంగా ఉండటం అవసరం. జూబిలీ కాలంలో ప్రధానంగా ఉన్న అనుభవాల్లో ఒకటైన పరిహారపు క్రియ ద్వారా కుటుంబ సభ్యులు దేవుని అపరిమిత కరుణను అనుభవించగలరు మరియు అదే దయను ఒకరికొకరు అందించగలరు.

## రోజువారీ జీవితంలో ఆశను లేదా నిరీక్షణను గౌరవించడం

ఆశ క్రైస్తవ జీవితానికి మార్గదర్శక కాంతి, మరియు జూబిలీ సంవత్సరము కుటుంబాలను వారి రోజువారీ జీవితంలో ఆశ యొక్క కిరణాలు కావాలని పిలుస్తుంది. ఇది నిరాశకు బదులుగా ఆశావాదాన్ని, భయానికి బదులుగా విశ్వాసాన్ని మరియు విభేదానికి బదులుగా ప్రేమను ఎంచుకోవడం ద్వారా సాధ్యమవుతుంది. అనిశ్చితి మరియు కష్టసాధ్యమైన ప్రపంచంలో, కుటుంబం ప్రోత్సాహం మరియు విశ్వాసం యొక్క ఆశ్రయంగా పని చేయగలదు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆశ, సహనం మరియు దేవుని అనుగ్రహంపై నమ్మకం వంటి విలువలను బోధించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. భోజనాలను కలసి పంచుకోవడం, ప్రోత్సాహకరమైన మాటలను చెప్పడం మరియు సేవా కార్యాల్లో పాల్గొనడం వంటి చిన్న చర్యలు కుటుంబ బంధాలను బలపరచడమే కాకుండా, ఇంట్లో మరియు సమాజంలో ఆశను పెంచగలవు.

## దేవుని ప్రేమకు కుటుంబం సాక్ష్యంగా ఉండటం

జూబిలీ సంవత్సరము 2025 కేవలం వ్యక్తిగత పునరుద్ధరణ సమయం మాత్రమే కాకుండా, బహిరంగ సాక్ష్యానికీ ఒక అవకాశం. కుటుంబాలను తమ విశ్వాసాన్ని గృహాలలో మాత్రమే కాకుండా, తమ సమాజంలో సేవా

కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విస్తరించమని ప్రోత్సహించబడతాయి. స్వచ్ఛంధ సేవలు, అవసరమైన వారికి సహాయం చేయడం లేదా స్నేహపూర్వక మాటలు చెప్పడం ద్వారా, కుటుంబాలు దేవుని ప్రేమ మరియు దయ యొక్క ప్రత్యక్ష సాక్ష్యంగా మారగలవు. ఇది పాపుగారి ఫ్రాన్సిస్ ఓపెన్ (అందరికి అందుబాటులో ఉండే) చర్చిగా ఉండటానికి ఇచ్చిన పిలుపుకు మరియు ప్రజల జీవితాల్లో ప్రగాఢంగా పాల్గొనడానికి అనుగుణంగా ఉంటుంది.

## పాపుగారి ఫ్రాన్సిస్ సందేశం

పాపుగారి ఫ్రాన్సిస్ జుబిలీ సంవత్సరమైన 2025 *("Pilgrims of Hope")* సందర్భంగా కుటుంబాల ప్రాముఖ్యతను ఎల్లప్పుడూ ప్రధానంగా పేర్కొన్నారు.

### 1. పోప్ బుల్ *"Spes Non Confundit"*

పాపుగారి ఫ్రాన్సిస్ తన పాపల్ బుల్ *"Spes Non Confundit"* (ఆశ నిరాశపరచదు) లో, ఈ జుబిలీని ఆశను పునరుద్ధరించుకునే గొప్ప అవకాశంగా పేర్కొన్నారు. ప్రత్యేకించి, అవసరమైన వారిని విస్మరించకుండా సమగ్ర సహకారాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.

### 2. కుటుంబాలకు ప్రత్యేక సందేశం

రోమ్ ప్రజలకు పంపిన సందేశంలో, పాపుగారి ఫ్రాన్సిస్ కుటుంబాలను ప్రేరేపిస్తూ, జుబిలీ కౌమారదశ యువతీ యువకుల కోసం, అలాగే యువత / జూబిలీ కోసం వచ్చే యాత్రికులను తమ ఇళ్లలో ఆతిథ్యం ఇవ్వాలని సూచించారు. ఇది కేవలం యాత్రికులకు సహాయపడడమే కాకుండా, హోస్ట్ కుటుంబాలకు కూడా కొత్త స్నేహాలను, పరస్పర అవగాహనను అందించే అవకాశమని చెప్పారు.

### 3. కుటుంబాల్లో శాంతి, ప్రేమ, క్షమాభావం పెంచుకోవాలని పిలుపు

2025 జనవరి 5 తేదీన ఇచ్చిన *Angelus* ప్రసంగంలో, పాపుగారి ఫ్రాన్సిస్ ఆశ సందేశవాహకులు *(Messengers of Hope)*గా క్రైస్తవులను జీవించమని పిలుపునిచ్చారు. దేవుని కాంతిని కుటుంబాలలో, సమాజంలో ప్రతిబింబించాలి. క్షమాభావం, దయ, పునరుద్ధరణ ద్వారా శాంతిని వ్యాప్తి చేయాలి అని ఆయన అన్నారు.

## ముగింపు

నిరీక్షణ ప్రయాణీకులుగా, కుటుంబాలకు జూబిలీ సంవత్సరము 2025 లో ముఖ్యమైన పాత్ర ఉంది. తమ విశ్వాసాన్ని దృఢపరచుకోవడం, పునరావాసాన్ని అంగీకరించడం మరియు ఆశతో జీవించడం ద్వారా, వారు నిజమైన పునరుద్ధరణను అనుభవించగలరు మరియు తమ గృహన్నీ ఒక పుణ్య స్థలంగా మలచి తమను తాము బలపరచుకోవచ్చు. జూబిలీ అనేది ఒక వరం, ఒక పవిత్ర సమయం, దీనిలో కుటుంబ సభ్యులు దేవునికి మరియు ఒకరికొకరు మరింత చేరువ కావచ్చు. ప్రేమ, విశ్వాసం మరియు ఆశ ద్వారా, కుటుంబం ప్రపంచంలో వెలుగునిచ్చే ఒక దీపంగా నిలుస్తుంది. మనం ఈ ప్రయాణాన్ని కలసి ప్రారంభించేటప్పుడు, మన కుటుంబాలు దయలో పునరుద్ధరించబడాలని, కరుణతో ప్రేరేపితమై ఉండాలని మరియు క్రీస్తు ద్వారా లభించే ఆశలో ఐక్యంగా ఉండాలని ప్రార్థిద్దాం.

❁ ❁ ❁ ❁

# 8. యువతా జూబిలీ

– బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్

## ఉపోద్ఘాతము



కతొలిక శ్రీసభలో జూబిలీ అనేది పునరుద్ధరణ సమయం. ఇది దేవుని కరుణను మరియు మన్నింపును అనుభవించే, ఆ ప్రభుని కృపావరాలు మన స్వంతం చేసుకొనే ఒక ప్రత్యేక సమయం. ఈ జూబిలీ సమయాలు, విశ్వాసులందరికీ ప్రభువు నందు నాటుకుపోవడానికి, తమ జీవితాలను దేవుని దయ మరియు కరుణతో నింపుకోవడానికి అవకాశం కలిగిస్తాయి. ఈ జూబిలీ సంవత్సరంలో, పరిశుద్ధ పాపు గారు అనేక మందిని దృష్టిలో ఉంచుకొని వారికి ప్రాముఖ్యతనిస్తూ వారిని ఉద్దేశించి జూబిలీలు జరపటం గమనార్హం. ప్రత్యేకంగా యువతీ యువకుల కోసం జూలై 28 నుండి ఆగస్టు 3, 2025 వరకు గల రోజులు కేటాయించటం ఎంతో సంతోషదాయకం (పియర్ జార్జియో ఫ్రస్సాటీని పునీత పట్టం కూడా అందులో భాగమే). ఈ జూబిలీ, యువతీ యువకులు తమకు శ్రీసభ లో గల హక్కులు, భాద్యతలను మరింత స్పష్టంగా గుర్తించే ప్రక్రియగా, వారి జీవితాలను శుద్ధి చేసుకోవడానికి మరియు క్రీస్తుని కరుణతో వారి జీవితాలను నింపడానికి ఒక ప్రత్యేక పిలుపునిస్తుంది. ఇది, ముఖ్యంగా, ఆధునిక సమాజంలో యువతీ యువకులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే ఒక దిశగా వారి ప్రయాణాన్ని మార్గనిర్దేశం చేస్తుందని శ్రీసభ ఆశిస్తుంది.

## పరిశుద్ధ పాపు గారి ఉద్దేశ్యం

పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపు గారు యౌవనులను ఉద్దేశిస్తూ, క్రీస్తుస్ వివిత్ (క్రీస్తు సజీవుడు) అను ఆయన అపోస్తలిక ప్రభోదంలో (2019)లో, యువత ఎల్లప్పుడూ ఒక కొత్త ప్రారంభానికి, ప్రేరణకు, మరియు ఆశకు అర్హులని ప్రస్తావించారు. ఆయన చెప్తున్నట్లు, యువతీ యువకులు శ్రీసభ యొక్క భవిష్యత్తు మాత్రమే కాకుండా, ప్రస్తుత కాలంలో దాని సాక్షులు కూడా అని ఆయన పేర్కొన్నారు. యువత కేవలం నామ మాత్రపు విశ్వాసులుగా కాక శ్రీసభ ప్రేషిత కార్యంలో చురుకుగా పాల్గొనేవారిగా ఉండాలని చెబుతున్నారు. ఈ జూబిలీ, 21వ శతాబ్దంలో యువతులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను గుర్తించడానికి, వారిని ప్రభావితం చేసే సామాజిక మరియు ఆధ్యాత్మిక విషయాలపై, ఒక వెలుగును విస్తరించే సమయంగా కొనియాడబడుతుంది.

పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపు గారు, యువతీ యువకులు దేవునితో ఉన్న వ్యక్తిగత సంబంధాన్ని బలోపేతం చేయాలని ప్రేరేపిస్తున్నారు. శ్రీసభ తన యువతను ఒక అభివృద్ధి చెందిన ఆధ్యాత్మిక జీవితానికి దారితీసే ప్రేరేపక శక్తిగా చూడాలని ఆకాంక్షిస్తుందని తెలియజేస్తున్నారు. పాపుగారు సువార్తానందం అను తన అపోస్తలిక ప్రభోదంలో (2013)లో, యువతీ యువకులు క్రీస్తు సువార్తను, జ్ఞానం మరియు అనుభవం ద్వారా తెలుసుకోవడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. (12) అని తెలియజేస్తున్నారు. సువార్తా ప్రభోదం ప్రధానంగా ప్రభుని పని. స్వయంగా ఆయనే కొనసాగించే ధార్మిక కార్యము. తనకు సహాయకులుగా పని చేసే అవకాశం ఆయనే మనకు కల్పించారు. యువతీ యువకులు ప్రభుని ప్రేషిత కార్యంలో పాల్గొనటం, పవిత్రత సహాయంతో, వారి మేధా శక్తితో నవ్య విధానాలను ప్రభుని సువార్తను అందరికీ చాటి చెప్పేలా యువత చొరవ తీసుకోవాలి. ముందుగా వారు తెలుసుకొని ఇతరులకు ప్రభుని పంచే వారీగా యువత ఉండాలని పాపు గారు భావిస్తున్నారు. ఈ జూబిలీ, కేవలం ఒక బాహ్య వేడుకగా మాత్రమే కాకుండా, యువతులను క్రీస్తుతో మరింత దగ్గరగా అనుబంధాన్ని ఏర్పరచుకోవడానికి, క్రీస్తును పూర్ణ మనస్సుతో, పూర్ణత్మతో, పూర్ణ శక్తితోనూ అనుసరించేందుకు ప్రేరేపించే ఒక

మార్గదర్శిగా నిలుస్తుంది. ఇది యువతులను వారి జీవితాలను మరింత ఆశ, ప్రేమ మరియు కరుణతో నింపేలా మార్గనిర్దేశం చేస్తుంది.

## జూబిలీ ప్రభావము

యౌవనుల కోసం నిర్దేశించిన ఈ జూబిలీ, సమాజంలో, మరియు శ్రీసభ లో యువతుల పాత్రను గౌరవించి, వారిని నూతన ఆశ, ఆకాంక్షల వైపు, పునరుద్ధరణకు మరియు సేవకు ప్రేరేపిస్తుంది. అవనికి అరుదెంచి రక్తం చిందించి రక్షణ సాధించిన క్రీస్తు ను అనుభూతి చెందేందుకు, ఆయన సువార్తను విస్తరించడానికి, వారి జీవితాలను సేవకు అంకితం చేసే భావాన్ని మెదిలించ మరియు దానిని నెరవేర్చ సామర్థ్యం కోసం, యువత వ్యక్తిగతంగా మరియు సమాజంలో నూతన జీవితం పొందేలా ప్రేరేపిస్తుంది. యువత సమాజానికి అనేక మార్పులు తీసుకువచ్చే వారిగా, దేవుని దయ మరియు కరుణలను తమ వంతుగా ఈ ప్రపంచానికి అందిస్తూ, క్రీస్తే మన ఏకైక నిరీక్షణ మరియు ఆశ అను సత్యాన్ని తెలియజేయాలని రెండవ వాటికన్ అధికార పత్రమయిన ఆధునిక ప్రపంచంలో శ్రీసభ (గౌదియుం ఎత్ స్పెస్, 1965) పేర్కొంటుంది. ఇది, యువతులు క్రీస్తు యొక్క సందేశాన్ని అనుసరించి, సామాజిక న్యాయం కొరకై శ్రమించాలని కూడా సూచిస్తుంది.

## యువతీ యువకుల ప్రతిస్పందన: క్రీస్తులోనే ఆనందం మరియు క్రీస్తే ఆశా జ్యోతి

ఈ జూబిలీ భావాన్ని అర్ధవంతగా కొనియాడిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువతులు క్రీస్తును తమ ఆశగా, బలంగా చూడాలని దానికి తగ్గట్టు యువత శ్రీసభలో తమ వంతు పాత్ర పోషిస్తూ ప్రతిస్పందించాలని పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపు గారు పిలుపునిచ్చారు. క్రీస్తుస్ వివిత్ (క్రీస్తు సజీవుడు, 2) అను ఆయన అపోస్తలిక ప్రభోదంలో (2019), యువతులు ఈ ప్రపంచంలో పునరుద్ధరణకు సంబంధించిన మార్గాలను కనుగొనాలి మరియు క్రీస్తు జీవితాన్ని అనుసరించి వారి హృదయాలను శుద్ధి చేసుకోవాలి మరియు క్రీస్తు మా ఆశ మరియు జీవితం, ఆయనలో మాత్రమే ఆనందం దొరుకుతుంది అనే భావాన్ని పునికిపుచ్చుకోవాలని స్పష్టం చేశారు. ఈ జూబిలీ, యువతులను తమ ఆధ్యాత్మిక

జీవితాన్ని పునఃప్రారంభించేందుకు, దేవుని దయను అనుభవించి, క్రీస్తు భోధించిన సూవార్త విలువలను అవలంబించుకొని ప్రపంచానికి చాటిచెప్తూ, సమాజంలో మార్పును తీసుకురాగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉండాలని పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపు గారు ఆకాంక్షిస్తున్నారు.

**జూబిలీ 2025లో ప్రగతిశీల భవిష్యత్తు కోసం యువతకు మార్గదర్శకాలు**

2025 జూబిలీ సంవత్సరంలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కతోలికులు తమ విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడానికి, శ్రీసభలో తమ పాత్రపై దృష్టిని మరల్చుడానికి, భవిష్యత్తులో ఆశతో మరియు ధృడమైన సంకల్పంతో శ్రీసభ విశ్వాస ప్రయాణంలో నడవడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని పొందుతున్నారు. ఈ సంవత్సరంలో యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవడం, దేవునితో సంబంధాన్ని లోతుగా ఏర్పరచుకోవడం శ్రీసభ ప్రేషిత కార్యంలో చురుకుగా పాల్గొనడం మరియు స్వీయంగా, ప్రపంచ ప్రగతిశీల భవిష్యత్తును నిర్మాణించుటకు కొన్ని ముఖ్యమైన సూచనలు అందించబడినాయి. అవి ఏమనగా,

**1. ప్రార్థన మరియు దివ్య సంస్కారాల ద్వారా దేవునితో సంబంధాన్ని మరింత లోతుగా ఏర్పరుచుకోవాలి**

క్రైస్తవ జీవితానికి పునాది ప్రార్థన. యువత ప్రతిరోజూ ప్రార్థనలో గడపడం, క్రమం తప్పక దివ్యబలిలో పాల్గొనటం మరియు ఇతర భక్తి కార్యక్రమాలలో చురుకుగా చొరవ తీసుకోవాలి. మరి ముఖ్యంగా దివ్యబలితో పాటు పాప సంకీర్తన లాంటి ప్రత్యేకమైన కృపా మరియు ఆధ్యాత్మిక శక్తిని ఇచ్చే దివ్య సంస్కారాల పట్ల మక్కువను కనబరచాలి మరియు శ్రద్ధతో పాల్గొనాలి. తద్వారా దేవునితో సంబంధాన్ని మరింత లోతుగా ఏర్పరుచుకోగలరు.

**2. సేవ మరియు కనికర భావంతో జీవించుట**

ప్రేమ మరియు సేవ క్రీస్తు మనకు నేర్పిన తత్వం. అదే అసలైన క్రైస్తవత్వం. యువత సాధ్యమైన మేరకు సేవా కార్యక్రమాల్లో పాల్గొనటానికి సిద్ధపడాలి. శ్రీసభ ద్వారా గాని లేదా ఇతర సామాజిక స్వచ్ఛంద సేవ సంస్థల ద్వారానైనా, అవసరమైన వారికి సహాయం చేయడం, ముఖ్యంగా అణచివేయబడిన,

అణగద్రొక్కబడిన వారికి, తమ స్వరమును వినిపించలేని వారి కొరకు అండగా నిలబడి న్యాయం వచ్చే వరకు సాయం చేయడం, అలాగే, పేదలకు మద్దతు ఇవ్వడం, పర్యావరణ రక్షణ కోసం తమ వంతు కృషి చేయటం, మరియు ఇతర సమాజ శ్రేయస్సు కోసం నిర్వహించే సామాజిక కార్యక్రమాలలో పాల్గొనటం ఎంతో అభినందనీయం. సేవా క్రియలు క్రీస్తుని ప్రేమను ప్రతిబింబిస్తాయి మరియు జీవవంతమైన విశ్వాసాన్ని ప్రదర్శిస్తాయి.

## 3. శ్రీసభ ఉపదేశములను అర్థం చేసుకొవటం

శ్రీసభ భోదించు సిద్ధాంతాల్ని లోతుగా అర్థం చేసుకోవడం, యువతకు వారి విశ్వాస ప్రయాణంలో సహాయం చేస్తుంది. దైవ వాక్కు పఠనం, సత్యపదేశ మననం, పునీతుల జీవితాలను తెలుసుకోవడం ఎంతో ప్రోత్సాహకరం. శ్రీసభ భోదించు సిద్ధాంతాల్ని అర్థం చేసుకోవడం వారికి, జీవితంలోని సవాళ్లను అధిగమించడంలో సహాయపడుతుంది మరియు వారి విశ్వాసాన్ని ఇతరులతో పంచుకోవడంలో సహాయపడుతుంది. కుటుంబ జీవితం, సామాజిక మరియు నైతిక బాధ్యతలపై చర్చలలో పాల్గొనడం కూడా వ్యక్తిగత అభివృద్ధి మరియు సంఘ శ్రేయస్సుకు అంకురార్పణంగా మారుతుంది.

## 4. గురుమండల కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనటం

గురు మండలం ఒక కుటుంబం, మన స్వంత కుటుంబం. అందులో నిర్వహించే కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం మన ఆధ్యాత్మిక అభివృద్ధికి మొదటి మెట్టు. యువత, యూత్ గ్రూపులు, ప్రార్థన సంఘాలలో చేరి తమదైన శైలిలో సువార్త ప్రభోదంలో పాల్గొనాలి. ఈ అవకాశాలు సద్వినియోగ పరచుకున్నట్లయితే, వారు, తమ విశ్వాసంలో ఎదగడానికి మరియు వారు చేపట్టే మంచి కార్యక్రమాలకు ఇతర విశ్వాసుల నుంచి వారు మద్దతు పొందడానికి సహాయపడతాయి. వత్తాసు చేయడానికి, దివ్యబలి పూజలో పఠనం చదువుటకు లేదా భక్తి కార్యక్రమాల ఏర్పాటులో గురువుకు సహాయం చేయడం, ఇతర కార్యకలాపాల్లో నాయకత్వం తీసుకోవడం ద్వారా తమ వంతు కృషిని శ్రీసభ ప్రేషిత కార్యానికై వినియోగించినట్లే.

## 5. దైనందిన జీవితంలో విశ్వాసపు సాక్షులుగా ఉండుట

యువత, తమ విశ్వాసాన్ని రోజువారి పరిస్థితుల్లో జీవించడం, సువార్తా ప్రభోదానికై ఒక శక్తివంతమైన మార్గం. వారి సంభాషణలలో, ఇతరులతో గల సంబందాలలో క్రైస్తవ గుణాలను (ముఖ్యంగా దయ, నిజాయితీ, సహనం) ఆచరించాలి. వారు చదువుకొనే పాఠశాలల్లో, పని ప్రదేశాలలో, వారి క్రియలే మాటల కంటే ఎక్కువగా మాట్లాడుతాయి, విశ్వాస సాక్షులగా మలుస్తాయి. అందుకుగాను యువత మాటలో సత్యము, పనిలో ప్రేమ కనబరచాలి. తద్వారా ఇతరులకు ప్రభుని విశ్వాస ప్రేరణను ఇస్తూ విశ్వాస ప్రేరకులగా మారుతారు. అదనంగా, సోషల్ మీడియా ద్వారా విశ్వాస సంబంధిత సందేశాలు తెలియపరచడం, మంచి ఆలోచనలకు ప్రేరణ ఇవ్వడంలో సమాజానికి సహాయం చేయవచ్చు.

## 6. పవిత్రతను ఆలింగనం చేసుకోవటం

ప్రతి క్రీస్తు అనుచరునికి జీవితంలోని ఏ స్థితిలో ఉన్నప్పటికీ పవిత్రత పట్ల పిలుపు ఉంది. లోకానికి వెలుగు శ్రీసభ అను వాటికన్ అధికార పత్రం, నెం. 40 లో ఇలా చదువుతాం : పరమ పావనుడు, దివ్య బోధకుడు, నిష్కలంక జీవితానికి నిర్మలమైన మాతృక తానైన యేసు ప్రభువు, తన శిష్యులలో ప్రతి ఒక్కరినీ పవిత్ర జీవనం గడపమని కోరారు. ఈ విషయంలో ఎవరికి మినహాయింపు లేదు: పరలోక మందున్న మీ తండ్రి పరిపూర్ణుడైనట్లే మీరును పరిపూర్ణులగుదురుగాక! (మత్తయి 5:48). ఈ విషయం పై యువత మరింత శ్రద్ధ కనబరచాలి.

రోజూ వారి కార్యకలపాలల్లో, సంబంధాల్లో పవిత్రతను అనుసరించడం ఎలా సాధించవచ్చో పెద్ద వయస్కుల నుండి లేదా ఆధ్యాత్మకంగా అనుభవం ఉన్న గురువల దగ్గర గాని ఇంకెవరనయినా గాని యువత సలహాల కోసం సంప్రదించవచ్చు. జూబిలీ సంవత్సరంలో, ఇది వారి ఆధ్యాత్మిక లక్ష్యాలను తిరిగి పరిశీలించడానికి మరియు క్రీస్తే ఆధారంగా జీవించే పునరుద్ధరణకు ఇది గొప్ప అవకాశం.

## 7. నవీన సువార్త ప్రచారంలో భాగస్వామ్యం పొందాలి

శ్రీసభ తాను చేపట్టే ప్రేషిత కార్యంలో, కాలానుగుణంగా క్రీస్తు సందేశాన్ని అందరికీ పంచుటకు నూతన ఒరవడిని, కొత్త మార్గాలను కోరుతుంది. యువత, వారి విశ్వాసాన్ని ఆధునిక ప్రపంచపు జీవితానికి అనుగుణంగా జీవించి ఇతరులకు తెలియపరచడం ద్వారా కీలకమైన పాత్ర పోషించవచ్చు. వారు సామాజిక సేవా కార్యక్రమాల్లో, వ్యక్తిగత సంభాషణలలో లేదా సామాజిక మాధ్యమాలలో విశ్వాసాన్ని పంచడం ద్వారా ఈ పిలుపు తీసుకోవచ్చు. మిషనరీ సేవలకు ఆర్థిక సహాయం లేదా ప్రార్థన సహాయం ద్వారా లేదా వారి జీవితాన్ని ప్రభునికి అర్పిస్తూ సువార్త సేవకునిగా ఉండ ఆలోచించడం కూడా ఈ పిలుపుని స్వీకరించడంలో ఒక మార్గమే.

## 8. సోషల్ మీడియా యొక్క బాధ్యతాయుత వినియోగాన్ని పాటించాలి

ఈ డిజిటల్ యుగంలో, యువత జీవితంలో సోషల్ మీడియా విడవడానికి అసాధ్యమైన ఒక భాగంగా మారింది. వారిని ఈ మాధ్యామాలను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, మరియు విశ్వాసాన్ని ప్రతిబింబించే సానుకూల, స్ఫూర్తిదాయక విషయాలను ఈ మాధ్యామాల ద్వారా ఇతరులకు తెలియజేయలని శ్రీసభ ప్రోత్సహిస్తుంది. సోషల్ మీడియాను ఒక శక్తివంతమైన యంత్రంగా, ఇది క్రీస్తు సందేశాన్ని పంచుటకు , మంచి చర్చలు నిర్వహించుటకు వినియోగించవచ్చు. అయినప్పటికీ, వారు సోషల్ మీడియాలో పొందే సమాచారం మరియు వీరు ఇతరులకు పంచే విషయాలపై జాగ్రత్తగా ఉండటం చాలా ముఖ్యం. ప్రతికూల లేదా విభజనాత్మక విషయాలను మరియు తప్పు సమాచారాన్ని పంచకూడదు. అదే విధంగా ఇతరుల గోప్యతకు గౌరవం ఇవ్వడం నేర్చుకోవాలి. యువత కతొలిక విలువలను ప్రతిబింబిస్తూ, బాధ్యతాయుతంగా సోషల్ మీడియా వినియోగాన్ని పాటించాలి.

## ముగింపు

ఈ జూబిలీ సంవత్సరం యువతీ యువకులకు క్రీస్తుతో మరింత లోతైన సంబంధాన్ని ఏర్పరచడానికి, తమ జీవితాలను సేవగా మరియు సువార్త సందేశాన్ని ప్రపంచానికి చేరవేయడానికి ఒక అపూర్వమైన అవకాశంగా

నిలుస్తుంది. దానికి గాను ముందుగా యువతీ యువకులు దేవుని కరుణను అనుభవించి, తమ నమ్మకాన్ని పెంచుకోవాలని పరిశుద్ధ పాపు గారు కోరుచున్నారు. ఈ జూబిలీ సమయంలో, యువకులు నిరీక్షణ యాత్రికులుగా కావాలని మరియు ఆ నిరీక్షణ ఒక వ్యక్తిగత చర్యగా కాక పరస్పరం ఒకరినొకరు బలపరచుకొనుటకని యువత గుర్తించాలి. ఈ జూబిలీ పవిత్ర సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీసభ ఉత్సవం. అనేక భాషలు, సంస్కృతులు, సామాజిక, రాజకీయ వ్యక్తీకరణలు కలసి ఒకే విశ్వాస కుటుంబంగా ఐక్యమై ఈ జూబిలీని జరిపినప్పుడు అది నిజంగా నిరీక్షణ చిహ్నంగా మారుతుంది. ఈ సందేశం యువతీ యువకులను ప్రపంచానికి సేవ, ప్రేమ మరియు శాంతిని అందించే నిరీక్షణ చిహ్నాలుగా మలచాలని ఆశిస్తున్నాను.

❋ ❋ ❋ ❋

# 9. సువార్తా సేవకుల జూబిలీ

**– బ్రదర్ కొట్టె అరవింద్**



తల్లి శ్రీసభ మహా జూబిలీ సంవత్సరం – 2025లో ప్రత్యేకంగా అక్టోబర్ 18న సువార్త సేవకులు జూబిలీ వేడుకను జరుపుకోవడానికి మనల్ని ఆహ్వానిస్తుంది. ఈ జూబిలీ ఆచారం అనేది పాత నిబంధన నాటి సాంప్రదాయం దీనిని మన కతోలిక సాంప్రదాయాలలో ఒక ప్రత్యేకమైనదిగా భావిస్తాం. సువార్త సేవ అనేది ఒక ప్రత్యేకమైన బాధ్యత మరియు కర్తవ్యం. ఈ బాధ్యత కేవలం అభిషేకం పొందిన గురువులు, పీఠాధిపతులు మాత్రమే కాక జ్ఞానస్నానం స్వీకరించిన ప్రతి ఒక్కరి బాధ్యత. మనమంతా సువార్త వ్యాప్తికై, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ఎక్కువగా శ్రమించాలి. ఎందుకంటే ఈ సేవ మానవుని సొంత స్వలాభమునకు సంబంధించినది కాదు. ఈ సేవ దేవుని కుమారుడును త్రిత్వంలో రెండో వ్యక్తియును అయినా యేసుక్రీస్తు ఇచ్చిన ప్రధాన బాధ్యత, కర్తవ్యం.

మీరు వెళ్లి సకల జాతి జనులకు పిత, పుత్ర పవిత్రత్మ నామమున జ్ఞాన స్నానమొసుగుచు వారిని నా శిష్యులను చేయుడు. (మత్తయి 28:19) ఇదే క్రీస్తు ప్రభువు ఇచ్చిన ప్రధాన బాధ్యత.

సువార్త సేవకులుగా, కతోలికులుగా లేక విశ్వాసులుగా మనం ఈ సువార్త వ్యాప్తి చేయడానికి మన ప్రధాన కర్తవ్యంగా స్వీకరించాలి. ఇది జ్ఞానస్నానం స్వీకరించిన ప్రతి ఒక్కరి విశ్వాసాన్ని పెంపొందించడానికి ఉపయోగపడుతుంది. నేటి ఆధునిక యుగంలో శ్రీసభ ఉనికికి ముప్పుగా సువార్త సేవ చేయడంలో సవాలుగా, సేవకులకు సమస్యగా ఈ విశ్వాసం అనేది మార్పు చెందుతుంది. ఈ సువార్త సేవకుల జూబిలీ విశ్వాసంలో ఈ సమస్యను ఎదుర్కొనే వారందరికీ

ఒక క్రొత్త ఆశను నమ్మకాన్ని, విశ్వాసాన్ని కలిగించడానికి ఈ జూబిలీ సంవత్సరం ఎంతగానో ఉపయోగపడుతుంది.

## సువార్త సేవ యేసుక్రీస్తు మనుష్యవతార రహస్యము

దేవుడు లోకమును ఎంతో ప్రేమించి తన ఏకైక కుమారుని ప్రసాదించెను ఆయనను విశ్వసించు ప్రతివాడు నాశనము చెందక నిత్యజీవమును పొందుటకై ఆయన అటుల చేసెను. (యోహాను 3:16) దేవుడు తన ఏకైక కుమారుడిని ఈ లోకానికి పంపి మానవాళి పాప పరిహారంనకై తన ప్రాణాలను మనకు త్యాగం చేసి, మానవాళికి రక్షణను ఇచ్చారు. ఆదిలో వాక్కు, ఆ వాక్కు మన మధ్య నివసించెను అను వాక్యాన్ని బట్టి క్రీస్తు జన్మమును, ఈ లోకంలో సువార్త జననంగా మనం అర్థం చేసుకోవాలి. అదే సువార్త జననం ఈ 2025 సంవత్సరాలు నిరంతరాయంగా కొనసాగుతూ వచ్చింది. ఇకముందు కూడా కొనసాగుతుంది.

సువార్త సేవకుల కృషి మరియు సువార్త వ్యాప్తి ఎనలేని ప్రక్రియ. ఈ సువార్త వ్యాప్తి యేసు ప్రభువుని ఇహలోక జీవితంతోనే ముగియలేదు. ఎందుకంటే క్రీస్తు ప్రభువు (ఆల్ఫా - ఒమేగా), ఆదియును- అంతమును. కావుననే వాక్కు రూపంలో ఉన్న ఆయనకు అంతం ఉండదు. యేసుక్రీస్తు మోక్షరోహణకు ముందు తన శిష్యులను తన చెంతకు పిలుచుకొని మీకు శాంతి కలుగును గాక నా తండ్రి నన్ను పంపినట్లే నేనును మిమ్ము పంపుచున్నాన్ను అని క్రీస్తు పలకడాన్ని మనం అర్థం చేసుకున్నాము. ఇది సాధారణమైన ఆహ్వానం కాదు, క్రీస్తు అధికారం నుండి ఉద్భవించిన అధికారిక ఆహ్వానం. ఈ సువార్త సేవ/ సువార్త వ్యాప్తి ఒక ప్రాంతానికో, ఒక కాలానికో, పరిమితం కాదు. ఇది ఎల్ల కాలం జరిగే క్రీస్తు సేవ ఈ సేవలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవడానికి ప్రయాసపడాలి ఎన్ని కష్టాలు, బాధలు మనకు ఎదురైనా అయినా వాటిని ఎదుర్కొని క్రీస్తు సువార్త వ్యాప్తికై కృషి చేయాలి.

## సువార్త సేవకులపై దృష్టి

ఈ సువార్త సేవకులు జూబిలీ సువార్త సేవకుల కృషిని, త్యాగాన్ని గుర్తించి వారికి అంకితం చేయబడింది. సువార్త సేవకులు ముఖ్యంగా క్రైస్తవత్వంలో

జ్ఞానస్నానం పొంది జీవిస్తున్న ప్రజలను వెలుగు బాటలో ముందుండి నడిపించుటకు, విశ్వాసాన్ని, సత్యాన్ని వ్యాప్తి చేయడానికి విద్యను, పేదలకు అండగా నిలుస్తున్నారు. ప్రత్యేకంగా సువార్త ప్రచార నిమిత్తమై సువార్త సేవకులు వివిధ ప్రాంతాలలో, సువార్త సేవలో నిమగ్నమై ఉంటున్నారు. ఎక్కడైతే ఆర్థిక, సామాజిక కష్టాలలో ఉన్న ప్రజలను ఆదుకోవడం వారి కష్టాలలో పాలుపంచుకోవడానికి వారి సొంత కుటుంబాన్ని వదిలి ప్రజలే తమ కుటుంబంగా గుర్తించి సేవ చేస్తున్నారు. వారి కోసం ప్రత్యేకంగా ప్రార్థించడం ఎంతో అవసరం వారి కష్టాలను గుర్తించి వారికి సహాయం చేయడం ఎంతో అవసరం. కావున ఈ సువార్త సేవకుల జూబిలీ వారి సేవ త్యాగాన్ని గుర్తించి వారికి అండగా నిలబడాలి అది జ్ఞానస్నానం పొంది క్రీస్తు సేవలో అనుదినం జీవిస్తున్న మన బాధ్యత.

## సువార్త ప్రచారం – విశ్వాసుల ప్రాధాన్యత

సువార్త సేవకులు జూబిలీ ప్రధాన ఉద్దేశాలలో మొదటిది సువార్త సేవకులు వారి సువార్త సేవ పిలుపును పునరుద్ధరించడం. రెండవదిగా ప్రపంచ నలుమూలలకు క్రీస్తు సందేశాన్ని వ్యాప్తి చేయడం. తల్లి శ్రీసభ సువార్తికుల సేవ, కృషిని మరియు శ్రమను గుర్తించింది వీరి సువార్త సేవ ద్వారా ఎంతోమంది ప్రయోజకులుగా మారడం, మారిన ప్రతి వ్యక్తి ఇతరులకు చేదోడువాదోడుగా ఉండడం ఎంతో ఆనందదాయకమైన విషయంగ. శ్రీసభ పరిగణించి ఈ సువార్తికులు మరింత ఎక్కువగా కృషి చేయాలని ప్రోత్సహిస్తూ ఈ జూబిలీని జరుపుకుంటుంది.

సువార్త సేవలో పాలుపంచుకునేవారు కేవలం అభిషేకం పొందిన వారు మాత్రమే కాక జ్ఞానస్నానం స్వీకరించిన ప్రతి ఒక్కరి బాధ్యతగా స్వీకరించాలి. యేసుక్రీస్తు నిజమైన దేవుని కుమారుడని విశ్వసించిన ప్రతి క్రైస్తవుడి క్రైస్తవురాలి పాత్ర ఉండాలి. ఎందుకంటే జ్ఞానస్నానం ద్వారా శ్రీసభ లోనికి ఆహ్వానింపబడి దేవుని బిడ్డలుగా జీవిస్తూ ఉన్న క్రైస్తవులమైన మనము సువార్త సేవలో చురుకైన భాగస్వామ్యం కలిగి ఉండాలి ఇదే శ్రీసభ మన నుండి కోరుకునేది. అందుకే సువార్త సేవ అభిషేకం పొందినవారు విశ్వాసుల పాత్రను తగ్గించకుండా వారిని మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది.

మనం అమితంగా ప్రేమించే యేసుక్రీస్తు అప్పగింపబడిన ప్రేషిత కార్యము అయిన సువార్త సేవను ఆధ్యాత్మిక క్రియల ద్వారా ప్రపంచ నలుమూలలలో బోధించడానికి ప్రయాసపడాలి. కతోలిక విశ్వాసులమైన మనం మన విశ్వాసాన్ని సువార్త సేవ ద్వారా ఇతర విశ్వాసులను బలపరచడానికి వారికి సహాయపడడానికి కృషి చేయాలి.

## సువార్త సేవకులపై సామాజిక అడ్డంకులు

ఈ జూబిలీ అనేది నేటి ఆధునిక ప్రపంచంలో సువార్త సేవకులు ఎదుర్కొంటున్న సవాళ్లను, సమాజంలో వారు పడుతున్న కష్టాలను, బాధలను, త్యాగాన్ని గుర్తెరిగే సమయం. ఇందులో ప్రధానంగా మత స్వేచ్ఛ, సంస్కృతిక అడ్డంకులు మరియు మతాంతర సవాళ్లు ఉన్నాయి. ఎంతోమంది సువార్త సేవకులను వెలివేసిన శ్రమలకు గురిచేసిన వారు వెనుకడుగు వేయలేదు వెయ్యరు కూడా. ఎందుకంటే సువార్త సేవకులు చేస్తున్న సేవ వారి స్వలాభం కోసమొ స్వార్థం కోసమో కాదు కానీ. క్రీస్తు సందేశాన్ని పరలోక రాజ్యాన్ని స్థాపించడం కోసం మరీ ముఖ్యంగా క్రీస్తు సందేశాన్ని బోధించే వారికి కష్టాలు బాధలు వస్తాయని క్రీస్తు ప్రభువు మనకు ముందుగానే (మత్తయి సువార్త 5:11) లో బోధింపబడింది నా నిమిత్తము ప్రజలు మిమ్ము అవమానించినప్పుడు హింసించినప్పుడు నిందారోపణ గావించినప్పుడు మీరు ధన్యులు. కాబట్టి కష్టాలను స్వీకరించినప్పుడు మనము ధన్యులం మనం కూడా సువార్త వ్యాప్తి చేయడానికి మన స్వలాభాలను, స్వార్థాలను విడిచి అప్పగింపబడిన సేవలో నిమగ్నమై ఉండడానికి శ్రమించాలి. కావున ప్రపంచవ్యాప్తంగా ఉన్న కతోలిక విశ్వాసులు సువార్త సేవకులకు అండగా ఉండి వారికి సహాయాన్ని అందించాలి.

## శ్రీసభ ప్రమేయం

మన జగద్గురువులు ఫ్రాన్సిస్ పాపుగారు ఈ సాధారణ జూబిలీ 2025 సంవత్సరంలో ఈ సువార్త సేవకులకు ప్రధాన నాయకత్వం వహిస్తున్నారు. వీరి సందేశాలు, ప్రార్థనలు మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలు సువార్త సేవకులను ప్రోత్సహిస్తున్నాయి. ఫ్రాన్సిస్ పాపు గారి నూతన ఆలోచనలో, నూతనత్వం నింపిన ఆయన ప్రేమలో సువార్త సేవకులు కొత్త నిబద్ధత కోసం పిలుపునిస్తున్నారు. సువార్త సేవలో పాల్గొనడానికి ప్రతి ఒక్కరి బాధ్యతలను

గుర్తెరిగే జీవించడానికి ఎక్కువమందినీ సువార్త సేవ నిమిత్తం పాల్గొనడానికి ప్రోత్సహిస్తున్నారు. ఇది కేవలం ఒకరు బాధ్యత కర్తవ్యం ఆధారపడి లేదు ప్రతి కథోలిక విశ్వాసిపై ఆధారపడి ఉంది. ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం ద్వారా సువార్త సేవ ఎంతో ఫలితాన్ని ఇస్తుందని పిలుపునిస్తున్నారు.

## శ్రీసభ – సువార్త సేవకులు

శ్రీసభ సువార్త సేవకుల గుర్తింపు దాని ప్రధాన లక్ష్యంతో ముడిపడి ఉంటుంది. శ్రీసభ సభ్యులమైన మనమందరము జ్ఞానస్నానం ద్వారా సాధారణ గురుత్వంలోనికి పిలవబడ్డాము. కానీ కొందరు ప్రత్యేకించి రాజరికపు గురుత్వ అంతస్తులోకి పిలవబడ్డారు. ఈ పిలుపు ఎల్లప్పుడు సువార్త సేవతో ముడిపడి ఉంది. ఈ జూబిలీ వేడుకలు శ్రీసభ చరిత్రను మరియు శ్రీసభ సువార్త సేవ గుర్తింపును మనకు బోధిస్తుంది. శ్రీసభ అనగా కేవలం ఒక సంస్థ కాదు. శ్రీసభ క్రీస్తు సజీవ శరీరం. కావుననే క్రీస్తే శ్రీసభకు మూలం. ఆయన పిలుపును స్వీకరించి దానికి అనుగుణంగా జీవిస్తూ ప్రయాణం చేస్తున్నాం. క్రీస్తు అపోస్తలులకు ఇచ్చిన సువార్త బాధ్యత కొనసాగుతూనే ఉంది. ఎందుకంటే గమాలియేలు పలికిన విధంగా వీరు చేయునది మానవ ప్రయత్నమయినచో అది అంతరించిపోవును కానీ దైవప్రయత్నమైనచో వారిని ఎదిరింప మీకు సాధ్యం కాదు (అపోస్తుల కార్యములు 5:38–39). ఎంతోమంది శ్రమలకు త్యాగాలకు ప్రతిరూపమే నేటి క్రైస్తవత్వం.

పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు తన ఆలోచనలతో సువార్త వ్యాప్తిని గూర్చి ఒక కొత్తదనాన్ని తీసుకొని వస్తున్నారు. దానికే శ్రమిస్తున్నారు ఆయన తన లేఖల సందేశాల ద్వారా ఎంతో మందిని స్ఫూర్తితో నింపుతున్నారు. ప్రత్యేకంగా ఫ్రాన్సిస్ పాపు గారు లేఖలలో ఒకటైన *The joy of the Gospel* సువార్త ఆనందంలో శ్రీసభ ఎల్లప్పుడు సువార్త ప్రచారంలో నిమగ్నమై ఉండాలని చెప్తున్నారు. శ్రీసభ ఆధ్యాత్మిక కార్యక్రమాలు అనేవి నాలుగోడల మధ్య జరిగే ప్రక్రియ కాదు. యావత్ ప్రపంచానికి చాటి చెప్పే శుభవార్త. కావుననే శ్రీసభ తానంతట తానుగా ప్రపంచ నలుమూలలకు వ్యాపించాలని కాంక్షిస్తుంది. ప్రతి ఒక్కరిని అర్థం చేసుకొని తనలో భద్రపరుచుకోవాలని ఆశపడుతుంది ఎందుకంటే శ్రీసభ స్థాపించిన దేవుని కుమారుడైన యేసుక్రీస్తు పరలోకంలోనే

ఉండిపోక ఈ లోకానికి వచ్చి సామాన్యుని వలె సామాన్య ప్రజల మధ్య జీవించాడు.

నేటి ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తమ స్వార్థం కోసం పనిచేయక దేవుని సేవకు అనుగుణంగా త్యాగ గుణాన్ని కలిగి జీవించాలి. ఈ ఆధునిక కాలంలో ప్రజల అవసరాలను తీర్చడానికి సువార్త సేవలో చురుకుగా పాల్గొనడానికి ముందు ఉండాలి మరియు ముఖ్యంగా అట్టడుగు వర్గాలు, పేదలు, అనర్హులను చేరడానికి సువార్త శక్తి ద్వారా ప్రపంచాన్ని మార్చడానికి ఈ సువార్త జూబిలీ దోహదపడాలి.

## సువార్త సేవకుల కోసం ప్రార్థన

ఓ పరలోకపు తండ్రి! సువార్త సేవలో నిమగ్నమైయున్న ప్రతి ఒక్కరి కొరకు ప్రార్థిస్తున్నాము. వారి సువార్త పనిలో భద్రతను దయచేసి, వారు శారీరకంగా మానసికంగా ఆధ్యాత్మికంగా దృఢపడేలా కరుణించండి. కష్టాలు బాధలు ఎదుర్కొన్న సమయాలలో వారు వారి విశ్వాసంలో స్థిరంగా ఉండేలా వారికి సహాయం చేసి వారు ఉన్నతమైన లక్ష్యంతో యేసుక్రీస్తు యొక్క ప్రేమను మరియు సందేశాన్ని ప్రపంచమంతా వ్యాప్తి చేయులాగున దీవించండి. వారు సేవ చేసే వారి పట్ల కనికరంతో జీవిస్తూ తాము పొందిన పిలుపులో అచంచలమైన ప్రేమను స్వీకరించలాగున ఆశీర్వదించండి. దారితప్పిన సమయాలలో వారికి ఆదరువుగా నిలవండి వారి విశ్వాసం ద్వారా నీ ప్రణాళికలను ఫలవంతం చేయడంలో చేస్తున్న కృషిని మీ ప్రేమ సందేశాన్ని పంచే శక్తిని అనుగ్రహించండి. నిరాశ యొక్క చీకటి మూలాల్లోకి నీ వెలుగును ప్రకాశింప చేసి, నిరాశ వాదులకు ఆశను, ప్రేమ లేని వారికి ప్రేమను తీసుకురావడానికి సువార్త సేవకుల మార్గాన్ని ప్రకాశింప చేయండి. సువార్త సేవను కొనసాగించడానికి కావాల్సిన అవసరాలను తీర్చండి. తద్వారా మీరు వారి ముందు ఉంచిన సువార్త పనిలో నిలవగలరు వారు ఎదుర్కొంటున్న అడ్డంకులను సవాళ్ల నుండి ఈవారిని నీ ఆత్మ శక్తితో బలపరచమని వారి శ్రమలు ఫలప్రదంగా మారులాగున దేవుని ప్రేమ ప్రతి ఒక్కరి హృదయాల్లో నిలిచేలా దీవించమని. మా నాథుడైన యేసుక్రీస్తు నామములో అడిగి వేడుకొంటున్నాము తండ్రి, ఆమెన్

# 10. పేదల జూబిలీ

- బ్రదర్ తురక మహేష్



## ఉపోద్ఘాతం

క్రీస్తు ప్రభువు ఈ లోకములో జన్మించి 2025 సంవత్సరాలు అవుతున్న ఈ తరుణంలో కతోలిక శ్రీసభ ఈ యొక్క గొప్ప పరమ రహస్యాన్ని కొనియాడుతూ, ఈ 2025వ సంవత్సరాన్ని జూబిలీ సంవత్సరముగా జరుపుకుంటూ ఉంది. ఈ జూబిలీ సంవత్సరము ప్రత్యేకముగా జీవితము మీద ఆశను కోల్పోయినటువంటి వారికి, మా జీవితం ఇక ఇంతే అని నిరాశతో నిండిన వారికి, బాధలతో బలహీనులైన వారికి, కష్టాలలో కొట్టుమిట్టాడుతున్న వారికి, నీడ లేక నిరాశ్రయులైన వారికి, ఓదార్చేవారు లేక ఒంటరైన వారికి ఒక ఆశగా, నిరీక్షణగా నిలుస్తూ ఉంది.

అందుకే ఈ జూబిలీ సంవత్సరాన్ని శ్రీసభ నిరీక్షణా జూబిలీగా నామకరణం చేయడం జరిగింది.

పరిశుద్ధ గ్రంథములో పౌలుగారు చెప్పినట్లుగా జీవితమునందు నిరీక్షణ కలిగి ఉండాలి అనేటువంటి ఉద్దేశ్యంతో జీవితంలో నిరాశకు గురై, జీవితము మీద ఆశలు వదిలివేసిన ప్రతి ఒక్కరిని ఈ జూబిలీ సంవత్సరము తన దరి చేర్చుకుంటూ ఉంది. అయితే ఈ జూబిలీ అనేది ఒక వర్గానికో, ఒక తెగకో లేక ఒక సంఘానికో చెందింది కాదు కానీ, అధికుల నుండి అధములైన వారి వరకు, బలహీనుల నుండి బలవంతులైన వారి వరకు, ప్రతి ఒక్కరికి ఈ జూబిలీ అనేది ఒక వేడుక. అందుకే కతోలిక శ్రీసభ ఈ జూబిలీ సంవత్సరములో ప్రతి ఒక్కరిని గుర్తించి వారికంటూ ప్రత్యేకముగా ఒక రోజును కేటాయించి

ఈ జూబిలీని కొనియాడమని ఆహ్వానిస్తూ ఉంది. ఈ జూబిలీ సంవత్సరములో కొనియాడదగిన విషయములలో ఒకటైన పేదల జూబిలీ అనేటువంటి వేడుకను మనము ఈ యొక్క శీర్షికలో ధ్యానిద్దాం.

సాధారణంగా పేదలు అంటే మన ఆలోచనకు వచ్చేది డబ్బులేక జీవించేవారు, ఉండడానికి ఆశ్రయము లేనివారు. కానీ నిజమైన పేదవారు ఎవరు అంటే జీవితంలో అన్నీ ఉండి కూడా ఏదో ఒక విషయంలో లోపం ఉండి బాధను అనుభవించేవారు. అంటే ఈ లోకంలో ప్రతి ఒక్కరూ దేవుని ముందు పేదవారే ఏదో ఒక స్థితిలో మనకంటూ ఒక సమస్య, ఒక బాధ, ఒక ఇబ్బంది అనేటువంటిది ఉంటుంది. అలా బాధలో ఉన్న మనకు ఒక ఊరటను, కోల్పోయినటువంటి ఆశను తిరిగి తెప్పించేదే ఈ జూబిలీ. అయితే ఈ జూబిలీ సంవత్సరము ఎందుకు ఇంత ప్రత్యేకతను ఒక్కొక్క వర్గానికి ఈ విధంగా ఇస్తుంది అని మనము ఆలోచించినట్లయితే శ్రీసభలో ప్రతి ఒక్కరూ ముఖ్యమైనటువంటి వారే, కాబట్టి ఆ దేవుడు ఇచ్చేటువంటి ఆశీర్వాదాలు ప్రతి ఒక్కరికి చేర్చడమే శ్రీసభ బాధ్యత అందుకే ఈ జూబిలీ సంవత్సరములో పరిశుద్ధ పాపుగారు ప్రతి ఒక్కరిని గురించి ధ్యానిస్తూ వారి కొరకు ప్రార్థించండి, వారి జీవితాలలో ఒక ఆశను, నిరీక్షణను తిరిగి కల్పించండి అని ప్రతి ఒక్క వర్గానికి ఒక రోజును నిర్ణయించి, వారి గురించి ధ్యానించమని మనకు తెలియజేస్తూ ఉన్నారు. కాబట్టి ఒక క్రైస్తవునిగా మన బాధ్యత ఇతరుల గురించి ప్రార్థించడం. ఈ జూబిలీ సంవత్సరంతో పాటు పరిశుద్ధ గ్రంథము పేదల గురించి ఏమి మాట్లాడుతుంది అని మనము ధ్యానిద్దాం.

## పాత నిబంధనలో పేదల ప్రస్తావన

పాత నిబంధనలో ఇశ్రాయేలు ప్రజలను చూసినట్లయితే ధనికులైనటువంటి వారు పేదలపై పెత్తనం చెలాయించకూడదు, వారిని ఒక వస్తువుగా ఉపయోగించుకోకూడదు, వారిని తక్కువ చేసి చూడకూడదు అనేటువంటి ఉద్దేశంతో దేవుడు ఈ జూబిలీ సంవత్సరము అనే ఒక ప్రస్తావనను తీసుకురావడాన్ని మనము చూస్తాము (లేవియాకాండము 25:23-28). ఈ లేవియాకాండాన్ని చూసినట్లయితే పేదల గురించి, వారి యొక్క స్థితిగతుల

గురించి మనము చూస్తూ ఉంటాము. యావే ప్రభువు పేదలు అదే స్థితిలో ఉండకూడదు వారు కూడా ఒక ఉన్నత స్థాయికి చేరుకోవాలి, ఎదగాలి అనేటువంటి ఉద్దేశ్యంతో ఈ జూబిలీ ప్రస్తావనను తీసుకురావడాన్ని మనము గుర్తిస్తాం. అయితే ఈ జూబిలీ సంవత్సరము కూడా ఇదే విషయాన్ని ధ్యానిస్తూ మన చుట్టుపక్కల ఉన్నటువంటి పేదలను గుర్తించి, వారికి సహాయపడుతూ వారిని జీవితంలో ఎదిగేలా చేయమని తెలియజేస్తూ, బాధల వలన కోల్పోయిన వారి జీవితాలను తిరిగి పునరుద్ధరించుకోవడానికి సహాయపడమని మనలను పిలుస్తూ ఉంది.

ఉపోద్ఘాతంలో చెప్పబడినట్లుగా పేదలు అంటే మామూలుగా మనకు తెలిసిన డబ్బు లేని వారే కాదు అనారోగ్యంతో బాధపడే వారవచ్చు, కుటుంబంలో బంధాల మధ్య సరైనా జీవితం లేని వారవచ్చు మరియు మనశ్శాంతి లేని వారవచ్చు ఇలా చెప్పుకుంటూ పోతే ఏదో ఒక స్థితిలో ఒక లోటు అనేది ఉంటూ ఉంటుంది. ఆ లోటుని పేదరికంగా మనం గుర్తించాలి, ఆ లోటు వల్ల వారి జీవితంలో వారు కోల్పోయినటువంటి ఆ ఆశను తిరిగి తెప్పించడానికి ఈ జూబిలీ సంవత్సరము వారికి సహాయపడాలి అని శ్రీసభ ఉద్దేశం. ఆ ఉద్దేశాన్ని నెరవేర్చడానికి వారి జీవితాలను తిరిగి పునరుద్ధరించడానికి ఈ జూబిలీ సంవత్సరములో ప్రత్యేకంగా వారికోసం ప్రార్థించమని, వారికి సహాయపడమని ఈ పేదల జూబిలీని శ్రీసభ మనకు అందిస్తుంది, దీనిని నవంబర్ 16, 2025న జరుపుకోమని శ్రీసభ మనలను ఆహ్వానిస్తుంది.

ఈ జూబిలీ ద్వారా సమాజంలో చిన్న చూపు మరియు తక్కువగా చూడబడుతున్న ప్రతి ఒక్కరిని గుర్తుంచుకొని ప్రతి ఒక్కరిని మానవతా దృక్పథంతో వారి వైపు చూడమని మనకు తెలియజేస్తుంది. సమాజంలో వారికంటూ ఒక గౌరవం, వారి పనికి తగిన ప్రతిఫలాన్ని వారు పొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని, అన్యాయంగా మోసగింపబడుతున్న ప్రతి ఒక్క వ్యక్తికి సహాయముగా ఉండి ఈ మోసాలు, అన్యాయాల వల్ల వారు కోల్పోయిన విశ్వాసాన్ని, నమ్మకాన్ని తిరిగి పునరుద్ధరించడానికి సహాయపడేలా నడుచుకోమని మనందరికీ కూడా ఈ జూబిలీ సంవత్సరంలో ఈ పేదల జూబిలీ అనేది

మనకు స్పష్టంగా తెలియజేస్తుంది.

## క్రీస్తు ప్రభువు పేదల నిరీక్షణా ఫలితం

ఆదిలో యూవే దేవుని నుండి నేటి క్రీసభ వరకు పేదలకు ప్రత్యేకమైనటువంటి స్థానము ఉంది. నూతన నిబంధనను మనము చూసినట్లయితే ఆనాటి సమాజంలో వీరు చిన్న చూపు చూడబడేటువంటి వారు. తక్కువగా ఎంచబడేటువంటి వారు, అన్యాయంగా వేధింపబడుతున్నవారు అలా చిన్నచూపు చూడబడుతూ రక్షకుని కోసము, మెస్సయ్య కోసము ఎదురుచూసేటువంటి క్షణాలు అవి. జీవితము మీద ఆశ కోల్పోయినటువంటి వారందరూ రక్షకుడు వస్తాడు వారిని విమోచిస్తాడు, అనేటువంటి ఆశతో క్రీస్తు రాకడ కొరకు ఎదురు చూస్తూ ఉన్నారు. ఆ ఎదురుచూపుకు నిరీక్షణగా క్రీస్తు ఈ లోకంలో జన్మించాడు, జన్మించడమే కాదు ఆ జన్మించడంతోపాటు రక్షణ కేవలం ధనికులకు, యూదులకు మాత్రమే కాదు అన్ని వర్గాల వారికి, అన్ని అంతస్తుల వారికి చెందుతుంది అని తెలియజేశాడు.

మొట్టమొదటిగా క్రీస్తు జన్మించినప్పుడు ఆ పశువుల పాక దగ్గరకు వచ్చిన వ్యక్తులు గొర్రెల కాపరులు వీరు సమాజంలో చిన్నచూపు చూడబడేటువంటి వారు మరియు తక్కువగా పరిగణింపబడేటువంటి వారు, అటువంటి వారికి దూత ప్రత్యక్షమై మీకు ఒక రక్షకుడు జన్మించాడు మీరు అక్కడికి వెళ్ళండి అని వారిని ఆహ్వానించింది. అంటే మనం అర్థం చేసుకోవాల్సింది ఈ లోకంలో తిరస్కరింపబడిన వారు, వదిలివేయబడిన వారు, సమాజంలో చిన్నచూపు చూడబడేటువంటి వారు, జీవితము మీద ఆశను కోల్పోకుండా దేవునియందు నమ్మకం ఉంచాలి అని. అదే విధంగా ఆ తరువాత ముగ్గురు రాజులు లేదా జ్ఞానులు రావడాన్ని చూస్తూ ఉన్నాం వీరు అన్యులు. ఆ కాలంలో యూదులు మేము మాత్రమే దేవుని ప్రజలము అని అనుకునే సమయం కానీ అన్యులకు కూడా దేవుడు ఒక్కడే. నిరీక్షణ ఒక్కటే అని తెలియజేయడానికి క్రీస్తు ఈ లోకంలో జన్మించాడు. అయితే మనము ఈ క్రీస్తు పేదల నిరీక్షణ ఫలితం అని ఏ విధంగా అర్థం చేసుకోవాలి అంటే, సమాజంలో తక్కువ చేయబడినటువంటి వారు, గౌరవింపబడినటువంటి వారు, ఏమాత్రం పరిగణింపబడనటువంటి

వారు, ఈ అవమానాల వల్ల తమ జీవితం మీద ఆశను కోల్పోయి ఉంటారు, ఇక ఈ జీవితము ఎందుకు అని చింతిస్తూ ఉంటారు.

అలాంటి వారికి ఒక సుమాతృకను ఇవ్వడానికే ఆనాడు క్రీస్తు పశువుల పాకలో ఒక పేదవాడిలా జీవించాడు. పేదలకు ధనికులకు, రాజులకు రైతులకు అందరికీ ప్రభువు ఒక్కడే. రక్షణ ఒక్కటే అని తెలియజేస్తూ దైవత్వాన్ని ప్రతి ఒక్కరికి పంచి ఇచ్చాడు. ఒకవేళ క్రీస్తు ఒక రాజుగా రాజకుటుంబంలో జన్మించి ఉంటే బహుశా ఈ పేదవాడికి, ఆ గొర్రెల కాపరికి ఆ రాజ కుటుంబంలోనికి వెళ్లడానికి అధికారం ఉండేది కాదేమో, క్రీస్తుని చూడడానికి అవకాశం దొరికేది కాదేమో. అలాంటి అసమానతను, తారతమ్యాన్ని తొలగించడానికే క్రీస్తు నీలాగా, నాలాగా ఒక పేదవాడిలా ఆ పశువుల పాకలో జన్మించాడు. ఇదే విషయమై దేవుడు మనకు ఇంకొక గొప్ప సత్యాన్ని తెలియజేస్తూ ఉన్నాడు. పేదవాడైనా, ధనికుడైనా మరియు రాజైనా చివరకు ఒకే విధంగా ఆ ప్రభువు దరికి చేరాలి అని ఈ పశువుల పాకలో వచ్చిన ముగ్గురు రాజులు లేదా జ్ఞానులు మరియు గొర్రెల కాపరుల రూపంలో దేవుడు మనకు ఈ సత్యాన్ని తెలియజేస్తూ ఉన్నాడు. కాబట్టి క్రీస్తు జన్మము ఆనాటి పేదలకు ఏ విధంగా ఒక గొప్ప ఆశకు ఫలితముగా ఉందో, ఈనాడు కూడా ఈ జూబిలీ సంవత్సరము ఆ క్రీస్తు జన్మదిన జూబిలీ మహోత్సవానికి సిద్ధపడుతున్నటువంటి ఈ తరుణములో, ఈ కాలంలో ఉన్నటువంటి పేదలకు, అభాగ్యులకు ఒక ఆశాదీపంగా ఉండాలి అని మనము అర్థం చేసుకోవాలి.

## అష్ట భాగ్యాలలో పేదల ప్రస్తావన

అదేవిధంగా మత్తయి 5:3-12వ వచనాలలో మనం చూసినట్లయితే అష్టభాగ్యాలను ప్రభువు చెప్తూ ఉన్నారు. ఈ అష్ట భాగ్యాలను మనము పరిశీలించినట్లయితే ప్రతి ఒక్కటి కూడా ఏదో ఒక విధంగా తమ జీవితంలో ఏదో పోగొట్టుకొని, ఏదో లేకపోవడం లేదా ఏదో తక్కువ అయిన విషయాలను చూపిస్తున్నాయి. అలా ఆశను కోల్పోయిన వారికి ప్రభువు తన రాజ్యములో తగిన ప్రతిఫలాన్ని ఇస్తాను అనే ఒక భరోసానివ్వడాన్ని మనము చూస్తాము. ఆ భరోసా రానున్న కాలంలో జీవితము మీద ఆశను కోల్పోయిన ప్రతి ఒక్కరికి

తిరిగి ఒక క్రొత్త నిరీక్షణను దయచేసి, దేవుని రాజ్యము వచ్చినప్పుడు నీతి న్యాయములతో, సమానత్వముతో పరిపాలించే రాజు వస్తాడు అనేటువంటి నమ్మకముతో వీరు ఈ జీవితాన్ని జీవించాలి. అలాంటి ఆశను పునరుద్ధరించాలని ఈ వాక్యము యొక్క ఉద్దేశం. దేవుని రాజ్యములో పేదలని. అన్యులని, ధనికులని, యూదులని తారతమ్యములు ఉండవు. దేవుడు అందరికీ ఒకటే అని తెలియజేస్తూ, ఈ లోకంలో తక్కువ చేయబడిన వారు పేదవారిగా పరిగణింపబడినవారు, సమాజంలో గుర్తింపుబడని వారు ఏమాత్రం బాధపడక, ఆశను కోల్పోక రాబోయేటువంటి బహుమానానికై, దేవుని రాజ్యమునకై నిరీక్షణ కలిగి ఉండాలి అని మనకు ఈ జూబిలీ సంవత్సరము తెలియజేస్తుంది. అందుకే ఈ సమాజంలో పేదలుగా పరిగణించబడేటువంటి వారు, ఏదో ఒక రీతిలో కొదువ కలిగి జీవించేటువంటి ప్రతి ఒక్కరూ ఈ నమ్మకమును, నిరీక్షణ కలిగి జీవించాలి. అదే అష్ట భాగ్యాలలో క్రీస్తు ప్రభువు ఆనాటి ప్రజలకు జీవితంలో ఏదో ఒక లోటుపాటుతో జీవిస్తున్నటువంటి మీకు దేవుని రాజ్యం వచ్చినప్పుడు, కాలము పరిపూర్ణమైనప్పుడు తగిన ప్రతిఫలము, బహుమానము వస్తుంది అని తెలియజేస్తున్నారు. అదే ఆశ, అదే నమ్మకము ఈనాటి ప్రపంచంలో, ఈ తరం సమాజంలో మనము ఆ పేదలకు, బలహీనులకు, అన్యాయముగా మోసాగించబడే వారికి ఇవ్వవలసినటువంటి భరోసా అని ఈ అష్ట భాగ్యాలు మనకు తెలియజేస్తున్నాయి.

## శ్రీసభ అధికార పత్రాలలో పేదల ప్రస్తావన

కతోలిక శ్రీసభ దీర్ఘకాలంగా పేదలు మరియు పరితపించే వారికి గౌరవం మరియు సహాయం అందించడానికి ప్రాముఖ్యతనిస్తూ వచ్చింది. అంతేకాక పేదలను కాపాడటానికి మరియు వారికి సహాయం అందించడాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ ఎన్నో ముఖ్యమైన శ్రీసభ అధికార పత్రాలు రచించింది.

### 1. 13వ సింహారాయలు పాపుగారు–*Rerum Novarum* (నూతన ఆలోచనలు / విషయాలు)(1891)

ఈ లేఖ పని వర్గాల పరిస్థితిని మరియు శ్రమ, గౌరవం గురించి చర్చిస్తుంది. ఇది కార్మికుల హక్కులు, సమంజస వేతనాలు మరియు కార్మికులను న్యాయంగా

చూడడం వంటి విషయాలకు ప్రాధాన్యం ఇస్తుంది. ఇది శ్రీసభకు సామాజిక న్యాయం మీద గల దృక్పథాన్ని, పేదలను కాపాడటానికి అవసరమైన నైతిక బాధ్యతను గురించి తెలియజేస్తుంది.

**2. 23వ జాన్ పాపుగారు–*Mater et Magistra* (తల్లి మరియు ఉపాధ్యాయిని) (1961)**

ఈ లేఖ పేదలు ఎదుర్కొంటున్న సామాజిక మరియు ఆర్థిక సమస్యలను పరిష్కరించాల్సిన అవసరంపై స్పష్టంగా చెప్పబడింది. ఇది సామాజిక బాధ్యతను మరియు సామరస్యాన్ని ప్రోత్సహిస్తుంది. ధనవంతులు పేదలను నిర్లక్ష్యం చేయకుండా వారికి సహాయం అందించి అవకాశాలు కల్పించడాన్ని కోరుతూ పేదవారిపట్ల ప్రేమ, సానుభూతి కలిగి నిస్వార్థ బుద్ధితో వారి పట్ల మెలగమని తెలియజేస్తుంది.

**3. 6వ పౌలు పాపుగారు–*Populorum Progression* (ప్రజల అభివృద్ధి) (1967)**

ఈ లేఖ పేద ప్రజల అభివృద్ధిపై కేంద్రీకరించబడింది. ఇది ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధి ప్రాధాన్యతను గుర్తించడంతో పాటు, పేదలకు సహాయం అందించడానికి అంతర్జాతీయ సామరస్యాన్ని ప్రోత్సహిస్తుంది. మానవ గౌరవం మరియు సహోదరభావంపై దృష్టి పెట్టి వనరులను న్యాయంగా పంచుకోవడం అవసరం అని పేర్కొంటుంది.

**4. 2వ జాన్ పాల్ పాపుగారు–*Sollicitudo Rei Socialis* (సామాజిక బాధ్యత) (1987)**

ఈలేఖలో 2వ జాన్ పాల్ పాపుగారు పేదలతో ప్రపంచవ్యాప్తంగా సామరస్యానికి ప్రాధాన్యం ఇచ్చారు. పేదరికం కేవలం భౌతిక వనరుల లోపం మాత్రమే కాదు, మానవ గౌరవం లేకపోవడం కూడా అని ఆయన చెప్తారు. వనరుల న్యాయవంతమైన పంపిణీకి మరియు సమాజంలో ప్రతిభావంతులైన వారికి చెందిని ప్రతి దాన్ని వారికి అందించాలి అని, ముఖ్యంగా పేదల యొక్క చర్యలకు ప్రోత్సాహం ఇచ్చే అవసరాన్ని ప్రతిపాదించారు.

### 5. ఫ్రాన్సిస్ పాపుగారు–*Evangelii Gaudium* (సువార్తలో ఉన్న ఆనందం) (2013)

ఈ లేఖలో ఫ్రాన్సిస్ పాపుగారు సువార్తలో ఉన్న సంతోషాన్ని గురించి మాట్లాడుతూ, శ్రీసభలో పేదలందరికీ గొప్ప కంఠం కావాలని అర్థించారు. ఆయన ఆర్థిక వ్యవస్థలపై విమర్శలు చేస్తూ, సమానతను ప్రోత్సహించని వారి వల్ల పేదలు ఎలా దెబ్బతింటున్నారని చెప్పారు. పేదలు మరియు పరితపించే వారితో శ్రీసభ దగ్గరగా ఉండాలని ఆయన కోరారు.

### 6. ఫ్రాన్సిస్ పాపుగారు–*Laudato Si* (2015)

ఈ లేఖ ముఖ్యంగా పర్యావరణ సంరక్షణపై అయినప్పటికీ, పేదల గురించి కూడా మాట్లాడింది. ఫ్రాన్సిస్ పాపుగారు పర్యావరణ పరిరక్షణను పేదలతో అనుసంధానించారు, పర్యావరణ ధ్వంసం వల్ల పేదలు ఎక్కువగా బాధపడతారని చెప్పారు. పేదల కోసం మరియు భూమి కోసం సమగ్ర దృక్పథంతో సామాజిక న్యాయం పట్ల ఆసక్తి పెంచడాన్ని ఆయన ఆదేశించారు.

ఈ లేఖల ద్వారా శ్రీసభ ఎల్లప్పుడూ పేదల పట్ల గౌరవం మరియు వారి రక్షణకు తన బాధ్యతను గుర్తు చేసుకుంటూనే ఉంది. అవి పేదరికాన్ని తగ్గించడానికి, సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడానికి మరియు ప్రతి ఒక్కరు గౌరవంతో జీవించగలిగే ఒక ప్రపంచాన్ని నిర్మించడానికి వ్యక్తిగత మరియు సాంఘిక చర్యలుగా ఉపయోగపడతాయి అని శ్రీసభ గుర్తించి, ఎల్లప్పుడూ వాటిని కార్యాచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తుంది.

కతోలిక శ్రీసభ ప్రకారం, ప్రస్తుత తరం పేదల పట్ల ఒక పెద్ద బాధ్యత కలిగి ఉంది. ఇది సామాజిక న్యాయం, సమానత్వం, మరియు పేదల కోసం ప్రత్యేకమైన ప్రాధాన్యత వంటి సిద్ధాంతాలపై ఆధారపడి ఉంటుంది. కారాగారాలలో ఉన్న ప్రతి ఒక్కరి పట్ల బాధ్యతాయుతంగా జీవించమని క్రైస్తవులను ఆహ్వానిస్తుంది. పేదలపట్ల మరియు అవసరములో ఉన్న వారి పట్ల సహాయ గుణం కలిగి ఉండమని పరిశుద్ధ గ్రంథం కూడా తెలియజేస్తుంది.

## శ్రీసభ ఈ బాధ్యతకు సంబంధించి చెప్పే ముఖ్యమైన అంశాలు

I. **సమానత్వం మరియు సంఘ జీవితం:** కతోలిక శ్రీసభ మనుషులందరిని ఒకరితో ఒకరు సంబంధం కలిగిన వారు అని బోధిస్తుంది. సంపత్తి మరియు వనరులు పంచుకోవడం ద్వారా ఎవరూ బహిష్కృతులయ్యే విధంగా ఉండకూడదు అని తెలియజేస్తుంది. శ్రీసభ పేదలకు సహకారం అందించేందుకు సమానత్వాన్ని మరియు సంఘ జీవితానికి మద్దతు ఇచ్చేలా అని ప్రజలను ఆహ్వానిస్తుంది.

II. **పేదల పట్ల ప్రత్యేకమైన ప్రాధాన్యత:** ఈ సిద్ధాంతం, కతోలిక సామాజిక బోధనలలో మూలముగా ఉంటుంది, అవసరాలలో ఉన్న వారికి ఆదరణగా, నిరాశ్రయులకు నీడగాను ఉండమని సమాజంలో పేదవారిపట్ల సానుభూతిని కలిగి, న్యాయానికి వ్యతిరేకంగా సమాజంలో సాధికారిక మార్పు కోసం పోరాడాలని సూచిస్తుంది.

III. **వనరుల నిర్వహణ:** కతోలిక శ్రీసభ సృష్టికర్త అయినటువంటి దేవుడు మనకి ఇచ్చినటువంటి వనరులను సక్రమంగా, సమన్వయంగా ఉపయోగించుకోవాలి అని తెలియజేస్తుంది. దీని ద్వారా వారు సామాన్య హక్కుల పట్ల కృషి చేసి, పేదలను ఆదుకోవడం, వారికి మద్దతు ఇవ్వడం, మరియు పునరుద్ధరణ మార్గాలు రూపొందించడంలో భాగస్వామ్యం కావాలని సూచిస్తుంది.

IV. **సేవకరమైన బాధ్యత:** కతోలిక శ్రీసభ పేదలను సేవించడం కేవలం దయా చర్య కాదు, ఒక నైతిక బాధ్యత అని చెబుతుంది. క్రైస్తవులు క్రీస్తు ప్రేమను చూపించి, పేదలకు భోజనం అందించడం, ఆశ్రయాన్ని అందించడం, ఆర్థిక లేదా పదార్థ సాయం అందించడం వంటి వ్యక్తిగత చర్యలు తీసుకోవడానికి పిలుపునిస్తుంది.

V. **సామాజిక న్యాయం మరియు పిలుపు:** శ్రీసభ సామాజిక న్యాయాన్ని పొందాలన్న ఆలోచనను ప్రోత్సహిస్తుంది. ఇది పేదరికాన్ని, అసమానతను నివారించేందుకు చట్టాలు, విధానాలు, మరియు సంఘం కార్యక్రమాలను బలపరచేందుకు ప్రజలను ప్రేరేపిస్తుంది. కతోలికులు అన్యాయాన్ని

తొలగించి, సమానతను పెంచేందుకు వ్యూహాత్మక మార్పులు కోరుతూ చర్యలు తీసుకోవాలని సూచిస్తుంది.

ఈ బాధ్యతలు ఐచ్ఛికంగా ఉండవు, అవి క్రైస్తవ జీవితం యొక్క భాగమని, మరియు శ్రీసభ పేదలకు సహాయం చేయడానికి, స్థానికంగా లేదా ప్రపంచవ్యాప్తంగా చర్యలు తీసుకోవాలని తెలియజేస్తుంది.

కాబట్టి మనమందరం మీ జూబిలీ సంవత్సరంలో శ్రీసభ మన నుండి కోరుకునే ఈ సమానత్వము, సంఘ జీవితము మరియు సోదర భావమును ప్రతి ఒక్కరి పట్ల చూపించడానికి ప్రయత్నించాలి.

## ఈ జూబిలీ సంవత్సరములో పేదల పట్ల మన బాధ్యత

సాధారణంగా మనము పేదలను చూసినప్పుడు, ఏదైనా ఇబ్బందుల్లో ఉన్న వారిని చూసినప్పుడు మనకెందుకులే అని పట్టించుకోకుండా వెళ్ళిపోతూ ఉంటాము. కానీ ఒక క్రైస్తవునిగా లేదా సాటి మానవుడిగా ఇతరుల కష్టాలను, బాధలను. అవసరాలను తెలుసుకొని వారికి సహాయపడటం మన కర్తవ్యం మరియు ధర్మం. ఈ సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమస్యతో బాధపడేవారే, డబ్బు లేనటువంటి వారు ఆర్థిక స్తోమత సరిపోక బాధపడుతూ ఉన్నారు, అనారోగ్యంతో ఉన్నవారు సకాలంలో చికిత్స దొరకక బాధపడుతున్నారు, అన్యాయంగా మోసగింపబడేటువంటి వారు న్యాయం జరగట్లేదు అని బాధపడుతున్నారు. ఇలా చూసుకుంటూ పోతే ఒక్కొక్క కోణంలో ఒక్కొక్క విషయాన్ని మనము చూడగలము. అయితే వీటన్నింటిలో మనము చేయగలిగినటువంటి సహాయాన్ని మనము చేయాలి అని శ్రీసభ మనకు తెలియజేస్తూ ఉంది. ప్రత్యేకముగా ఈ పేదల జూబిలీ అనేది అన్యాయం వల్ల, బాధల వల్ల, మోసాల వల్ల జీవితంలో కృంగి, కృషించిపోయిన వారికి న్యాయం చేయడం వల్ల లేదా న్యాయం జరుగుతుంది, కష్టాలు తీరిపోతాయి, బాధలు తొలగిపోతాయి అని మనమిచ్చే ఆ భరోసా, నిరీక్షణ, నమ్మకము వారి జీవితాన్ని నిలబెట్టేటటువంటి విధంగా ఉండాలి అని ఈ శ్రీసభ మనకు ఈ జూబిలీ సందర్భంగా తెలియజేస్తూ ఉంది. కాబట్టి విశ్వాసిగా, మానవునిగా ఇతరుల

పట్ల మానవతా దృక్పథం కలిగి, సహాయ గుణం కలిగి జీవించాలి అని తెలుసుకుందాం, ఇతరులకు సహాయ పడదాం.

## ప్రార్థన

రాజాధిరాజువైన దేవా! ఈ జూబిలీ సంత్సరములో ప్రత్యేకముగా మేము కొనియాడుతున్న పేదల జూబిలీ అంశమును గూర్చి ప్రార్థిస్తున్నాము. మా ఈరోజు వారి జీవితంలో మాకు ఎదురుపడే ప్రతి ఒక్క పేదవానిని మేము ప్రేమా భావముతో, సమాన దృష్టితో చూసే కృపను మాకనుగ్రహించండి. పేదరికం అంటే భౌతికంగా మాత్రమే కాక ఆధ్యాత్మిక పేదరికంలో కూడా మ్రగ్గిపోతున్న ప్రతి ఒక్క బిడ్డను మీరు దీవించండి. మేము వారి పేదరికమును గుర్తించి మేము చేయగలిగేటువంటి సహాయము వారికి చేసేలా మమ్ము దీవించండి. ముఖ్యముగా వారి జీవితాలలో, కుటుంబాలలో ఉన్న ఈ పేదరికం వారిలో ఉన్న ఆశను ఏమాత్రం తొలగించక, నాశనము చేయక వారు మీ విశ్వాసములో స్థిరముగా ఉండేలా వారిని దృఢపరచండి.

ఓ దయగల సర్వేశ్వరా, అనేకవసరాలతో, ఆటుపోట్లతో, ఇరుకు ఇబ్బందులతో విశ్వాసమందు నీరసించిన ప్రతి ఒక్క బిడ్డను దీవించండి. వారు తిరిగి ఈ జూబిలీ సంవత్సరములో మీరు ఉన్నారు, అనే నమ్మకమును పొందు తిరిగి వారి జీవితంలో ఒక క్రొత్త ఆశను నింపుకొని జీవించునట్లు వారిని దీవించండి, ఆమెన్.

❋ ❋ ❋ ❋

# 11. ఖైదీల జూబిలీ

**- బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్**

## పరిచయం



పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు 2025వ సంవత్సరాన్ని నిరీక్షణ జూబిలీగా ప్రకటించారు. ఈ జూబిలీ సంవత్సరంలో దయ, క్షమాపణ మరియు నిరీక్షణ అనే అంశాల మీద లోతైన అర్థాన్ని తెలుసుకొనుట కోసం శ్రీసభ పిలుపునిస్తుంది, ఏడాది పొడవునా విశ్వాస యాత్రలో పాల్గొనమని విశ్వాసులను ఆహ్వానిస్తుంది. ఈ జూబిలీ సంవత్సరంలో వివిధ వృత్తులలో పనిచేస్తున్న వారికోసం మరి ముఖ్యంగా ఖైదీలను మరియు కారాగారాలలో పనిచేస్తున్న సిబ్బంది కోసం డిసెంబర్ 14వ తేదీని తీరుసభ కేటాయించింది. ఇది దేవునితో తమ సంబంధాన్ని పెంపొందించుకోవడానికి మరియు దైవిక క్షమాపణ కోరడానికి పిలుపునిస్తోంది. న్యాయం మరియు సంఘీభావ చర్యలలో చురుకుగా పాల్గొనడానికి విశ్వాసులందరినీ ఆహ్వానిస్తుంది.

తిరుసభ జూబిలీలను జరుపుకోవడంలో ఒక సుదీర్ఘ చరిత్ర ఉంది, పరిశుద్ధ గ్రంథం ప్రకారం జూబిలీ సంవత్సరం విముక్తి, రుణమాఫీ మరియు న్యాయం పునరుద్ధరణ సమయం. లేవీయకాండము 25:10లో ఈ రీతిగా ఏబదియవ యేటిని పవిత్ర వత్సరముగా గణింపుడు. ఆ యేడు మీ దేశమున వసించు జనులందరికిస్వేచ్ఛ లభించునని చాటింపుడు. ఇది హితవత్సరము. ఈ యేడు ప్రతివాడు తన భూమిని తాను స్వాధీనము చేసికొనును. ప్రతిబానిస స్వేచ్ఛతో తన ఇంటికి వెడలిపోవును అని బోధిస్తుంది. 2015లో జరిగిన కారుణ్య సంవత్సరం స్థాపించిన పునాది పైననే 2025 నిరీక్షణ జూబిలీ

సంవత్సరం నిర్మించబడింది, ఈ సంవత్సరం ప్రత్యేకంగా అణగారిన, మరచిపోయిన వారిని మరియు కారాగారంలో ఉన్న వారిని స్వీకరించడానికి ఫ్రాన్సిస్ పాపుగారు శ్రీసభను బలోపేతం చేస్తున్నారు.

ఈ జూబిలీ సంవత్సరం ద్వారా, ఫ్రాన్సిస్ పాపు గారు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తున్నారు. ఎవరూ విముక్తికి అతీతులు కారని మరియు దేవుని దయ సార్వత్రికమైనది. ఖైదీలను బహిష్కరించబడినవారిగా కాకుండా పరివర్తన సామర్థ్యం ఉన్న మానవులుగా చూడాలనే పిలుపు అంతటా ప్రతిధ్వనిస్తుంది, ఈ జూబిలీ సంవత్సరం వారి పునరావాసం మరియు సమాజంలో చేరాలన్నదే వారి కోరిక.

## రెబిబ్బియా జైలులో పవిత్ర ద్వారం తెరవడం

డిసెంబర్ 26, 2024 రోజున ఫ్రాన్సిస్ పాపుగారు రెబిబ్బియా జైల్లో పవిత్ర ద్వారాన్ని తెరవడం ద్వారా నిరీక్షణ సంవత్సరాన్ని ప్రారంభించారు. చారిత్రాత్మకంగా, జూబిలీ సంవత్సరానికి పవిత్ర చిహ్నంగా ఉన్న పునీత పేతురు గారి బృహద్దేవాలయ పవిత్ర ద్వారాన్ని తెరుస్తారు. కానీ, ఈసారి, దీనిని ఇటలీలోని రెబిబ్బియా జైలులో తెరిచారు. దీని ద్వారా శ్రీసభకు మరియు ఖైదీలకు మధ్య అడ్డంకులను విచ్ఛిన్నం చేసింది. దేవుని దయ అందరికీ అందుబాటులో ఉందని, కారాగారాలు ఆధ్యాత్మిక పునరుద్ధరణ మరియు నిరీక్షణకు ప్రదేశాలుగా ఉండాలని మనకు తెలియజేస్తున్నారు. ఖైదీలకు ఆయన సందేశం ఇస్తూ ఇలా అన్నారు జైలు గోడల లోపల కూడా దేవుని దయ కోరుకునే ప్రతి హృదయానికి విస్తరించిందని వారికి గుర్తు చేశారు.

## పాపుగారి అధికార ప్రకటన పత్రం *Spes Non Confundit* "స్పెస్ నాన్ కన్ఫండిట్"

స్పెస్ నాన్ కన్ఫండిట్‌లోని 10వ అంశం ఖైదీల విముక్తి మరియు పునరుద్ధీకరణకు పిలుపునిస్తుంది. 2025 నిరీక్షణ జూబిలీ కోసం ఫ్రాన్సిస్ పాపుగారు జారీ చేసిన అధికార ప్రకటన పత్రం స్పెస్ నాన్ కన్ఫండిట్ (నిరీక్షణ నిరాశపరచదు) అను, పత్రం ద్వారా కారాగారంలో ఉన్న వారికి గౌరవం, పునరావాసం మరియు సమాజంలో తిరిగి విలీనం కోసం వాదించే లోతైన

ఆధ్యాత్మిక మరియు సామాజిక విషయాలను ఆయన పొందుపరిచారు. ఈ పత్రం ద్వారా న్యాయ చట్టాలను పునరుద్ధరణ చేయాలని మరియు దయ, విముక్తి మరియు రెండవ అవకాశాన్ని ఇవ్వాలని కోరుతుంది.

## న్యాయ వ్యవస్థలు కారుణ్యాన్ని మరియు పునరావాసం కోరుకోవాలి

మత్తయి సువార్త 5: 38-39లో యేసుప్రభువు ఇలా బోధిస్తున్నారు "కంటికి కన్ను, పంటికి పన్ను" అని పూర్వము చెప్పబడిన దానిని మీరు వినియున్నారు గదా! నేనిపుడు మీతో చెప్పునదేమన: నీకు అపకారము చేసిన వానికి ప్రతీకారము చేయకుము. నీ కుడి చెంపపై కొట్టిన వానిని నీ వేరొక చెంపపై గూడ కొట్టనిమ్ము. యేసు ప్రతీకారాన్ని తిరస్కరించి, క్షమాపణ, ప్రేమ మరియు కారుణ్యంపై దృష్టిని మరల్చాడు. అతని బోధనలు నిరీక్షణ యాత్రికులమైన మనం ప్రతీకారం విచ్ఛిన్నం చేయమని మరియు ప్రతీకారం కంటే దయను స్వీకరించమని ప్రోత్సహిస్తాయి. ఆ ప్రకారమే శిక్ష బదులుగా మన్నింపునకు ప్రాధాన్యతనిచ్చే న్యాయ వ్యవస్థకు ఫ్రాన్సిస్ పాపుగారు పిలుపునిచ్చారు. కారాగారాలు కేవలం నిర్బంధ ప్రదేశాలుగా ఉండకూడదని, వ్యక్తిగత పరివర్తన మరియు సమాజంలోకి తిరిగి ప్రవేశించడానికి దోహదపడే సంస్థలుగా ఉండాలని ఆయన తెలియజేస్తున్నారు. జగద్గురువు అధికార ప్రకటన పత్రం ద్వారా మూడు కీలకమైన విషయాలను మనకు తెలియజేస్తున్నారు.

### 1. శిక్షకు ప్రత్యామ్నాయ క్షమాభిక్ష

ప్రభుత్వాలు కస్టడీ లేని శిక్షలను, ముఖ్యంగా హింసాత్మక నేరస్థులకు, మరియు నిర్మాణాత్మక పునరుద్ధీకరణ కార్యక్రమాల కింద ఖైదీలు తమ స్వేచ్ఛను తిరిగి పొందేందుకు అనుమతించే క్షమాభిక్ష చట్టాలను అమలు చేయాలని ప్రోత్సహించారు.

### 2. విద్య మరియు నైపుణ్య అందించడం

ఖైదీలు తమ జీవితాలను పునర్నిర్మించుకోవడానికి విద్య, వివిధ వృత్తులలో శిక్షణను ఇవ్వడం ద్వారా వారి మానసిక మద్దతుకు ముఖ్యమైన సాధనాలు అని తెలియజేస్తున్నారు. ఈ వనరులను పొందడం స్వీయ-విలువ మరియు గౌరవాన్ని పెంపొందిస్తుంది, ఖైదీలు నిరాశతో నేరాలు చేయకుండా చూస్తుంది.

## 3. సమాజం కారాగారం నుండి విడుదలైన వారిని ఆహ్వానించాలి

మాజీ ఖైదీలను కరుణతో స్వాగతించాలని, బహిష్కరించబడిన వారిగా పరిగణించకుండా ఉపాధి అవకాశాలు మరియు సామాజిక మద్దతును అందించాలని సమాజానికి పిలుపునిచ్చారు. ఎవరూ విముక్తికి అతీతులు కారని మరియు నిజమైన న్యాయంలో సయోధ్య కూడా ఉంటుందని పాపుగారు గుర్తు చేస్తున్నారు.

మరణశిక్ష రద్దు మరియు గౌరవప్రదమైన జైలు పరిస్థితులు అందించాలి. పునీత యాకోబుగారు వ్రాసిన లేఖ 4:12 ధర్మశాస్త్రమును విధించువాడు దేవుడొక్కడే. ఆయన ఒక్కడే న్యాయాధికారి. ఆయన మాత్రమే రక్షింపను, శిక్షింపను సమర్థుడు. తోడివారి న్యాయాన్యాయములను ఎంచుటకు నీవు ఎంతటివాడవు?. మోషే ధర్మశాస్త్ర ప్రకారము వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీని రాళ్లతో కొట్టి చంపవలెను కానీ ఏసుప్రభువు వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీని మన్నించారు ఆమె మనసును మార్చారు.

జగద్గురువుల అధికార ప్రకటన పత్రం యొక్క ముఖ్యమైన అంశం ఏమిటంటే, మరణశిక్షను పూర్తిగా రద్దు చేయాలి, ఇది మానవ గౌరవాన్ని ఉల్లంఘించడం మరియు దయ, క్షమాపణ అనే క్రైస్తవ విలువలకు ప్రత్యక్ష విరుద్ధంగా ఉన్నాయని ఫ్రాన్సిస్ పాపుగారు తెలియజేశారు. మానవీయ జైలు పరిస్థితులను నిర్ధారించాలని ఆయన ప్రభుత్వాలను కోరుతున్నారు, అవమానకరమైన శిక్షలు మరియు ఒంటరితనం న్యాయాన్ని అందించవు, బదులుగా వ్యక్తులను అమానవీయంగా మారుస్తాయని నొక్కి చెప్పారు.

## జైలు పరిచర్యలో శ్రీసభ పాత్ర

ఖైదీలకు ఆశాకిరణంగా ఉండటానికి, మతసంబంధమైన సంరక్షణ, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం మరియు జైలు సంస్కరణల కోసం వాదించడంలో చురుకుగా పాల్గొనడానికి శ్రీసభ పిలువబడింది. గురువులు, మఠవాసులు, మరియు సామాన్యులు ఖైదీలను సందర్శించడానికి, వారికి నైతిక మద్దతును అందించడానికి మరియు వారి పునరుద్ధీకరణ ప్రయత్నాలలో సహాయం

చేయమని పిలుపునిస్తోంది. రెబిబియా జైలులో పవిత్ర ద్వారం తెరవడం ద్వారా కరాగారంలో ఉన్నవారికి దేవుని దయను విస్తరించాలనేదే శ్రీసభ యొక్క లక్ష్యం అని తెలియజేస్తున్నారు. హెబ్రీయులకు వ్రాయబడిన లేఖ 13:3 లో మీరును వారితో పాటు ఖైదీలైనట్లుగ, చెరసాల యందున్న వారిని స్మరింపుడు. మీరును శరీరముతో ఉన్నారు. కనుక బాధల నొందుచున్న వారిని స్మరింపుడు. దీని ద్వారా స్ఫూర్తిని పొందిన కతోలిక శ్రీసభ చెరసాల పరిచర్య *(prison ministry)* ఎంతో చురుకుగా పనిచేస్తుంది. ఎంతోమంది ఖైదీలకు తోడుగా నిలుస్తున్నారు మరియు వారి జీవితాలకు పునాదులు వేస్తున్నారు. మనం కూడా ఇందులో భాగస్థులమై వారి కోసం పనిచేయాలి.

## చర్యకు పిలుపు

యెషయా 61:1–2లో ప్రభువైన యావే నన్నభిషేకించెను. అతని ఆత్మ నాపై ఉన్నది. పేదలకు శుభవార్తను ప్రకటించుటకును, క్రుంగిపోయిన వారికి ఉత్సాహము పుట్టించుటకును, బందీలకు విముక్తియు, చెరలోనున్న వారికి విడుదల లభించునని తెలియజేయుటకును అతడు నన్ను పంపెను. ప్రభువు అనుగ్రహ వత్సరమును గూర్చియు మన దేవుడు శత్రువులను శిక్షించు దినమును గూర్చియు, ప్రకటించుటకును, శోకించు వారిని ఓదార్చుటకు అతడు నన్ను పంపెను అనే యెషయా ప్రవక్త పలికిన పలుకులు యేసుప్రభువు లూకాగారు వ్రాసిన సువార్తలో 4:18–19వ వచనాలలో ప్రభువు ఆత్మ నాపై ఉన్నది. పేదలకు సువార్తను బోధించుటకై ఆయన నన్ను అభిషేకించెను. చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డివారికి చూపును కలిగించుటకును, పీడితులకు విమోచనమును కలుగ చేయుటకును, ప్రభుహితమైన సంవత్సరమును ప్రకటించుటకును ఆయన నన్ను పంపెను. యేసుప్రభువు స్ఫూర్తిని పొంది తన పరిచర్యను ప్రారంభించారు. మనము కూడా యేసుప్రభు పరిచర్యలో భాగస్తులము కావాలి.

జగద్గురువుల అధికార ప్రకటన పత్రం ద్వారా, ఫ్రాన్సిస్ పాపుగారు ప్రభుత్వాలకు, న్యాయ వ్యవస్థలకు మరియు సమాజానికి కారాగారంలో శిక్షను

అనుభవిస్తున్న వారికి మన వంతు ఏ విధంగా సహాయం చేయవచ్చో మనకు తెలియజేస్తున్నారు.

1. ప్రపంచవ్యాప్తంగా మరణశిక్షను రద్దు చేయడం.
2. ఖైదీలను గౌరవంగా చూసుకోవడం మరియు వారికి విముక్తి మార్గాలను అందించడం.
3. అధిక శిక్ష తగ్గించడం మరియు అందరికీ సమానంగా న్యాయ అందేలా చూడడం.
4. కారాగారంలో ఉన్న వారికి అండగా ఉండడం.
5. శిక్షను అనుభవిస్తున్న వారి కుటుంబాలను పరామర్శించడం.
6. వారి పిల్లలకు విద్య మరియు ఇతర సదుపాయాలను కల్పించడం.

మత్తయి సువార్త 25:43వ వచనములో యేసుప్రభువు తుదితీర్పులో తానే స్వయంగా మనలను ఈ విధంగా అడుగుతారు చెరసాలలో ఉంటిని, నన్ను దర్శింప రాలేదు అందుకు మన సమాధానము ఏంటి అని మనం ఒకసారి ఆలోచించుకోవాలి.

2025 నిరీక్షణ సంవత్సరం ద్వారా కరుణ కలిగి, న్యాయమైన మరియు దయగల ప్రపంచాన్ని నిర్మించడానికి, ఖైదీలను మరచిపోకుండా వారి జీవితాలను మార్చడానికి అవకాశాన్ని ఇస్తుంది.

ఫ్రాన్సిస్ పాపుగారు విశ్వాసులను మరియు గురువులను ఖైదీలకు గౌరవప్రదమైన పరిస్థితులను కలిగించాలని, వారి మానవ హక్కులను గౌరవించాలని మరియు మరణశిక్షను రద్దు చేయాలని పిలుపునిచ్చారు. మరణశిక్ష క్రైస్తవ విశ్వాసానికి పూర్తిగా విభిన్నంగా ఉన్నది. క్షమాపణ అనేది క్రైస్తవ విశ్వాసానికి ఆణిముత్యం లాంటిది. అది ఒకరిలో ఆశను లేదా నిరీక్షణను పుట్టిస్తుంది. ఖైదీలతో సంఘీభావం తెలిపే శక్తివంతమైన సంజ్ఞలో, ఫ్రాన్సిస్ పాపుగారు స్వయంగా జైలులో పవిత్ర ద్వారం తెరిచారు, ఇది ఖైదీలను ఆశ మరియు నూతన విశ్వాసంతో కూడిన భవిష్యత్తు కోసం ఎదురుచూడమని సూచిస్తుంది.

## సారాంశం

ఈ జూబిలీ సంవత్సరములో జగద్గురువు అధికార ప్రకటన పత్రం నిరీక్షణ యాత్రికులమైన మనకు ఎంతో దోహపడుతుంది. ఖైదీలకు పునరావాసం కల్పించడం మరియు సమాజంలో తిరిగి విలీనం కావడానికి మద్దతు ఇచ్చే స్పష్టమైన చర్యలకు పిలుపునిస్తుంది. ఫ్రాన్సిస్ పాపుగారు ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలను పునరావాసానికి ప్రాధాన్యతనిచ్చే న్యాయ వ్యవస్థలను స్వీకరించమని మరియు వారికి రెండవ అవకాశంను అందించమని ప్రోత్సహిస్తున్నారు.

నిరీక్షణ యాత్రికులమైన మనము అందరము కలిసి సమాజంలో శిక్ష మరియు న్యాయం పట్ల దాని విధానాన్ని పునరాలోచించుకోవాలని సవాలు చేస్తున్నారు. అందరికీ దయ, క్షమాపణ మరియు నిరీక్షణను అందించే వ్యవస్థ కోసం మనం తపించాలని వాదిస్తున్నారు. 2025 నిరీక్షణ జూబిలీ సంవత్సరంలో ప్రేమ, దయ మరియు న్యాయం యొక్క విలువలను దైనందిన జీవితంలో జీవించడానికి పిలుపునిస్తూ, ఏ ఒక్కరూ విముక్తి పొందే అవకాశాన్ని కోల్పోకూడదని మనం ఆశించాలి. కారాగారంలో ఉన్నవారికి పాలక పునీతుడైన పునీత మాక్సిమిలియన్ కోల్బే వారి యొక్క ప్రార్థన సహాయాన్ని కోరుకుంటూ ఈ నిరీక్షణ జూబిలీ సంవత్సరంలో మన వంతు కృషి చేద్దాం.

# జూబిలీ 2025
## క్యాలెండర్

### డిసెంబర్ 2024
**డిసెంబర్ 24**
సెయింట్ పీటర్ బసిలికా యొక్క పవిత్ర క్షమా ద్వారములు తెరచుట



### జనవరి 2025
**జనవరి 24-25**
ప్రపంచ సమాచార జూబిలీ

### ఫిబ్రవరి 2025
**ఫిబ్రవరి 8-9**
సాయుధ దళాలు, పోలీసులు, భద్రతా సిబ్బంది జూబిలీ

**ఫిబ్రవరి 15-18**
కళాకారుల జూబిలీ

**ఫిబ్రవరి 21-23**
ఉపగురువుల జూబిలీ

### మార్చి 2025
**మార్చి 8-9**
ప్రపంచ స్వచ్ఛంద సేవకుల జూబిలీ

**మార్చి 28**
ప్రభువు యొక్క 24 గంటలు

**మార్చి 28-30**
కారుణ్య దైవ ప్రచారకుల జూబిలీ

### ఏప్రిల్ 2025
**ఏప్రిల్ 5-6**
వ్యాధిగ్రస్తుల మరియు ఆరోగ్య సంరక్షణ వైద్యులు, సేవకుల జూబిలీ

**ఏప్రిల్ 25-27**
యవ్వనస్తుల జూబిలీ

**ఏప్రిల్ 28-29**
దివ్యాంగుల జూబిలీ

### మే 2025
**మే 01**
శ్రామికుల జూబిలీ

**మే 04**
వ్యాపారవేత్తల జూబిలీ

**మే 10**
మేళ వాయిద్యకారుల జూబిలీ

**మే16**
మౌలిక సంఘాల జూబిలీ

**మే 24**
బాలల జూబిలీ

**మే 30**
కుటుంబాల, అవ్వ తాతల మరియు వయోవృద్ధుల జూబిలీ



### జూన్ 2025
**జూన్ 07**
ఉద్యమాలు, సంఘాలు మరియు కొత్త సంఘాల జూబిలీ

**జూన్ 09**
వాటికన్ జూబిలీ

**జూన్ 14**
క్రీడల జూబిలీ

**జూన్ 20**
ప్రభుత్వాల జూబిలీ

**జూన్ 23**
గురువిద్యార్థుల జూబిలీ

**జూన్ 25**
పీఠాధిపతుల జూబిలీ

**జూన్ 26**
గురువుల జూబిలీ

**జూన్ 28**
తూర్పు శ్రీసభ దేశాల జూబిలీ

### జూలై 2025
**జూలై 28**
యువతా జూబిలీ

### సెప్టెంబర్ 2025
**సెప్టెంబరు 15**
ఓదార్పు జూబిలీ

**సెప్టెంబరు 20**
న్యాయ స్థాపన జూబిలీ

**సెప్టెంబరు 26**
ఉపదేశుల జూబిలీ

### అక్టోబర్ 2025
**అక్టోబర్ 05**
వలసదారుల జూబిలీ

**అక్టోబర్ 08**
దైవాంకితుల జూబిలీ

**అక్టోబర్ 11**
మరియమాత భక్తి జూబిలీ

**అక్టోబర్ 18**
సువార్తా సేవకుల జూబిలీ

**అక్టోబరు 30**
ప్రపంచ విద్య జూబిలీ



### నవంబర్ 2025
**నవంబర్ 16**
పేదల జూబిలీ

**నవంబర్ 21**
గాయక బృందాల జూబిలీ

### డిసెంబరు 2025
**డిసెంబరు 14**
ఖైదీల జూబిలీ




**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 91-040-29561761, 29561762

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing